ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 3 సంచిక - 9 జూన్ 2022 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



సాహితీస్రవంతి

# అనంత'లో అన్నదాతకు అండగా రైతు కవనం



ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి. ఇన్‌సెర్టులో వీరభద్రప్ప



కెంగార మోహన్



సభలో మాట్లాడుతున్న మహిళా రైతు అలివేలమ్మ

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని మే 21వ తేదీన అనంతపురం జెడ్పీ హాల్లో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన రైతు కవనం జరిగింది. వివిధ జిల్లాల నుంచి కవులు హాజరై .. అన్నదాతలకు సంఘీభావంగా తమ కవితలు వినిపించారు. ప్రముఖ రచయిత కుం.వీరభద్రప్ప, సాహితీ విమర్శకులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి కవులనుద్దేశించి ప్రారంభోపన్యాసాలు చేశారు. జనకవనాన్ని మహిళా రైతు అలివేలమ్మ ప్రారంభించారు. సీనియర్ కవులు మొదలుకొని ఇప్పుడిప్పుడే కవిత్వం రాస్తున్న యువతీ యువకుల వరకూ ఈ కార్యక్రమంలో పాల్గొనటం మంచి పరిణామం.



సత్యాజీ



కుమారస్వామి



హరి



తలిమెల అమర్‌నాథ్



చిలుకూరి దీవెన

# సాహిత్య ప్రస్థానం

జూన్ 2022
సంపుటి : 3 సంచిక : 9


## కాశీ, మధుర 'బాకీ' .. కొత్త సంకేతాలు

**'అ**యోధ్య పహలీ జంకీహై, కాశీ మధుర బాకీ హై' ఇది తొంభయ్యోవ దశకంలో సంఘ్ పరివార్ ముందుకుతెచ్చిన నినాదం, వివాదం. 1992లో బాబరీ మసీదు/ రామ జన్మభూమి వివాదాస్పద కట్టడం విధ్వంసం తర్వాత .... పదిహేడేళ్లకు సుప్రీం కోర్టు ఆ స్థలాన్ని హిందూ సంస్థలకు అప్పగిస్తూ తీర్పునిచ్చింది. అయితే ఇది అయోధ్యకే పరిమితమని, 1991 ప్రార్థనా స్థలాల చట్టం (ప్రత్యేక శాసనం) మళ్లీ మళ్లీ ఇలాటి వివాదాలు ముందుకు తెచ్చేఅవకాశం లేదనీ ఆ సమయంలో జస్టిస్ చంద్రచూడ్ మరీ మరీ చెప్పారు. అయోధ్య వివాదంపై అప్పటికే వ్యాజ్యాలు నడుస్తున్నాయి గనక, రాజకీయంగానూ చాలా పరిణామాలు జరిగాయి గనక దానిపై ఏదో ఒక పరిష్కారం చేసి మిగిలినవి వాదాలు రాకుండా చేసుకోవడం శ్రేయస్కరమనీ చాలామంది సరిపెట్టుకున్నారు. అయితే రాజకీయాల కోసం మతాన్ని వాడుకోవడం అనే దుర్నీతి ఆగేది కాదని వారాణసిలో గ్యాన్‌వ్యాపి మసీదు తాజా పరిణామాలు దేశాన్ని హెచ్చరిస్తున్నాయి. ఆలోచనాపరులను ఆందోళనపరుస్తున్నాయి. అత్యున్నత న్యాయస్థానం ఇందుకు అడ్డుకట్ట వేయకపోగా ఏదో న్యాయపరిభాషలో చిచ్చు కొనసాగే పరిస్థితికి దోహదం చేయడం ఇందుకు కారణమవుతున్నది. వారణాసి మెజిస్ట్రేట్ ఉత్తర్వులపై మసీదు నిర్వాహకుల తరపున అంజు మన్ ఇంతెజామియా కమిటీ సుప్రీంకు వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని సమస్యను ఒకేసారి ముగించాలని, దానికి బదులు జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం కేసును తిరిగి స్థానిక కోర్టులకే బదలాయించింది. ఇప్పుడు మధురలోనూ శ్రీకృష్ణ జన్మస్థాన్‌పై కొత్త వ్యాజ్యం మొదలవుతున్నది. కుతుబ్‌మినార్, తాజ్‌మహల్‌పైన కూడా ఇప్పుడు ఏవో వాదనలతో చిచ్చు రగిల్చే ప్రయత్నం చూస్తున్నాం. తెలుగు రాష్ట్రాలతో సహా అనేక చోట్ల వందల వేల ప్రార్థనా స్థలాలు వివాదాస్పదమని తవ్వుకోవడం మొదలెడితే దానికి ముగింపే ఉండదు. గత చరిత్రలో విధ్వంసాలు వివాదాలు పునరావృతం చేయడమంటే పాత గాయాలను కెలకడమే అవుతుంది. భిన్న మతాలతో కూడిన ఈ దేశానికి అంతకన్నా అనర్థం మరొకటి వుండదు. మత రాజకీయాలు ఎవరు చేసినా తప్పే. గురజాడ ఎప్పుడో చెప్పినట్టు అన్నదమ్ములవలెను జాతులు మతములన్ని మెలగడమే సాహిత్యకారుల ఆకాంక్ష. ఉర్వివారికినెల్ల ఒక్క కంచము పెట్టాలన్న వేమన హితబోధా అదే! ■


ప్రధాన సంపాదకుడు
**తెలకపల్లి రవి**
వర్కింగ్ ఎడిటర్
**సత్యాజీ**

సంపాదకవర్గం
**కె.సత్యరంజన్ ◆ కెంగార మోహన్ ◆ వొరప్రసాద్**
**◆ చీకటి దివాకర్ ◆ గనారా ◆ కుమార స్వామి**
మేనేజర్ : **కె.లక్ష్మయ్య**

బొమ్మలు
**తుంబలి శివాజి**
**చిదంబరం**



Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## ఈ సంచికలో ... సాహిత్య ప్రస్థానం జూన్ 2022

### కథలు


| | | |
|---|---|---|
| సంపద | : కరీమ్ | 5 |
| క్రూరమృగాలు | : గన్నవరపు నరసింహమూర్తి | 18 |
| నువ్వే నేనుగా ... | : ఎం.ఆర్ అరుణకుమారి | 33 |
| కదిలిపోతున్న నేల | : పి.శ్రీనివాస్ గౌడ్ | 45 |


### కవితలు


| | | |
|---|---|---|
| మరియపోల్ మాళిగలో ... | : రత్నాల బాలకృష్ణ | 9 |
| సీతాకోకచిలక రెక్కలపై ... | : లక్ష్మి కందిమళ్ల | 9 |
| టెక్నో మినీలు | : పద్మావతి రాంభక్త | 13 |
| వర్షంగా కురుస్తున్నాను | : అఖిలాష | 13 |
| సాయం చేయని చేతులు | : అడిగోపుల వెంకటరత్నం | 14 |
| ఇల్లు లేని నేను | : డాక్టర్ కాళ్లకూరి శైలజ | 14 |
| వంటింటి అతిథి | : పుట్టి గిరిధర్ | 22 |
| నేనెవరిని? | : గిరిప్రసాద్ చెలమల్లు | 25 |
| దొరకని నిధి | : సునీత గంగవరపు | 32 |
| జాలమేక కళ్ల పిల్లా ... | : తగుళ్ళ గోపాల్ | 36 |
| ఎవర్ని నమ్మాలి | : ఏలూరి నాగేంద్రరావు | 40 |
| గర్వభంగం | : చలపాక ప్రకాశ్ | 44 |
| జేగంట | : డా.డివిజి శంకరరావు | 44 |
| కొలువుదీరని కొలువు | : గంగాపురం శ్రీనివాస్ | 52 |
| మత సీసాలో గత చరిత్ర | : ఈదర శ్రీనివాసరెడ్డి | 54 |
| వెండిపువ్వు | : కమలేశ్ | 58 |
| అక్షర నేత్రుడు | : రేకాందర్ గాంధీ | 61 |
| మనిషి సంతకం | : మహబూబ్ బాషా చిల్లెం | 61 |


### వ్యాసాలు


| | |
|---|---|
| సాహిత్య ప్రస్థానం మే 2022 పురస్కారాలు | 17 |
| కళింగాంధ్ర కథల్లో గురజాడ స్థానియతా జాడ – అట్టాడ అప్పల్నాయుడు | 10 |
| వర్తమాన సంక్షుభిత సమాజాన్ని ఆవిష్కరించిన కథలు – మందవరపు హైమవతి | 15 |
| అలజడి రేపిన తొలి అడుగులు – కెంగార మోహన్ | 23 |
| స్వాతంత్ర్యానంతర దశాబ్ది : కథానికల్లో రచయిత్రుల కృషి – మంచూరు కిశోర్, ఆచార్య కిన్నెర శ్రీదేవి | 26 |
| లొట్టిముంత పొంగేలా ఒంపిన కవిత్వం – మెట్టా నాగేశ్వరరావు | 30 |
| సాహితీ ప్రజ్ఞ | 37 |
| వ్యక్తివాదపు తీవ్ర ధ్వని చండీదాస్ 'హిమజ్వాల' – చెరుకూరి సత్యనారాయణ | 38 |
| అంత్యక్రియలు విజయవంతమగుగాక! – చంద్రలత | 41 |
| ఇప్పుడు మౌనంగా ఉంటే ఇక ఎప్పటికీ గొంతెత్తలేం ..! – ఆర్.విజయ శంకర్ | 53 |
| పురుష జాతిపై ప్రేమ్‌చంద్ వ్యంగ్యాస్త్రం నిర్మల – కె.ఆంజనేయ కుమార్ | 55 |
| అద్దేపల్లి సాహిత్యంపై శాస్త్రీయమైన పరిశోధన – ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు | 59 |
| అన్నదాతకు దన్నుగా రైతు కవనం | 62 |
| సంక్షుభిత కాలాలకు ఆమె ఒక అక్షర రూపం | 66 |



ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

**1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000**

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# సంపద

- కరీమ్
99667 57407

**స్థూ**పం సెంటర్ . . .

కండక్టర్ కేకతో కళ్ళు తెరిచాను. బస్సాగింది. దిగాను.

వచ్చే పోయే వాహనాలతో, తోపుడు బండ్ల వాళ్ళతో, జనంతో సెంటరు కిక్కిరిసి ఉంది. వాహనాల్ని, జనాన్ని తప్పుకుని ప్రయాసతో జంక్షన్‌ను దాటాను. పాతూరి వైపు సాగే రోడ్డు మీదికొచ్చి నిల్చున్నాను. ఎదురుగా వినుకొండ కొండ ఆహ్వానం పలుకుతున్నట్లన్పించింది. కొండను చూస్తే చిన్ననాటి నేస్తాన్ని చూసినట్లు మనసు పులకించింది.

చిన్నప్పట్నుండి ఊరికెప్పుడొచ్చినా ఈ దృశ్యం నా నయనానుభూతమే! అప్పటికి, ఇప్పటికి తేడా ఏంటంటే.. అప్పట్లో మోరెత్తి చూస్తే కొండ నిండుగా కన్పించేది. ఇప్పుడు వీధికిరు వైపులా ఎత్తైన మేడలు లేచి అసంపూర్ణంగా కన్పిస్తుంది.

టీ తాగుదామని టీకొట్టు దగ్గర ఆగాను. రాజస్థాన్‌కు చెందిన వాళ్ళు ఈ కొట్టును నాలుగు దశాబ్దాలుగా నడుపుతున్నారు. ఊరికొచ్చినప్పుడు ఇక్కడ టీ తాగడం అలవాటు. కుర్రాడు టీ ఇచ్చాడు.

ఏవో జ్ఞాపకాలు కళ్ళముందు మెదిలాయి.

వినుకొండ మా అమ్మమ్మ వాళ్ళ ఊరు. మామయ్యలు, బాబాయ్‌లు.. ఇలా చాలామంది బంధువులున్నారిక్కడ. చిన్నప్పుడు బడికెప్పుడు సెలవులిచ్చినా ఆటవిడుపుగా ఇక్కడికొచ్చేవాణ్ని. పిన్ని కొడుకు కరీము నా ఈడు వాడే. ఇద్దరం చెట్టా పట్టాలేసుకుని తిరిగేవాళ్ళం. సిన్మాలకు, షికార్లకు వెళ్ళేవాళ్ళం. కొండపైకి ఎక్కేవాళ్ళం.

ఏటా మొహరం పండక్కి అమ్మవాళ్ళతో కల్సి ఇక్కడకు వచ్చేవాణ్ని. పండుగ అయిపోయే వరకు మేమిద్దరం తిండి, నీళ్ళు మానేసి చావిడి దగ్గరే గడిపేవాళ్ళం. తళుకు కాగితాల పూలు, రంగురంగుల గాజు గొట్టాలు, గోళాలతో సేర్లను (మాలలు) చేస్తుంటే ఆసక్తిగా చూసేవాళ్ళం. సేర్లతో అలంకరించాక పీర్లు అందంగా కన్పించేవి.

పది రోజులపాటు జరిగే పండుగలో నౌఖన్ (తొమ్మిదో రోజు) నాటి రాత్రి పెద్ద జాతర జరుగుతుంది. చావిడిని విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. చావిడి ముందు పెద్ద స్టేజి వేసి పాటకచేరి, డాన్స్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేసేవారు. అవి చూస్తూ రాత్రంతా జాగారం చేసేవాళ్ళం. తెల్లవారుఝామున భక్తులు పీర్లను మోస్తూ మండే నిప్పుకణికల మీద అటు ఇటు ఒట్టి కాళ్ళతో నడిచే ఘట్టం ఉంటుంది. ఆ ఘట్టాన్ని పిల్లలం నిబిడాశ్చర్యంతో చూసేవాళ్ళం.

మర్నాడు ఖత్తల్ నిర్వహిస్తారు. ఆ రోజు సాయంత్రం పీర్లను ఊరంతా తిప్పి ఊరేగిస్తారు. అనంతరం చీకటి పడ్డాక పీర్లు గుండాన పడతాయి. గుండాన పడ్డాక భక్తులు పీర్లను మోసుకుంటూ విషాదంగా మాథిం పాడుతూ, గుండెలు బాదుకుంటూ చావిడికి తెస్తారు. వాటిని మూటకట్టి వచ్చే యేడాది కోసం

ట్రంకు పెట్టెల్లో భద్రపరుస్తారు.

పండుగ సంబరం అయిపోగానే ఏదో దిగులు ఆవరించేది. రెండ్రోజులు అనాసక్తిగా ఉండేవాళ్ళం. తర్వాత వచ్చే యేడాది పండుగ కోసం ఎదురు చూస్తూ చదువుల్లో పడిపోయేవాళ్ళం.

పండక్కి వచ్చినప్పుడు బంధువుల ఇళ్ళకు వెళ్ళి అందరిని పలకరించే వాళ్ళం. సమయం లేక ఎవరింటికైనా వెళ్ళకపోతే వాళ్ళు అలిగేవాళ్ళు. మరోసారి వెళ్ళినప్పుడు గుర్తుపెట్టుకుని మరీ వాళ్ళింటికి వెళ్ళేవాళ్ళం.

బంధువుల మధ్య అనుబంధాలు అల్లుకున్న పొదరిల్లులా ఉండేవి. ఒకరిపట్ల ఒకరు ఆప్యాయతలు కనబర్చేవారు. అంతర్లీనంగా అందరిని ఏదో భావోద్వేగం కలిపి ఉంచేది.

కాలం మారింది. కాలంతో పాటు మనుషులు మారారు, మనస్తత్వాలు మారాయి. తీగజాతి తరువుల్లా పెనవేసుకుని ఉండాల్సినోళ్ళు, సరుగుడు చెట్ల మాదిరి నిటారుగా పెరుగుతూ ఎవరికి వారుగా ఉంటున్నారు.

బంధువుల్లో ఆ మంచికాలం తాలుకు పెద్దవాళ్ళు చాలామంది కాలం చేసారు. అమ్మ, నాన్న, పిన్నమ్మలు, పెద మామయ్య ... ఇలా ఒక్కొక్కరే వెళ్లిపోయారు. కొత్త తరం వచ్చింది. ఒకప్పుడు ఉమ్మడి భావనతో సందడిగా ఉండే లోగిళ్ళు ఇప్పుడు ఒంటరి గూళ్ళయ్యాయి. అందరివి ఒంటరి బతుకులయ్యాయి. పాతతరంలో ఆ మంచి కాలపు చిట్ట చివరి ప్రతినిధిగా బాబాయ్ ఒక్కడే ఉన్నాడు.

నిజానికి వినుకొండకు నా చిన్ననాటి మిత్రుడు మధు ఇంట శుభకార్యానికి హాజరయ్యే నిమిత్తం వచ్చాను. కార్యక్రమానికి ఇంకా సమయం ఉండటంతో బాబాయ్‌ని పలుకరిద్దామని బైల్దేరాను.

బాబాయ్ వాళ్ళది షరాఫ్ బజార్‌లో బంగారపు కొట్టు. షరాఫ్ బజార్‌లో బంగారప్పని చేసే లాలమదు అంటే తెలియని వారుండరు. ఊర్లో బాబాయ్ తొలి తరం స్వర్ణకారుడు. సుమారు ఐదు దశాబ్దాలపాటు ఈ వృత్తిలో ఉన్నాడు. ప్రస్తుతం ముదిమి పైబడటంతో పని చేయడం లేదు. వృత్తిపట్ల మరులు పోక ఊరకనే కొట్టుకెళ్ళి కూర్చుంటున్నాడు.

బాబాయ్ దగ్గర ఎంతోమంది పని నేర్చుకున్నారు. అప్పట్లో కుర్రాళ్ళకు పిల్లనివ్వడానికి బాబాయ్ దగ్గర పని చేయడం ఒక అర్హతగా ఉండేది. ఇప్పుడు ఆయన శిష్యులందరూ ఈ వృత్తి చేసుకుంటూ మంచి స్థితిలో ఉన్నారు. పనిలో బాబాయ్ నిజాయితీగా ఉండేవాడు. నిక్కచ్చిగా నగలు చేసిస్తాడని పేరు. దాంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి కష్టమర్లు వచ్చి నగలు చేయించుకునేవారు.

ఎప్పుడైతే కార్పొరేట్ శక్తులు ప్రవేశించాయో అప్పట్నుంచి స్వర్ణకారుల బతుకులు కాంతి విహీనమయ్యాయి. సినిమా హీరోల నుంచి, వ్యాపారవేత్తల దాకా చాలామంది ఈ వ్యాపారం లోకి వచ్చి గొలుసు దుకాణాలతో మార్కెట్‌ను కబళించారు. దీన్ని ఫక్తు వ్యాపారమయం చేసేసారు. జనానికి కూడా నాణ్యంగా నగలు చేయించుకునే ఓపరికం తగ్గిపోయి రెడిమేడ్‌ల కోసం ఎగబడుతుండటంతో స్వర్ణకారుల పరిస్థితి నానాటికి తీసికట్టుగా మారింది. ఒకప్పుడు మంచి ఆదాయం ఉన్న ఉపాధితో పాటు సమాజంలో గుర్తింపు, గౌరవం పొందిన స్వర్ణకారులు కార్పొరేట్ షాపుల రాకతో నగలు చేయించుకునే వాళ్ళు లేక నేడు పూట గడవని స్థితిలో ఉన్నారు.

బాబాయ్ తనకు పన్నెండేళ్ళ ప్రాయమప్పుడు ఒక షావుకారు తనను ఈ వృత్తిలోకి తెచ్చి, పని నేర్పించాడని చెప్పేవాడు. అలా చిన్న వయసులోనే కుటుంబ బాధ్యతలు నెత్తిన వేసుకున్నాడు. కొన్నాళ్ళకు మానంది అనే షావుకారు పంచన కొట్టు పెట్టుకుని సొంతంగా పనులు చేయడం ప్రారంభించాడు. తన రెక్కల కష్టం మీదే ఇద్దరు తోబుట్టువులకు, తమ్ముడికి పెళ్ళిచేసాడు. కన్నవాళ్ళను కంటికి రెప్పలా చూసుకున్నాడు.

బాబాయ్ జీవితానికి సంబంధించి నిజం ఒకటి నాకు ఊహ వచ్చాక అమ్మ చెబితేగానీ తెలియలేదు. బాబాయ్ వాళ్ళమ్మ చిన్నప్పుడే చనిపోయింది. వాళ్ళ నాన్న రెండో పెళ్ళి చేసుకున్నాడు. మారుతల్లిని కన్నతల్లిలా చూసుకుంటూ, ఆమెకు పుట్టిన బిడ్డల్ని రక్తం పంచుకు పుట్టిన అన్నలా సాకి పెళ్ళి చేసాడు. ఈ నిజం తెలిశాక నాకు బాబాయ్ పట్ల గౌరవం మరింత పెరిగింది. కొట్టు మీద వచ్చే ఆదాయంతోనే తన నలుగురి పిల్లల పెళ్ళిళ్ళు చేసాడు.

ఈ వృత్తిలో బాబాయ్ నిజాయితీ పరుడన్న మంచి పేరైతే గడించాడు గానీ పెద్దగా సంపాదించింది లేదు. ఆయన దగ్గర పని నేర్చుకున్న వాళ్ళు ఆయన కన్నా ఆర్థికంగా ఎదిగినా బాబాయ్‌ది మాత్రం ఎదుగు బొదుగు లేని జీవితమే అయ్యింది. వాళ్ళు బాబాయ్ దగ్గర పని మాత్రం నేర్చుకుని, నిజాయితీని ఆయనకే వదిలిపెట్టారు.

కాలంతోపాటు మనం మారాలని, సమాజంతో పోవాలని, అవకాశమొచ్చినప్పుడే నాలుగు రాళ్ళు వెనకేసుకోవాలని ఎంతమంది చెప్పినా ఆయన వినేవాడు కాదు. మోసం చేసి సంపాదించడం తెలివితేటలకు గీటురాయిగా మారిన కాలంలో బాబాయ్ కడదాకా నిజాయితీనే నమ్ముకుని పనిచేసాడు.

ఆలోచనల్లోంచి బైటికొచ్చాను.

టీ తాగి, డబ్బులిచ్చి రోడ్డు మీదికొచ్చాను.

గబగబా నడుచుకుంటూ షరాఫ్ బజార్ కొచ్చాను.

షరాఫ్ బజార్లో బిల్డింగులన్నీ షావుకార్లవి. వాళ్ళ వరండాల్లో బాడుగ ఇచ్చి ముస్లింలు బంగారం, మెరుగు దుకాణాలు నడుపుకుంటారు. దశాబ్దాలుగా నడుపుకుంటున్నా ఎప్పుడు పొరపొచ్చాలు రాలేదు. అందరూ కలసి మెలసి ఉంటారు.

మొహర్రం పండుగ నాడు పీర్ల ఊరేగింపు షావుకార్ల వీధుల గుండా సాగుతుంది. మేం పిల్లలం అమ్మవాళ్ళతో కల్సి షావుకార్ల మిద్దెలెక్కి ఊరేగింపును తిలకించేవాళ్ళం. వాళ్ళు మమ్మల్ని ఏమి అనకపోగా, ఎక్కడ జారిపడతామోనని ఆదుర్దా పడేవారు. జాగ్రత్తలు చెప్పేవారు. అందుకే షరాఫ్ బజార్ నాకు మత సామరస్యానికి ప్రతీకగా కన్పిస్తుంది.

నే వెళ్ళేసరికి బాబాయ్ కొట్లోనే ఉన్నాడు. బతుకు యుద్ధంలో సుదీర్ఘ పోరాటం చేసి అలసిన యోధుడిలా మౌనంగా కూర్చుని ఉన్నాడు. యేణ్ణర్థం క్రితం పిన్ని కాలం చేసాక ఆయనని ఒంటరితనపు దైన్యం వేధిస్తుంది. తోడెగిరిపోయిన వృద్ధ కపోతంలా ఆయన ఒంటరయ్యాడు. ఎక్కువ సమయం అల్లాహ్ జిక్ర్ (స్మరణ)లో గడుపుతూ సాంత్వన పొందుతున్నాడు.

చిన్నోడు ఏదో నగకు మెరుగు పెడుతున్నాడు.

'ఇప్పుడేనా రావడం అన్నా... రా ... కూర్చో!' నన్ను చూసి పలకరించాడు. అవునని తలూపి చెక్క స్టూలు మీద కూర్చున్నాను.

బాబాయ్‌కి సలామ్ చెప్పాను. ఆయన నన్ను చూసి నవ్వుతూ ప్రతి సలామ్ చేసాడు. కాసేపు కుశలాలు మాట్లాడుకున్నాం.

తర్వాత నేనే 'పన్లెలా ఉన్నాయని' అడిగా.

'అవతల పెద్ద పెద్ద షోరూమ్‌లు, కొత్త కొత్త డిజైన్లతో కస్టమర్లను ఆకట్టుకుంటుంటే, ఇంకా మాదగ్గరకొచ్చి నగలు చేయించుకునే దెవరన్నా?' నిరుత్సాహంగా చెప్పాడు చిన్నోడు.

"ఎంత పెద్ద షాపులొచ్చినా, మనమీద నమ్మకంతో కొంతమంది ఖాతాదారులు వస్తున్నార్లే. చేయడానికి పని దొరుకుతుంది" నెమ్మదిగా ఆశావహంగా చెప్పాడు బాబాయ్.

"ఏం పనిలే అన్నా? కూటికి, గుడ్డకు దొరికితే సరిపోతుందా? పిల్లల చదువులేంటి? ఆడపిల్లల పెళ్ళిళ్లేంటి? ఇవన్నీ ఈ గొర్రెతోక సంపాదనతో సాధ్యమౌతాయా? బాగా సంపాదించాల్సిన రోజుల్లో నిజాయితీ అంటూ మడికట్టుకు కూర్చుంటిమి. ఇప్పుడు బాధపడి ఏం లాభం? అసలే అంతంత మాత్రంగా ఉన్న మా బతుకుల మీద కార్పొరేట్ షాపులు మరింత దెబ్బ కొట్టాయి". నిస్పృహగా అన్నాడు చిన్నోడు. బాబాయ్ ఏం మాట్లాడలేదు.

"కార్పొరేట్ షాపుల వాళ్ళు మజూరీ ఫ్రీ అని టీవీల్లో ప్రకటనలిస్తుంటారు. అదెలా సాధ్యం?" ఆసక్తిగా అడిగాను నేను.

"ఎందుకు సాధ్యపడదురా? నగల తయారీలో అవసరానికి మించి టంకం కలుపుతారు. కలిపిన టంకానికి తూకంలో బంగారంతో సమానంగా ధరకడతారు. ఇంక మజూరి తీసుకోవాల్సిన అవసరమేముంది. అంతా మోసం. మనల్ని నమ్మి వచ్చిన వాళ్ళను మోసం చేయడం పాపంరా"

కార్పొరేట్ షాపుల్లో జరిగే మోసాన్ని వివరించాడు బాబాయ్.

"వ్యాపారమన్నాక అంతో ఇంతో మోసం లేకుండా ఎలా ఉంటుంది. సమాజం నువ్వెలా సంపాదించావన్నది కాదు, ఎంత సంపాదించావన్నది చూస్తుంది. డబ్బును బట్టే గౌరవం ఇస్తుంది." ఆవేశంగా చెప్పాడు చిన్నోడు.

"హరామ్ మార్గంలో సంపాదించే ప్రతి పైసాకు రేపు తీర్పు దినాన అల్లాహ్ దగ్గర సమాధానం చెప్పాలి. అలాంటి వాళ్ళకు జన్నత్ (స్వర్గం)లో చోటుండదురా" తాత్వికంగా చెప్పాడు బాబాయ్.

"కన్పించని స్వర్గం కోసం ఇక్కడ నరకయాతన అనుభవించాలంటాడాయన" వెటకారంగా అన్నాడు చిన్నోడు.

"అస్తగఫిరుల్లాహ్ (అల్లాహ్ క్షమించు)" అప్రయత్నంగా పలికాడు బాబాయ్.

కాసేపు నిశ్శబ్దం చోటుచేసుకుంది. చిన్నోడు నగకు మెరుగు పెడుతున్నాడు.

"సమాజం నువ్వు చెప్పినట్లు లేదు కదా బాబాయ్. సమాజంలో ఉన్నందుకు దాంతో పాటు మనమూ నడవాలి కదా" అన్నాను బాబాయ్‌తో.

"అంటే మోసం చేసి సంపాదించాలంటావా? అలా సంపాదించిన డబ్బుతో బంగళాల్లో ఉంటూ, పంచభక్ష్య పరమాన్నాలు తింటే దేహానికి సుఖంగా ఉంటుందేమో, దిల్‌కి సంతోషం ఉండదురా. నిజాయితీతో, మట్టి మిద్దెలో ఉంటూ, గంజినీళ్ళు తాగినా గుండె నిండుగా సంతృప్తి ఉంటుందిరా".

ఉద్వేగంగా చెప్పాడు బాబాయ్.

బాబాయ్ మాటలు నూరుశాతం నిజం. కానీ కాలగతిలో ధర్మానికి, అధర్మానికి మధ్య గీత చెరిగిపోయింది. ఒకప్పుడు అధర్మంగా అన్పించిందే ఇప్పుడు సమాజంలో ధర్మంగా చెలామణి అవుతుంటే బాబాయ్ లాంటి వాళ్ళకు విలువెక్కడ ఉంటుంది. నిజాయితీ పరులను సమాజం వెర్రివాళ్ళ కింద జమకడుతుంటే ఆయన నిజాయితీకి చోటెక్కడుంటుంది.

ఈమాటే బాబాయ్‌తో అన్నాను.

"ధర్మం మండే నిప్పు లాంటింది. అది ఏ కాలంలోనైనా ఒక్కటిగానే ఉంటుంది. మార్పుకు లోనైతే అదసలు ధర్మమే

కాదు అందరూ ప్రాణం ఉన్నంత వరకే బతుకు అనుకుంటారు. కానీ పోయాక నలుగురి గుండెల్లో బతుకుతాం చూడు. అది బతుకంటే! అదే బతుకంటే..."

నిశ్చయంగా చెప్పాడు బాబాయ్.

"ఆయనంతే అన్నా.. మార్చలేం" నిర్లక్ష్యంగా అన్నాడు చిన్నోడు.

అవును. బాబాయ్ మారడు. అసిధార వ్రతంలా ఎన్ని కష్టాలొచ్చినా నిజాయితీగా బతకడానికి గొప్ప సంకల్పశక్తి కావాలి. అది బాబాయ్‌కి మెండుగా ఉంది. స్వార్థ ప్రయోజనాల కోసం విలువలకు తిలోదకాలిచ్చే స్వార్థపరులకు ఆయన గొప్పతనం అర్థం కాదు.

నేనక్కడ ఉండగానే వితంరాజుపల్లె నుంచి ఒక ఆడమనిషి వచ్చింది.

'ఏంది లక్షుమమ్మ.. చానా రోజులకు వచ్చావ్' ఆమెను పలకరించాడు బాబాయ్.

"ధాన్యం డబ్బులొచ్చాయి. నాన్తాడు, గాజులు చేయించు కుందామని వచ్చా" అందావిడ.

"అదేంది లక్షుమమ్మ.. ఇంతకుముందు నీకు చేసిచ్చినట్లు గుర్తే" అన్నాడు బాబాయ్.

ఆ మనిషి ఒక్కసారిగా దుఃఖితురాలైంది. కళ్ళల్లో నీటి చెమ్మ కదలాడింది.

బాబాయ్ కంగారుగా "ఏమైంది లక్షుమమ్మ" అనడిగాడు.

"ఏం చెప్పమంటావు. నెల రోజుల క్రితం నా అల్లుడికి కడుపులో నొప్పి వచ్చింది. వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు డాక్టర్లు. యాభైవేల దాకా ఖర్చవుతుందన్నారు. చేతిలో చిల్లిగవ్వలేదు. నా బిడ్డ తన బంగారపు నగలు అమ్మకానికి పెట్టింది. మార్వాడి వాడు ఆ నగల్ని చూసి బంగారంలో కల్తీ ఎక్కువ ఉందని రూపాయికి అర్ధరూపాయి కూడా రాదన్నాడు."

ఆమె ఏడుస్తూ చెప్తూ ఆగింది.

"నీ బిడ్డ ఆ నగలెక్కడ చేయించింది" అనడిగాడు బాబాయ్.

"ఏదో రెడీమేడ్ బంగారపు షాపులో కొనింది. వాళ్ళ దెవసం జెయ్య అంతా కల్తీ, మోసం'' అంటూ ఆమె షాపువాళ్ళను తిట్టింది.

'మరి ఆపరేషన్ ఎట్లా చేయించారు ?' ఆతృతగా అడిగాడు బాబాయ్. ఆమె చెప్తుంది. నేను ఆసక్తిగా వింటున్నాను.

"నువ్వు నాకు సేసిచ్చిన నాన్తాడు, గాజులు ఇచ్చాను. వాటిని సూసి మార్వాడి వాడు ఏమన్నాడో తెలుసా?" బాబాయ్ వైపు చూస్తూ అందామె.

"ఏమన్నాడు" కుతూహలంగా అడిగాడు బాబాయ్.

"నగల్ని ఎవరు చేసారో కాని మహానుభావుడు వెంట్రుక వాసంత కల్తీ కలపలేదు. నిక్కచ్చి బంగారం. రూపాయికి రూపాయి ఇస్తానని, అప్పటి బంగారం రేటు కట్టి డబ్బులిచ్చాడు. ఆపరేషను చేయించి నా అల్లుడ్ని బతికించుకున్నాను".

చెప్పడం ఆపిందావిడ.

ఆమె చివర చెప్పిన మాటలకు నా మనసు ఆర్ధ్రమైంది. క్షణకాలం మౌనంగా ఉండిపోయాను.

ఆవిడ సంచిలోంచి డబ్బులు తీసి చిన్నోడికిచ్చి, నగల కోసం ఫలానా రోజు వస్తానని చెప్పి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్తుంటే బాబాయ్ అలాగే చూస్తున్నాడు. ఆయన ముఖంలో స్వచ్ఛమైన నవ్వు విరబూసింది. ప్రపంచంలోని సంపదంతా పోగేసినా సరితూగని సంతృప్తి ఆయన కళ్ళలో కన్పించింది.

ఈ క్షణం తన నిజాయితీకి ప్రతిఫలంగా బాబాయ్‌కు తిరిగి ఏం దక్కుతుందో ప్రత్యక్షంగా చూడగలిగాను నేను.

"మనం పోయాక నలుగురి గుండెల్లో బతుకుతాం చూడు. అది బతుకంటే. అదే బతుకంటే."

బాబాయ్ మాటలు చెవుల్లో మారుమ్రోగాయి. బతకడ మంటే ఏంటో మనసుకు ఎరుక అయ్యింది.

ఆమె వెళ్ళిపోయాక బాబాయ్ నావైపు చూస్తు "మోసం చేసి ఎన్ని కోట్లు సంపాదిస్తే ఈ సంతృప్తి దొరుకుతుంది. క్షణికమైన లోకంలో సంతృప్తికి మించిన సంపద ఏముంటుంది రా" అన్నాడు.

బాబాయ్ మాటలతో ఏకీభవిస్తూ తలూపాను.

కార్యక్రమానికి సమయం అవుతుండటంతో దగ్గర సెలవు తీసుకొని అక్కడ్నుంచి లేచాను. ■

**"ప్రపంచం మనం ఊహించినంత వినోదభరితంగా లేదని నేను మీకు హామీ ఇస్తున్నాను. అందుకనే వాస్తవ ప్రపంచం గురించి రాయండి."**

**- పియరీ చోడెర్లోస్ డి లాక్లోస్**

# కవితలు

## సీతాకోకచిలుకల రెక్కలపై..

**క**విత్వం అవ్వాలని ఊహలు
ఎన్ని కబుర్లు చెబుతుంటాయో తెలుసా..
సాయం సంధ్యలో  తలుపు తట్టి
అవి, నవరాగాలు పలుకుతుంటాయి
వెన్నెలను తాగుతూ..

చంద్రుడేమో..  దొంగలా.. మబ్బుల్లో దాగి
నక్షత్రాలకు సైగలు చేస్తుంటాడు
అప్పుడే కదూ.. కలలన్నీ
చిట్టిగౌను వేసుకున్న బుజ్జిపాపాయిల్లా..
సీతాకోకచిలుకల రెక్కలపై నాట్యం చేస్తుంటాయి.

ఇక, ఆ సమయమంతా..
విశ్వాసపు ఆలింగనాలు
పూలపుప్పొడులను రాలుస్తుంటాయి
నిశ్శబ్దపు ప్రశాంతతలో ...

**- లక్ష్మీ కందిమళ్ళ**




## మరియ పోల్ మాళిగలో ....

**బా**టిల్‌లోని ఆఖరి నీటిబొట్టు కూడా అయిపోయింది
నాలిక పిడచ కట్టుకుపోతోంది
గాలి చొరబడని మాళిగలో కూడా ఒక్క ఉదుటున గాలి వీచి
ఆఖరి కేండిల్‌ని కూడా ఆర్పేసింది
కర్ణకఠోరమైన ఇనుప రాపిడి శబ్దాలకు
కాళ్ళ మధ్య తిరుగుతున్న కుక్కపిల్ల
వొణుకుతూ మృత్యుగానం ఆలపిస్తోంది
నగరమంతా మృత్యువు కోసం ఎదురుచూస్తున్నది
స్నాన సంస్కారం లేని నా దేహం
చెత్తకుండీలో కాలిపడివున్న బ్రెడ్ ముక్కలా వుంది
గుప్పుమన్న కడుపుతో బహిర్భూమికి వెళ్ళడానికి కూడా
బాంబుల పులివేటకి జింకనవుతానని భయమేస్తోంది
ఆహారం మల మూత్రాలు ఒకేలాగనిపిస్తున్నాయి
మాతృగర్భంతో విలవిలలాడుతూ
గర్భవిచ్ఛిత్తితో మాళిగంతా నిశ్శబ్ద రోదన చేస్తోంది
పొయ్యి వెలగాల్సిన ఇంట్లో
ఇళ్ళే పొయ్యిలుగా మారి మరియపోల్
సామూహిక శవ దహనశాలగా మారింది
అద్దాలు విరిగిన కిటికీల్లోంచి కర్టెన్ల మంట
కాళనాళికలా భవనాన్ని దహిస్తున్నట్లుంది
నిన్న నేనంతకుముందు నడిచిన వీధిలో నడుస్తున్నాను
చుట్టూ శ్మశాన నిశ్శబ్దం
గాలి కూడా మరణించినట్లుంది
పార్కింగ్ స్థలాల్లో కొంత మంది మనుషుల్లా వున్నారు
దుప్పట్లు కప్పుకొని
సామూహిక ఖననానికి కూడా నోచుకోని దేహాలవి
నాకిప్పుడు ఏ కోరికలూ లేవు
ఈ యుద్ధం ఏ శాంతి వాక్యాల మధ్య విరామ చిహ్నమని అడగను
కానీ నాదొక్కటే చివరి కోరిక
నేను ప్రేమగా పెంచుకున్న పూదోటల మధ్య
నా రక్తమాంసాలు కరిగించి కట్టుకున్న
అందమైన నా పొదరింటి ముంగిట
ఏ కుక్కలు చింపిన విస్తరి కాకుండా
నా దేహం ఖననం కావాలని ...

**- రత్నాల బాలకృష్ణ**
**94401 43488**

విశ్లేషణ






# కళింగాంధ్ర కథల్లో గురజాడ స్థానియతా జాడ

- అట్టాడ అప్పల్నాయుడు

94400 31961

'**....** **పుల్లా!** మా ఊరొచ్చేంరా. యిట్టి ఊరు భూప్రపంచంలో వుండబోదురా. కాళిదాసు అవంతిని ఉద్దేశించి చెప్పిన మాటలు దీనియందు వర్తిస్తున్నాయిరా. యేమి నది, యేమి ఊరు! ఇది శ్రీకాకుళేశ్వరుడి క్షేత్రము. యెట్టి మహాక్షేత్రమని చెప్పను? అదిగో' అని యింకా యేదో చెప్పబోయి ముందర కనబడే దఅశ్యాన్ని చూసి నిశ్చేష్టుడై నిలిచి, కొంత తడవు మాటాడకుండెను...

గురజాడ గారి మతము – విమతము (పెద్ద మసీదు) కథలో నారాయణభట్టు అనే పాత్ర కాశీ నుండి శిష్యుని తోడుతీసు కొని తన ఊరికి వస్తూ తన ఊరి ఘనతనూ, అక్కడి నదినీ, ఆలయాన్నీ వాటి చుట్టూ అల్లుకుపోయిన అలనాటి తీపిగుర్తులనూ పై విధంగా శిష్యునితో చెపుతూ కనుచూపుకి ఆనిన దృశ్యాన్ని చూసి నిశ్చేష్టుడై మాటలు రాక నిలబడిపోతుంది. సరిగ్గా యీ కథ తొలిసారిగా చదివి నేను కూడా ఆ నారాయణ భట్టులాగ నిశ్చేష్టుడనయిపోయేను. చాలాసేపేమీ తోచలేదు. లోలోపల యేమేమో జరుగుతోంది. రాజులూ, యుద్ధాలూ, మతాలూ, ఘర్షణలూ, శిధిలాల్లో మానవ వేదనలూ, కూలిన నిర్మాణాలూ, లేచిన భవనాలూ – మట్టిని ముట్టుకుంటే తడిగా తడితడిగా నెత్తురెవరిదో చేతికి తగిలినట్టు... గుండెల్లో యేనాటివో... మట్టిలో పొర్లాడిన నా తాతతండ్రుల ఉచ్ఛ్వాసనిశ్వాసలు కొట్టుకొని నన్ను ఉక్కిరిబిక్కిరి చేసినాయి!

వందేళ్లకు పైబడ్డ కథ యిది. ఆ ఊరు నేటి శ్రీకాకుళం. ఆ నది నాగావళి నది. ఆ ఆలయం కోటేశ్వరాలయం! దూరం నుండే కంటికి కనబడిన దృశ్యం – ఆలయం స్థానంలో మసీదు! ఇద్దరు బ్రాహ్మలు... మరో ముస్లిం పాత్రతో సంభాషణ! కనబడాల్సిన ఆలయ గోపురం స్థానంలో మసీదు శిఖరం యెలాగొచ్చింది? ఆలయం వద్ద వుండాల్సిన తన బంధువులేమయినారు... ప్రశ్నలు నారాయణభట్టులో –

యిదీ కథ! కథాంశాన్ని యెంతగా మలిచేడంటే – ఆలయాలూ, మసీదులూ, మందిరాలూ కూల్చివేతలూ, మతమార్పిడులూ, మనుషులు పదిలంగా దాచుకునే తీపి గురుతుల చెరిపి వేతలూ ... యీ చిన్నకథ నాకు చూపింది. అంతేగాక ఈనాడు ముస్లింలుగా మిగిలిపోయిన వాళ్ల కుదుళ్లు యీ దేశ సకల కులాల్లో వుండొచ్చున్న వాదనకు భూమికనిచ్చిందీ కథ! ఇంతేనా? ఒక్క శ్రీకాకుళమనే కాదు; అనేక ఊళ్లు – కళ్లముందరే మారి పోవడం, పంటపొలాలు – భవంతులూ, అపార్టుమెంట్లు కావడం, నదులు – నీటినీ, యిసుక తిన్నెలనూ కోల్పోవడం, ఆలయశిఖరాలు – అవెవరి పేర్లనో మోస్తూ నిలుచోవడం, దుంపల బడులు కార్పొరేటు కారాగారాలు గావడం, వీధులు కార్లతో, మోటారు బళ్లతో మార్మోగిపోవడం, రేతిరీపగలూ మనుషులు కలత నిదురతో తుళ్లిపడడం ... యెన్నెన్ని మార్పులు! అవన్నీ... పెద్ద మసీదు కథ తలపుల్లోకి తెచ్చింది. అమ్మో – అనుకున్నాను. అదేపనిగా గురజాడ మిగిలిన కథలూ, కన్యాశుల్కం, కొండుభట్టీయం నాటకాలు, ముత్యాలసరాలు, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ వగయిరా కవితలూ చదివేను. నిజానికి దేశభక్తి గీతం ముందుగా నాకు పరిచయం. విద్యార్థి దశలో పాఠశాలలో యెవరెవరో అపుడపుడూ పాడినపుడు విని వున్నాను. కానీ, నేను పెరిగి పెద్దయ్యేక, గురజాడ సాహిత్యమంతా చదువుకున్న తర్వాతగానీ దానిలోని గొప్ప దనం నాకు తెలియలేదు. పాఠశాలలో పాటగా

విన్నపుడూ, ఉపాధ్యాయులు దాని గురించి చెప్పినపుడూ – దాని ఘనత తెలియలేదు. బహుశా పాడినవారికీ, బోధించిన ఉపాధ్యాయులకీ – ప్రేమించాల్సినంతగా దేశం కనబడలేదేమో!

కానీ యిన్నేళ్ల తర్వాత గురజాడ సాహిత్యమంతా చదివేక – కొత్త వెలుగేదో కన్పించింది. ఆ వెలుగుదివ్వె వందేళ్లకిందటి నాటి దంటే ఆశ్చర్యమేసింది. గురజాడ కన్యాశుల్కం నాటకం వలన సామాజిక దురాచారాలలో యెంతవరకూ మార్పు వచ్చిందోగానీ – సాహిత్య రంగంలోని దురాచారాల్లో మాత్రం సరికొత్త మార్పు వచ్చింది. గిరీశం – కథ అడ్డం తిరిగిందంటాడుగానీ గురజాడ సాహిత్యాన్ని అడ్డంగా దారి తిప్పేడు! ప్రజలభాషకు సాహిత్య గౌరవాన్ని కలిగించేడు. దేవుళ్లనీ, రాజుల్నీ, ధనికుల్నీ సాహిత్య పీఠాల్నించి తొలగించి సాదాసీదా జనా లను( వేశ్యను గూడా)సాహిత్య పీఠమెక్కించేడు. సాహిత్య వస్తు శిల్పాలనేగాక లక్ష్యాలనూ మార్చేడు. ఆధునికతవేపు గురుజాడలు వేసేడు.

అయితే – గురజాడ సాహిత్య ప్రయోజనాన్నీ, లక్ష్యాన్ని తెలుగునేలంతా యెన్నెన్నో విధాల విశ్లేషించివుండొచ్చు,గానీ పెద్దమసీదు వంటి కథ ద్వారా విశ్వజనీన విషయాన్ని స్తానీయతలోంచి చూపటంతో –కళింగాంధ్రా కథకు గురజాడ అందించిన స్తానీయతనూ, దాన్ని అందుకున్న కళింగకథనూ పరిశీలిద్దామనిపించింది. వర్తమాన కళింగకథ... స్తానీయతనూ, అభివఅద్ధి పేరుమీద జరుగుతోన్న స్తానీయ విధ్వంసాన్ని చిత్రించడానికి కుదుళ్లు గురజాడగారి 'దిద్దుబాటు' కథలో కొద్దిగా కనబడగా 'దేవుళ్లారా మీ పేరేమిటి? 'పెద్దమసీదు' కథల్లో పూర్తిగానూ, కంటినిండుగానూ కనబడతాయి!ఎవరయితే వీటిని దర్శించగలిగినారో వారు గురజాడ అడుగుజాడలో స్తానీయతను ప్రదర్శి ంపజేస్తూ అందులోంచి విశ్వజనీన సత్యాన్ని ఆవిష్కరించగలిగేరు. ఒక్క కళింగాంధ్రా అనే కాదు బహుశా తెలుగు నేలంతటా యిలాంటి ఆవిష్కరణలే జరిగివుండొచ్చు. నిర్దిష్టంగా కళింగాంధ్రకు వస్తే ఒక చాసో, ఒక రావిశాస్త్రి, కారా, పతంజలి, భూషణం, శ్రీపతి, రెడ్డిశాస్త్రి, అప్పల్నాయుడు, గౌరునాయుడు, బజరా నుంచి మల్లిపురం జగదీశ్, దాసరిరామచంద్రరావు, చందనపల్లి గోపాలరావు వంటి యెందరో కథకుల కథల్లో యీ కుదుళ్లను చూడగలం!

స్తానీయతకు– నిర్దిష్ట ప్రాంతం, అక్కడి జనజీవనం,జనుల వ్యవహారికభాష,సంస్కఅతీ మాత్రమేగాక వారి చారిత్రకపరిణామం, వారిని ప్రభావం చేసిన అన్ని అంశాలూ కలుపుకుంటే స్తానీయత విశాల అర్ధమిస్తుంది. గురజాడ కథల్లో యివన్నీ కలగలసి కనిపిస్తాయి. వర్తమాన కళింగాంధ్రా కథల్లోంచి వెనకకు గురజాడ కథల్లోకి వెళ్లి చూస్తే యీ స్థానీయత కుదుళ్లను పోల్చుకోవచ్చు. ఇటీవల వార్తల్లో, చర్చల్లో ప్రముఖంగా కళింగాంధ్రాలో వినబడే కన్నెధారకొండ గురించి మల్లిపురం జగదీశ్ రాసిన 'బాకుడుంబారి' కథకు కుదుళ్లు రామ తీర్ధాలు కొండ చుట్టూ గురజాడగారు అల్లిన 'దేవుళ్లారా మీ పేరేమిటి?" కథలో చూడవచ్చు.

గురజాడ 'దేవుళ్లారా మీ పేరేమిటి' కథలో ఒకప్రాంతముంటుంది. ఆప్రాంతప్రజల జీవితముంటుంది. వారి పలుకుబళ్లూ, వారి సంస్కఅతీ, వారి సామాజిక జీవితమూ, చారిత్రక పరిణామమూ, వారిమీద పడిన అనేక అంశాల ప్రభావమూ నేపధ్యంగా మతాలపైన,దేవు ళ్లపైన విమర్శగా కథ నడుస్తుంది.

"....మా పట్నానికి యెనిమిది మైళ్ల దూరంలో రామగిరి అని ఒక విష్ణు క్షేత్రం గలదు. దాని వర్ణన మరి వక మాటు చేస్తాను... ఆ ఊరి నల్లకొండలనంతటను శిధిలమైన బౌద్ధ కట్టడములు కలవు...."అని ప్రాంతీయవర్ణన చేసి, దానినుంచి ఒక సార్వజనీన విషయాన్ని చెప్తారు. అదేమిటంటే–...యీ బౌద్ధకట్టడములను అక్కడివారు పాండవుల పంచలంటారు. ఈ దేశంలో పాండవులు వుండని గుహలూ, సీతమ్మవారు స్నానమాడని గుంటలూ లేవు.." అనే ఒక సార్వజనీన మూఢనమ్మకాన్ని పలికిస్తారు! అలాగే,ఆ బౌద్ధవిగ్రహమును శివుడని, దానిపక్కనున్న దేవీ విగ్రహాన్ని గౌరి అని భావించి జంగాలు పూజ చేస్తున్నారు... "ఇలా సార్వజనీనమయిన ప్రజల విశ్వాసాలను ఒక స్థానీయతనుంచి చెప్తారు! ఇలా కథ కొంత నడిపి,ఆ ప్రాంత చరిత్రనూ, ఆ ప్రజల మతపర విశ్వాసాలనూ పాఠకునికి చూపించుకుంటూ... మతాల మధ్య వైరాన్నీ,మత విశ్వాసాల ఆధారంగా ప్రజల మధ్య విభేదాలను స్వార్ధపరులు వాడుకునే వైనాన్ని కథాంశం చేస్తాడు. ఇదంతా పదేళ్లకిందటిమాట –అనంటూకథ చెప్పడమారంభిస్తాడు. చరిత్రలో జరిగిన మతకల్లోలాలు, ఘర్షణలు వర్త మానంలోనా కొనసాగడాన్ని యీ కథ ఒక ప్రాంతీయ జీవనాధారంతో పాఠకునికి చూపిస్తుంది.

కథలో చెప్పిన పట్నం... విజయనగరం. రామగిరి..నల్లకొండలూ అక్కడికి దగ్గరి రామతీర్ధాల కొండలే! రామతీర్ధాలు ప్రఖ్యాత వైష్ణవాలయం!ఆ కొండ, అక్కడి శ్రీరామాలయం, కళింగ ప్రజల తీర్ధయాత్రలూ తరతరాల పౌరాణిక ప్రవాహం! కానీ దానికి సంబంధించిన ప్రవాహంలో యెన్నెన్నో మలుపులు– శైవ, వైష్ణవ కలహాలు, అధికారుల ఆర్భాటాలు, నేతలనిర్వాకాలు ... ససాక్ష్యంగా కళ్లకుగట్టి, దేవుళ్లకు సంబంధించిన చర్చనంతటినీ చేసి, మూఢభక్తి పైన విసుర్లు విసురుతూ, మతకలహాలపై నిరసనను కలిగిస్తూ... ఒక నిర్దిష్ట

ప్రాంతంలో కధ నంతటినీ నడుపుతాడు గురజాడ. శైవులు, వైష్ణవులు, సాతాన్లు, వారి గురువు శరభయ్య, మనవాళ్లయ్య, క్రిష్ణమాచారి, నాంచారమ్మ, సారధి నాయుడు, పీరుసాయిబు ...వగయిరా సజీవపాత్రలో.... నాటకీయ సంఘటనలో, గ్రామీణ పలుకుబళ్లతో కధంతా పాఠకుణ్ణి ముగ్ధుణ్ణి చేస్తుంది.

...యీ ఊరి నాయలు స్తోమతు కలవాళ్లు. అందులో సారధినాయుడు లక్షాధికారి. అతని బావమరిది రామినాయుడు గ్రామ మునసబు. కొంచెం ధూర్తు,నిషాబాజిన్నీ-భోజనప్రియుడు. యీ తాలూకాలోకల్లా పెద్ద సారాదుకాణం యీ ఊళ్లోనే వుంది. దాన్నిబట్టి ఈ ఊరి యోగ్యత మీరు ఊహించుకోవచ్చు... "కధకుని యీ సంభాషణతో రామగిరికి సంబంధించిన సామా జికదఅశ్యం మనకు తెలుస్తుంది. ఇలా దఅశ్యాలమీదుగా పాత్రలను పరిచయంచేస్తూ, కధను నడుపుతాడు.

ఇలా స్థానీయతలో- ప్రజలభాష, సంస్కఅతీ, సామాజిక జీవితమూ మొత్తంగా దర్శించి దాన్ని సార్వజనీనం చేయ డాన్ని గురజాడ రాసిన నాలుగు కధల్లో మూడింట్లో స్పష్టంగా చూపవచ్చు. వాట్ని అందుకున్న కళింగ కధకుల్లో వీటి కుదుళు చూడవచ్చు - చాసో 'కుం కుడాకు', 'బబ్బబ్బా, రావిశాస్త్రి 'సారాకధలు',కారా 'యగ్యం' 'ఆర్తి', భూషణం 'పులుసు', 'అడివంటుకుంది', శ్రీపతి 'నర్తోదు', 'నెమళ్ల అడవి', పతంజలి 'మోటుమనిషి', గోపాత్రుడుబీ ఎన్నెస్ ప్రకాశరావు 'సోల్ మెండర్' యిలా తొలితర్న కధకులనుంచి మలితరం మీదుగా వచ్చిన రెడ్డి శాస్త్రి అభివఅద్ధి',అప్పల్నాయుడు 'షా, గౌర్నాయుడు 'తిరుగుడుగుమ్మి' బమ్మి డి జగదీశ్వరరావు 'మట్టితీగలు' సువర్ణముఖి 'సుక్కి వంటి కధలేగాక తర్వాతి తరం మల్లిపురం జగదీశ్, చందనపల్లి గోపాలరావ ఎ,దాసరి రామచంద్రరావు, రామారావునాయుడు వగయిరా శ్రీకాకుళ సాహితికధకులూ,వారు ప్రచురించిన 'నాగావలికధలు', 'వంశధారకధలు', జంఝావతికధలు',వేగావతికధలు సంకలనాలలో యీ కుదుళ్లు బలంగా కన్పిస్తాయి.

గురజాడ పెద్దమసీదులో నాగావలి నది గురించీ, నదిఒడ్డు ఊరు శ్రీకాకుళం గురించి చేసిన చింతననూ, దేవుళ్లారా మీ పేరేమిటి కధలో కొండలూ, అక్కడ వెలసిన ఆలయాలూ, వాటి చుట్టూ అల్లుకుపోయిన మతవిశ్వాసాలూ,వాటిని సొమ్ముచేసుకునే పురోహితవర్గమూ, పెత్తందారీవర్గమూ, నలిగిపోయే జనసమూహమూ... ఫలితంగా ప్రాంతీయంగా జరిగిన మార్పులూ చిత్రిం చి యీ కధద్వారా అందించిన ఎరుకను కళింగకధకులు తమ కధల్లో మరింత విశదపరిచేరు! ఈ స్తానీయ చింతననే కాదు గురజాడ అందించిన శిల్పాన్నీ అందుకుంది కళింగకధ. వ్యంగ్యాన్ని మరింత పదునుదేర్చింది (రావిశాస్త్రి, పతంజలి, అప్పల్నా యుడు). నాటకీయతను (చాసో, కారా) కధల్లో పండించింది. ఒకస్తానీయ జనజీవనాన్నంతటినీ యెంత కళాత్మకంగా కధనం చేయొచ్చో గురజాడ చూపిస్తే, తర్వాతితరం కధకులు ఆ బాటను మరింత విశాలం చేసేరు.

ఆ నదిలాంటి నది మరిలేదురా పుల్లా - అని గురజాడ నాగావలినది గురించి వాపోతే, గౌర్నాయుడు 'ఏటిపాట' రాసేడు. కొండలగురించీ, నదీతీరాలమీద పరప్రాంత పెత్తనాల గురించి అప్పల్నాయుడు 'షా' రాసేడు.మట్టిలోపొర్లాడే రైతాంగ బతుకుల వెతలను బమ్మిడి జగదీశ్వరరావు 'మట్టితీగలు' రాసేడు. గురజాడ పెద్దమసీదు వంటి కధల్లో క్లుప్తత ఒక శిల్పంగా తొలి అడుగువేస్తే ... చాసో తన కధలన్నిటా క్లుప్తతను పాటించి ప్రసిద్ధిగాంచేడు. 'ఎందుకుపారేస్తాను నాన్నాకధలో ఆఖరు పదం - పఅప్పారీను..... చదువుతే పెద్దమసీదు కధలో ఆఖరున అసలు భోగట్టా విన్న ఇమాము గారు 'నారాయణా' అని పలకగా చేతిలోంచి చిలుము నేలరాలెను అనే వాక్యమూ, అ ది కలిగించే ఆవేదనా గుర్తుకువస్తాయి.

ఇక వ్యంగ్యం - ... ఈ తాలూకాలోకెల్లా పెద్ద సారాదుకాణం యీ ఊళ్లోనే వుంది, దాన్ని బట్టి యీ ఊరి యోగ్యత మీరు ఊహించుకోవచ్చు..." అని వ్యంగ్యాన్ని గురజాడ పలికిస్తే రావిశాస్త్రి 'సారాకధల్లోనూ, పతంజలి 'రాజుగోరు, వీరబబ్బిలి, గోపాత్రుడు తదితర రచనల్లోనూ, అప్పల్నాయుడు తన కధల్లోనూ, నేస్తం ఊసుల్లోనూ వ్యంగ్యాన్ని అక్షరాస్త్రాలు చేసేరు. "ఏం పాట్లు వచ్చాయిరా పుల్లా దేముళ్లకు..." అని పెద్దమసీదు కధలో గురువుగారు వాపోతే-'దేవుళ్ల పాట్లు తర్వాత సంగతి ముందు సాపాటు చూడండంటాడు శిష్యుడు. పతంజలి గోపాత్రుడు- భోజనం ముఖ్యమా విశ్వాసాలు ముఖ్యమా' అనంటాడు.

చెట్టు చాటునుంచి దీపంపట్టుకొని, జుత్తు విరబోసుకొని ఒక సభదీరిన జనం మధ్యకు మహలక్ష్మమ్మ 'దేవుళ్లారా మీ పేరేమిటి' కధలో వస్తే - యగ్యం కధలో 'సీతారాముడు' పంచాయితీ మంటపానికి వచ్చే దఅశ్యం యించుమించు యిటువంటి దే! నాటకీయదఅశ్యాలను గురజాడ కధల్లో ఒక శిల్పమయితే వాట్ని ...కారా మరింత ముందుకు తీసుకెళ్లడాన్ని యజ్ఞం, చావు, ఆర్తి కధల్లోనా చూడగలం! ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. పాత్రల నిర్మాణం, సంభాషణలు, సంఘటనలు, స్థానీయచిత్రణా అన్ని అంశాలనూ గురజాడ అడుగుజాడగా కళింగ కధ తీసుకున్నదని వందేళ్లకు పైబడ్డ కధల్లోంచి యెన్నెన్నో ఉదాహరణలివ్వవచ్చు.

■

## కవితలు

## టెక్నోమినీలు



**నా** మెమరీని
ఎంత చెరిపినా
కన్నీటిఫైల్స్ చెక్కుచెదరట్లేదు
తెలియని దుఃఖమేదో
వైరస్ లా అతుక్కుంది

**నా** గేలరీ నిండా
ఎన్ని అనుభవాల ఫోటోలో
తడిమిన ప్రతిసారి
టైమ్ మెషీన్ ఎక్కించి
గతంలోకి తీసుకుపోతోంది

**నా** సాఫ్ట్ వేర్ ని
ఎంత అప్ డేట్ చేసినా
బతుకు హ్యాంగ్ అవడం మానట్లేదు

**నా** ఇమెయిల్ నిండా
పొంగి పొరలిపోతూ ఎన్నో జ్ఞాపకాలు
ఈ మధ్యన జీమెయిల్
కొన్ని డిలీట్ చెయ్యమంటూ
గొడవ చేస్తోంది

**"**ఫైవ్ జీ"లతో పరుగు పందెంలో
జేబులోంచి జీవితమెక్కడో జారిపోయింది
మీకు దొరికితే తెచ్చివ్వరూ

**టె**క్నాలజీతో సహజీవనం చేస్తున్నాను
దయచేసి తడి మాటలు చెప్పద్దు
నాకు అర్థం కావు

**ఏ**మిటీ ఇంట్లో వైఫై లేదా
అయితే మీది ఇల్లు కాదు
రాతిగుహ

**ఇం**తకీ చెప్పనే లేదు కదూ
సిరా అవసరం లేని కవిత్వమిపుడు
నన్ను చూసి
'ఓ మరమనిషీ' అంటూ
గాజుతెరై పాడుతోంది

**- పద్మావతి రాంభక్త**
**9966307777**

## వర్షంగా కురుస్తున్నాను

**చొ**రబడుతున్నాను
నిశ్చల విషాదావృత ముఖంతో
పల్లపు కొండ నేల నుంచి
సీతాకోక చిలుక రెక్కల రంగులను
పులుముకొని అనంత స్వచ్ఛ జలాల్లోకి ...
పిచ్చి కలల్లో ఎగిసిపడే నిషిద్ధ అలల్ని
సముద్రపు అంచున విస్తరించే
నీరుపట్టిన మట్టి పువ్వులను
తాకాలని, అణచాలని ...

నీకు తెలుసా?
జీవితం తృణప్రాయ కాలంలో కలిసే
అసత్య కలల విత్తు
కాలప్రవాహంలో
చిక్కుపడిన పాదముద్రలను పరీక్షిస్తున్నాను

నిశ్శబ్దంలోకి జారిపోయి
శిలాగర్భంలోని సంగీతానికి
ఉషస్సుకై మెరుపులాదూకే హృదయపు కుందేలిని
గాయపడ్డ సాలీడు బాల్యాన్ని స్మరిస్తున్నాను

కన్నీళ్లతో మేఘాలు కరగడం
కాంతి మగిలిపోవడం
గుప్పెడు జ్ఞాపకాలను
ఏం చేసుకోవాలో తెలియక
కమ్ముకొస్తున్న ఖడ్గాకాశంలోంచి
కారిన రక్తపు బొట్టును కలగంటున్నాను

చీకట్లో ప్రవహిస్తున్న నది మంద్రంగా నవ్వుతోంది
దిక్కు తెలియని మలుపుల్లో
చరిత్ర పచ్చికల మీద
కదిలిపోతూ, చివికిపోతూ వెన్నెలను విరిచేస్తూ
శాంతి శిఖరాల నుంచి వర్షంగా కురుస్తున్నాను
ప్రపంచ బాధను గ్రహిస్తున్నాను
బాధపడుతున్నాను గొంతెత్తి గర్జిస్తున్నాను!

**- అఖిలాశ**
**72595 11956**

## సాయం చేయని చేతులు

రాత్రంతా నిద్రించిన కాళ్ళకు
వాహ్యాళి అక్షరాభ్యాసం
ప్రాత:కాల విహారం
ఆహ్లాదాల హరివిల్లు
చీకటి వడగట్టిన గాలితేలికై
ఉషస్సులో శరీరాన్ని స్పృశిస్తుంది
పులకించిన వొళ్ళు
గాల్లో దూది పింజౌతుంది!
కాలువ గట్టుపై కప్ప ఆర్తనాదానికి
నిశ్శబ్దం భయపడి దాగింది
కత్తుల బోను పామునోరు
కప్పపై పట్టు బిగిస్తూంది
దృశ్యం కంటపడ్డాక నా మనసు మెలి తిరిగింది!
ఆర్తనాదం మొరగా మారింది
గజేంద్ర మోక్షం గుర్తొచ్చి
విష్ణుమూర్తి మొసల్ని చంపటం ప్రత్యక్షమైంది!
శక్తిహీనమై మొర శోకంగా మారింది
దేవా దీనబాంధవా అంటూ
ద్రౌపది కన్నయ్యను నిండుసభలో
ప్రార్థించటం వీక్షించాను!
శోకం వ్యథగా మారికొడిగట్టిన దీపమైంది
నా బెరుకు గుర్తించిన పాము
కళ్ళు అటు తిరిగాయి
నా రక్షణ కోరిన కప్ప
చూపు యిటు తిరిగింది!
సాయం చేయని చేతులెందుకు
అబ్రహాం లింకన్ ఉపన్యాసం ప్రతిధ్వనించింది
శబ్దం నిశ్శబ్దమైంది
పోరుగెల్చిన పాము ఎగరేసిన తోకను
విజయపతాకం చేసి పొదలోకి దూరింది!
బలవంతుడు బలహీనుణ్ణి భక్షించటం చూశాను
చూస్తున్నాను
బేలతనం, భీతి నన్ను తూకం వేస్తున్నాయి!

**- అడిగోపుల వెంకటరత్నం**
98482 52946

## ఇల్లు లేని నేను ...

ఆ విరిగిపోయిన మేడ మాదే
పూలగుత్తిలా కలిసి బతికే వాళ్ళం.
ఇప్పుడది ఇటుకల గుట్ట
పొడుచుకొచ్చిన ఇనప చువ్వల కట్ట
ఎన్ని గంటలు గడిచినా
పల్చబడని పొగ మబ్బు చాటున
ఆబగా నోరు తెరిచిన పొరుగు దేశం

అమ్మ పిలుపు వినే చెవిలో
పేలుళ్ళు మరీ మరీ మోగుతూ
తెల్లారేసరికి ఊరంతా ఏడుపు పాట!
నాన్న కుడికాలు ఎక్కడో పడిపోయింది
పొడు వాసనేదో పొట్టలో చేరి, పేగుల్ని చుట్టబెడుతోంది
ఈ మధ్యే తెరిచిన మా బడి ముక్క చెక్కలై మిగిలింది!

రంగు దీపాలు వెలిగే పక్షిలా ఎగిరే గాలి ఓడ
పగబట్టి నిప్పులు కక్కుతోంది
చావు ఆకాశంలోంచి రావచ్చని
ఇప్పటి దాకా నాకు తెలీదు

పోయినదంతా పోగా,
సొరంగాల్లో ముడుచుకున్న కాళ్ళు
అడుగు పడక మొరాయిస్తాయి
బతకాలనుంటే
మళ్ళీ పరుగు తీయమని కూలిపోయే వంతెన ఊగుతోంది


ఇదంతా వట్టి పీడకలైతే బాగుణ్ణు
ఊరిని నలిపేస్తున్న తుపాకుల మధ్య
లెక్క పెడితే మనుషుల కన్న శవాల సంఖ్యే ఎక్కువ
పగలూ రాత్రీ ఒకేలా నన్ను భయపెడుతున్నాయి

ఆకలేస్తే ఇవేం కనబడవు
నేల మట్టమైపోయిన బరంతులోనే
రొట్టెల దుకాణం ఎక్కడుందో వెతుక్కుంటాను.

నేను గాయకుణ్ని కావాలనుకున్నాను
గాయాలతో మిగిలాను
ఈ శబ్దాల మధ్య నిశ్శబ్దం తలకి ఎక్కిన తర్వాత
ఒకే ఒక్క ప్రశ్న మిగిలింది : .... నేనేమౌతానో?

(ఉక్రెయిన్ యుద్ధభూమిలో ఒంటరి చిన్నారి ఆవేదనాంతరంగం)

**- డాక్టర్ కాళ్ళకూరి శైలజ**






# వర్తమాన సంక్షుభిత సమాజాన్ని ఆవిష్కరించిన కథలు

- మందవరపు హైమవతి
94410 62732

స్వాతంత్ర్యం వచ్చి ఏడు పదులు దాటినా బడుగు బతుకులు మరింత చేదుపాటలయ్యాయే తప్ప మార్పేమీ రాలేదు. ప్రజాస్వామ్యం ముసుగులో నీతీ నిజాయితీ కల అధికారులకు ప్రతిక్షణం గండమే. చదువంటే ఇంజినీరింగ్ అని, పరీక్షలంటే ఎంసెట్ అని కొత్త నిర్వచనాలు వచ్చి చాలా కాలమైంది. ఒత్తిడి భూతం రంపపుకోతకు గురై పరీక్షా ఫలితాలు వచ్చిన రోజున తప్పిన విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆకాశంలో సగమని చెప్తూనే స్త్రీలను ఇంటికే పరిమితం చేస్తున్నారు. ఇరవై నాలుగు గంటలూ కుటుంబానికి చాకిరీ చేస్తూ జీవితమంతా మగ్గిపోతూనే ఉన్నారు. ఆధునిక మహిళలు కూడా ఆదర్శ మాతలు అనిపించుకోవడానికి తమలో ఉన్న సకల కళాభిరుచులకు సమాధులు కడుతూనే ఉన్నారు. ఇటీవల కరోనా వల్ల చాలామంది పేదలు పనులు లేక ఎన్నో కష్టాలు పడ్డారు. ఇవన్నీ పద్మావతి రాంభక్త రచించిన 'కురిసి అలసిన ఆకాశం' కథాసంపుటిలోని ఇతివృత్తాలు.

పద్మావతి ఇంతకు ముందే 'కొత్త వేకువ' కవితా సంపుటితో కవయిత్రిగా సుప్రసిద్ధులు. కవిత్వం కథ ఈ రెండు ప్రక్రియల్లో కృషి చేస్తున్న ఈమె కథలు పాఠకులను ఆలోచింపజేస్తాయి. పురుషాధిక్య సమాజంలో స్త్రీ ఇప్పటికీ రెండవ తరగతి పౌరురాలే. నియమాల పంజరాలు, నిషేధాల లక్ష్మణరేఖలు అన్నీ స్త్రీలకే. సహనం, శాంతం, కరుణ స్త్రీలకు సహజమైన ఆభరణాలని, గట్టిగా నవ్వకూడదని, మాట్లాడకూడదని శిలాశాసనాలు చేశారు. స్త్రీలకు కూడా కోపమూ, ద్వేషమూ మొదలైన గుణాలు ఉంటాయి. కానీ ఎప్పుడు కోపం వచ్చినా బయట పడకుండా తనలో తనే నిగ్రహించుకుంటుంది. 'పేలిన మంచిపర్వతం'లో పద్మావతి అలాంటి స్త్రీ. సంవత్సరాల తరబడి తనలో అణచి వేసుకున్న ఆగ్రహ పర్వతాన్ని చివరకు ఒక్కసారిగా బద్దలుకొడుతుంది. పద్మావతికి ఒక అక్క, ఒక తమ్ముడు ఉంటారు. చిన్నప్పుడు అక్కా తమ్ముడు తనపై అన్యాయంగా ఆరోపణలు చేస్తున్నపుడు తల్లి కూడా వాళ్ళనేమీ అనకుండా ఆమెనే సర్దుకోమంటుంది. పెళ్ళయ్యాక కూడా ఆమె జీవితం ఏమీ మారలేదు. భర్త కోపిష్ఠి. భార్యతో 'నాకు కోపం ఎక్కువ, కోపంలో ఏమన్నా పట్టించుకోకు' అని ముందరి కాళ్ళకు బంధం వేస్తాడు. పిల్లలు, అత్తగారు ఆమెనే నిందిస్తారు. కానీ ఒక సందర్భంలో ఆమె కోపాన్ని అణచుకోలేక ఖరీదైన పూలకుండీని బద్దలు కొడుతుంది. ఇంతకాలం శాంతమూర్తిగా ఉన్న భార్య ఒక్కసారిగా భద్రకాళిగా మారిపోయిందేమిటా అని ఆశ్చర్యపోతాడు భర్త. మనసులో అనుకున్న మాటలను పైకి చెప్పలేకపోవడం, ఆగ్రహం ఆవేశం మొదలైన అనుభూతుల్ని బైట పెట్టలేకపోవడం, స్త్రీలపై కనిపించని హింస గురించి ఈ కథలో చాలా బలంగా చెప్పారు రచయిత్రి. శారీరక హింస కన్నా మానసిక హింస మరింత భయంకరమని ఈ కథ చెబుతోంది.

'పూలవర్ణలోకం' పిల్లల్లో ఆటిజానికి సంబంధించిన కథ. ఆటిజం ఉన్న పిల్లలు మామూలు పిల్లల్లా ఉండరు. ఎవరైనా ఏదైనా అడిగితే సమాధానం చెప్పరు. అర్థం లేకుండా నవ్వుతుంటారు. బుద్ధిమాంద్యం ఉన్న ఈ పిల్లలను పెంచడం చాలా కష్టం. సమాజంలో తోటివారు ఈ పిల్లల్ని చూసి ఎగతాళి చేస్తుంటే తల్లిదండ్రులు అవమానంగా భావిస్తారు. ఇలాంటి పిల్లల్ని మామూలు పిల్లల కంటే ఎక్కువ ప్రేమతో శ్రద్ధతో చూడాలి. అప్పుడు క్రమక్రమంగా వాళ్ళు మామూలు పిల్లల్లా కాస్త మారే అవకాశముంది. కొంతమంది శిక్షణ పొందిన

థెరపిస్టులు ఇలాంటి పిల్లలకు భాషతో పాటు, పనులు ఎలా చెయ్యాలో నేర్పిస్తారని ఈ కథలో చెప్తారు. పిల్లల్లో కొంతమంది పెద్దల్లా ప్రవర్తిస్తారు. అవసరమైతే మోయలేని బాధ్యతలను కూడా తలకెత్తుకుంటారు.

'కిడ్నాప్'లో ఒక కూతురు వాళ్ళ నాన్నను నక్సలైట్లు కిడ్నాప్ చేసినపుడు తల్లికి ధైర్యం చెబుతుంది. గిరిజన కార్పొరేషన్ ఎమ్డీగా పని చేసే వాళ్ళ నాన్న గిరిజనులను దళారీలు మోసం చేస్తుంటే, ఆ మోసాల బారిన పడకుండా వారికి అండగా నిలబడతాడు. అవసరమైనపుడు వారికి వైద్యసహాయం కూడా అందిస్తాడు. అలాంటి నాన్నను నక్సల్స్ ఎత్తుకుపోయినపుడు ధైర్యంగా నిలబడడమే కాక వాళ్ళమ్మకు కూడా ధైర్యం చెప్తుంది. ఇప్పటికీ పురుషాధిక్య సమాజంలో అబ్బాయిలే కావాలని కోరుకుంటారు చాలామంది. అమ్మాయిలు కూడా వాళ్ళకేమీ తీసిపోరు అనే విషయాన్ని తెలియజేస్తుంది ఈ కథ. 'కిడ్నాప్'లో కూతురు బాధ్యత తెలిసిన వ్యక్తి. ముఖచిత్ర కథ 'కురిసి అలసిన ఆకాశం' స్వార్థపరురాలైన కూతురు కథ. సాధారణంగా అమ్మలందరూ నిస్వార్థంగా పిల్లలను ప్రేమిస్తారు. ప్రియురాలు అడిగిందని తల్లి గుండెను తీసుకెడుతున్న కొడుకుతో 'దార్లో రాళ్ళుంటాయి చూసి నడవమని' తల్లి చెప్పిన కథ అందరికీ తెలిసిందే. ఈ కథలో సురభి తల్లి ఒంటరి తల్లి. పెళ్ళయ్యాక కొద్ది కాలానికే భర్త పోతే ఆమెను పెళ్ళి చేసుకోవడానికి చాలామంది ముందుకు వచ్చినా, కూతురు కోసం ఎవరినీ పెళ్ళి చేసుకోకుండా కష్టపడి ఉద్యోగం చేసి కూతురిని పెంచి పెద్ద చేస్తుంది. కానీ కూతురు తల్లిని అర్థం చేసుకోకుండా తన స్వార్థం తను చూసుకుంటుంది. తనకు నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకుని తల్లి దగ్గర చివరి పైసా కూడా తీసుకోవాలని అనుకుంటుంది. వీటన్నిటినీ సహించి సహించి చివరకు ఓర్పు నశించి ఆశ్రమంలో చేరిపోతుంది తల్లి. 'రంగు వెలిసిన బతుకు' పేదరికంలో చిక్కుకున్న తల్లీకూతుళ్ళ కథ. ఈ సమాజంలో పేదవాళ్ళైన మగపిల్లలు దొంగలుగానో, సంఘ విద్రోహక శక్తులుగానో మారితే అమ్మాయిలు వ్యభిచారులుగా మారుతున్నారు. రోజులు గడవడానికి కడుపు నింపుకోవడానికి ఏ అవకాశం ఇవ్వని సంఘం బలవంతంగా వారికి పడుపు వృత్తి తప్ప మరొకటి గతి లేదని పాఠం చెబుతుంది. ఈ కథలో వసుధ వాళ్ళమ్మ అద్దె కట్టడం కోసం తప్పనిసరిగా అడ్డదార్లో అడుగెయ్యక తప్పనిసరి పరిస్థితికి పాఠకుల కళ్ళు చెమరుస్తాయి.

'ఎంపిక' మరొక మంచి కథ. శ్రీవల్లి పెళ్ళికి సంబంధించిన కథ ఇది. శ్రీవల్లికి ఐఐటి సీటు రాకపోతే ఎంసెట్‌లో మంచి ర్యాంకు తెచ్చుకుని ఇంజనీరింగ్‌లో చేరి ఆపై ఉద్యోగం తెచ్చుకుంటుంది. సంజయ్, వంశీ ఆమెను పెళ్ళి చేసుకోవాలనుకున్న వరులు. సంజయ్ ఐఐటి చదివి మంచి కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వంశీ ఒక బ్యాంకు మేనేజర్. పెద్ద ఉద్యోగి అయిన సంజయ్‌ను చేసుకోవడం మానేసి వంశీని ఎందుకు చేసుకోవాలనుకుంటుందో తల్లిదండ్రులకు అర్థం కాదు. చివరకు సంజయ్ అహంకారి అని, వంశీ తనను అర్థం చేసుకునే అబ్బాయని చెప్పడంతో తల్లిదండ్రులతో పాటు పాఠకులు కూడా కుదుటపడతారు. ఏ ఆధునిక యువతి అయినా తనను అర్థం చేసుకునే వాడిని, అన్ని విషయాల్లో తనను ప్రోత్సహించే వాడిని కోరుకోవడమే ఈ కథావస్తువు.

పిల్లల మనసులు అద్దంలా నిర్మలంగా ఉంటాయి. పెద్దలకున్న స్వార్థం, ద్వేషం వారికి ఉండవు. అలాంటి పిల్లల కథే 'పూల మనసులు'. కరోనా వచ్చినపుడు ప్రభుత్వం లాక్ డౌన్ ప్రకటించింది. చిన్న చిన్న పనులు చేసుకుని జీవించే వాళ్ళకు పనులు పోయి తినడానికి తిండి కూడా లేక బాధ పడ్డారు. వరుణ్ వాళ్ళు ఒక అపార్ట్‌మెంటు దగ్గర ఉంటారు. వాళ్ళ అమ్మమ్మ రోజూ దేవుడి దగ్గర పెట్టే ప్రసాదాలు మాయమైపోతూ ఉంటాయి. కొన్ని రోజులకు సెల్లార్‌లో ఉండే వాచ్ మేన్ కొడుక్కి రోజూ వరుణ్ ప్రసాదాలు పెట్టేవాడనే రహస్యం బయటపడుతుంది. ఎందుకిలా చేసావని వాళ్ళమ్మ అడిగితే 'వాచ్ మేన్‌కి జీతం ఇవ్వడం లేదట, డబ్బులు అడిగితే ఇక్కడ నుంచి వెళ్ళిపొమ్మన్నారుట. వెళ్ళడానికి బస్సులు లేవు కదా. ఒక రోజు వాచ్ మేన్ కొడుకు అన్నం లేక ఏడ్చాడు. అందుకని నేను రోజూ ఇలా ప్రసాదాలు ఇస్తున్నాను' అని అంటాడు. అప్పటి నుంచీ వాళ్ళ ముగ్గురికీ వరుణ్ వాళ్ళమ్మ భోజనాలు పంపిస్తుంది. చిన్న పిల్లల్లో ఉండే అమాయకత్వం, నిస్వార్థ స్వభావాన్ని ప్రతిఫలిస్తుంది ఈ కథ.

కరోనా వచ్చాక అందరికన్నా ఎక్కువ నష్టపోయింది వలస కూలీలు. ఇక్కడ పనులు లేక సొంత ఊళ్ళకు వెళ్ళడానికి రైళు ్ళ, బస్సులు లేక కాలినడకతో బయలుదేరిన ఎందరో కూలీలు నడవలేక తినడానికి తిండి లేక మధ్యదారిలో మరణించారు . 'కూలిన వెన్నెల'లో లచ్చిమి ఎంకటేసులు అలాంటి కూలీలే. పట్నంలో పని కోసం వచ్చిన వీరు కరోనా రావడంతో పనులు లేక అర్థాంతరంగా వారి సొంత ఊరికి వెడుతున్నపుడు మధ్య దార్లోనే లచ్చిమి మరణిస్తుంది. జంటగా బయలుదేరిన ఎంకటేసు ఒంటరిగా మిగిలిన విషాదాన్ని చిత్రీకరిస్తుంది ఈ కథ. కార్పొరేట్ చదువుల కాలంలో పిల్లలకు ఆటలు, పాటలు, కథలు ఏమీ లేవు. తెల్లారి లేచిన దగ్గర నుంచి నిద్రపోయేవరకూ చదువు, పరీక్షలు, కోచింగులు. బాల్యం వెన్నెల కోల్పోయిన బతుకులు నేటి విద్యార్థులవి. తల్లిదండ్రుల ఇష్టాలను పిల్లలపై బలవంతంగా రుద్దుతున్నారు నేడు. పిల్లలకు ఇష్టమైనవి చదివిస్తే

## సాహిత్య ప్రస్థానం మే 2022 పురస్కారాలు

**తెలుగు కథలకు ఇంగ్లీషు పేర్లా?**
*వ్యాసానికి రూ.500*
రచయిత: **ములకలపల్లి కోటేశ్వరరావు**

■■■

**ఇరవై ఏళ్ల కల**
*కథకు రూ.500*
రచయిత: **అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి**

*కథకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం*

*వ్యాసానికి డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాల్లో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*


**- ఎడిటర్**

వాళ్ళు వాటిలో రాణిస్తారు. ఈ విషయం చాలామందికి తెలియదు. 'ఎగిరే పావురమా'లో కార్తీక్ చిన్నప్పుడు తన తోటి పిల్లల్లా చదివేవాడు కాదు. కానీ బొమ్మలు బాగా గీసేవాడు. ఆ తర్వాత టెంత్ ఇంటర్ పాసవుతాడు. తనకు ఇష్టమైన డ్రాయింగ్ కు సంబంధించిన చదువు చదువుకుని ఇంటీరియర్ డిజైనర్ గా జీవితంలో స్థిరపడతాడు. గూళ్ళలో బంధింపబడిన పావురాలు ఎగరలేవు, స్వేచ్ఛగా వదిలేస్తేనే అవి ఎగురుతాయి అనే సందేశాన్ని అందిస్తుంది ఈ కథ.

ఈ ఆధునిక యుగంలో చాలామంది స్త్రీలు చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నారు. ఇవన్నీ చూసి స్త్రీలు చాలా అభివృద్ధి చెందారు అనుకుంటారు కానీ, వాస్తవ పరిస్థితి వేరు. కాలమెంత మారినా పురుషుల దృష్టిలో స్త్రీలంటే కేవలం గృహిణులు, ఇల్లాళ్ళే. పెళ్ళి కాకముందు బాగా చదువుకుని చదువుల్లో రాణించినా, తనకు అభిరుచి ఉన్న ఏదైనా కళలో నిష్ణాతులైనా పెళ్ళయ్యాక వాళ్ళ సర్వశక్తులన్నీ కేవలం కుటుంబానికే అంకితం చేస్తారు. భర్తగానీ, పిల్లలుగానీ ఆమెలో ఉన్న నైపుణ్యాలను గమనించరు. వంట చెయ్యడం, పిల్లల్ని పెంచడం, ఇంటిని తీర్చిదిద్దడంలోనే ఆమెలోని ప్రతిభాపాటవాలు అణగిపోతాయి. ఆమె కూడా తనలోని కళలను మరచి మామూలు మహిళగా మారిపోతుంది కానీ కొంతమంది ఈ మామూలు జీవితానికి ఇష్టపడరు. 'నువ్వు కూడా'లో సుగుణ పెళ్ళి కాక ముందు పుస్తకాల పురుగు, కథలు కవితలు రాసేది. కానీ పెళ్ళయ్యాక ఇద్దరు పిల్లలతో తీరిక లేక అంట్లగిన్నెలు, అట్లపెనాలే ఆమె అక్షరాలయ్యాయి. కానీ ఒక సందర్భంలో తనను తానుగా నిలబెట్టుకోవడానికి ఒక రచయిత నడిపే సేవాశ్రమానికి వెళ్ళిపోతుంది. 'చిన్ని చిన్ని ఆశ'లో వసుధకు పుట్టినరోజు పండుగ చేసుకోవాలని చిన్న కోరిక. అది ఆమె అరవైయ్యవ పుట్టినరోజుకి కోడలి వల్ల సాకారమవుతుంది. 'దీపంలో చమురు', 'గెలుపు' మానవ సంబంధాలకు సంబంధించిన కథలు.

సమాజం బిగించిన చట్రంలో ఇమడలేక బయటకు వచ్చి కొంచెం ఊపిరి పీల్చుకోవాలనే స్త్రీలు, వ్యక్తిత్వం కోసం తపన పడే స్త్రీలు ఈ కథల్లో కనిపిస్తారు. కేవలం చదువులకే పరిమితమవడం వల్ల సృజనశక్తులు కోల్పోయే విద్యార్థులు, మానవత్వపు వెన్నెల వెదజల్లితే నిరుపేదల జీవితాల్లో వెలుగులు చూడవచ్చనే ఆశాభావం ఈ కథల్లో ప్రతిబింబిస్తుంది. కల్లోలకరోనా సమయంలోనూ కరుణ కురిపిస్తే ఈ ప్రపంచం మరికాస్త ఆనందంగా సుఖంగా సుందరంగా కనిపిస్తుందని ఈమె కథలు చెప్తాయి.

పద్మావతి కవయిత్రి కాబట్టి కథలన్నిటికీ కవితాత్మక శీర్షికలు పెట్టారు. ఈ కథలన్నీ ఆలోచనలకు పదును పెడతాయి. ఈ సంక్షుభిత సమాజాన్ని అద్దంలో చూపిస్తాయి. సరళమైన శైలితో, లోతైన భావనలతో రచించిన వర్తమాన కథలు పాఠకులకు ఏకబిగిన చదివింపజేస్తాయి. వీరు మరెన్నో కథలు రాసి తెలుగు సాహిత్యంలో కవయిత్రిగానే కాకుండా రచయిత్రిగా కూడా తమదైన ముద్ర వేయాలని ఆశిద్దాం. ■



**నేనింత పిడికెడు మట్టే**
**కావొచ్చు..**
**కలమెత్తితే నాకు ఒక దేశపు**
**జెండాకున్నంత**
**పొగరుంది..'**

**- శేషేంద్ర**



# క్రూరమృగాలు

- గన్నవరపు నరసింహమూర్తి
77520 20123

**ఆ**రోజు నేను ఆఫీసు కెళ్తూ ఉంటే నా పియ్యే సుధాకర్ వచ్చి ఒక దినపత్రిక ఇచ్చాడు. మొదటి పేజీలో ... పాచిపెంట అటవీ ప్రాంతంలో పులిబారిన పడ్డ గిరిజనులు... ఇద్దరు మృతి' అన్న వార్త ఉంది.

“వారం రోజుల నుండి పాచిపెంట అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తూ గిరిజనుల్ని భయభ్రాంతుల్ని చేస్తున్నట్లు అక్కడి గిరిజన గ్రామాల వాళ్ళు చెబుతున్నారు. నిన్న కట్టెలు కొట్టడానికి వెళ్ళిన వనజ గ్రామానికి చెందిన ఇద్దర్ని పులి దాడి చేసి చంపినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అటవీ శాఖ వారు ఈ పులుల్ని పట్టుకోవాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.' ఇదీ, వార్త సారాంశం.

నేను వెంటనే ఆఫీసుకి వెళ్ళి సుధాకర్‌తో అటవీరేంజ్ అధికారి మోహన్ రావుని, తహసీల్దార్ని రమ్మనమనీ చెప్పాను.

ఈ మధ్యనే ఐయ్యేయస్ ట్రైనింగ్ పూర్తి చేసుకొని సబ్ కలెక్టర్‌గా ఈ రెవెన్యూ డివిజన్లో చేరాను. ఈ రెవెన్యూ డివిజన్ ఒడిషా రాష్ట్రానికి బోర్డర్లో ఉంటుంది. మా డివిజన్లో సుమారు 4 మండలాల్లో గిరిజన జనాభా ఎక్కువ. గ్రామాలన్నీ కొండల మీదే ఉంటాయి. రహదార్ల సౌకర్యం తక్కువ. ఈ రెండు రాష్ట్రాల బోర్డర్ అంతా తూర్పు కనుమలు; దాన్ని దండకారణ్యం అంటారు. అది రిజర్వ్ ఫారెస్ట్ – అందులో పులుల సంరక్షణ కేంద్రం కూడా ఉంది. టైగర్ రిజర్వ్... వేట నిషిద్ధం... పులులను చంపకూడదు.

11 గంటల ప్రాంతానికి తహసీల్దార్ రామారావు, ఫారెస్ట్ రేంజర్ మోహనరావు కలిసి వచ్చారు.

'మోహన్ రావు గారూ... ఇవాళ పేపర్లో వార్త చదివారా? పులి మనుషుల్ని చంపిందంట. ఆ విషయాలు నావరకు రాలేదు. ఇంతకీ ఏం జరిగింది? ఎప్పుడూ వస్తుంటాయా?' అని అడిగాను.

“నేనిక్కడకు వచ్చి మూడేళ్ళైంది సార్. ఎప్పుడూ ఇలా జరగలేదు. క్రితం సంవత్సరం వర్షాలు తక్కువ పడటం వల్ల నీటి ఎద్దడి ఏర్పడి బహుశా నీటి కోసం అవి అడవి బయటకు వచ్చి ఉంటాయి. మొన్న మా గార్డ్సు ఇద్దరు ఆ ప్రాంతం పర్యటించి వచ్చారు. వాళ్ళకేం కనిపించలేదు. ఈ మధ్యన గిరిజనులు కూడా రిజర్వ్ ఫారెస్ట్ లోపలికి వెళుతున్నారు. అలా వెళితే చాలా ప్రమాదం. పులుల బారిన పడే అవకాశాలు ఎక్కువ. నేను ఈ రోజే బయలుదేరి అక్కడికి వెళుతున్నాను. మళ్ళీ ఇలా జరగకుండా చూస్తాము. ఇప్పటికే చాలా కెమెరాలు ఏర్పాటు చేసి వాటి కదలికలు తెలుసుకుంటున్నాము” అని వివరించాడు.

“రామారావు గారూ, తహసీల్దార్‌గా మీరు ఏ చర్యలు తీసుకున్నారు?”

“సార్.. నాకు మొన్న ఆర్ఐ, విఆర్వో ఫోన్ చేసి పులి ఇద్దరి వ్యక్తుల్ని చంపి వేసిందనీ చెప్పారు. వారం రోజుల క్రితం పులి పాచిపెంట ఊళ్ళోకి వచ్చి రెండు ఆవుల్ని చంపిందనీ చెప్పారు. వెంటనే చుట్టుపక్కల ఊళ్ళన్నింట్లో చాటింపు చేయమని చెప్పాను. అటవీ శాఖ రేంజర్ గారికి ఈ విషయాన్ని చెప్పాను.” అన్నాడు రామారావు.

“నాకీ విషయాలు ఎందుకు చెప్పలేదు. నేను డీయఫ్‌ఓ గారితో మాట్లాడతాను కదా! సరే ఇప్పుడయినా ఏం చెయ్యాలి” అన్నాను.

"ఫారెస్ట్ వాళ్ళే వాటిని పట్టుకోవాలి. లేదంటే అడవిలోకి ఎవర్నీ వెళ్ళకుండా చూడాలి"

"మోహన్‌రావు గారూ! మీ యాక్షన్ ప్లాన్ ఏమిటి? అసలు మన అడవిలో ఎన్ని పులులున్నాయి? అవి ఎందుకు బయటకొస్తున్నాయి?"

"ఆరు నెలల క్రితం పగ్‌మార్క్ సర్వే చేస్తే పది పులులున్నట్లు తేలింది. రెండేళ్ళ క్రితం ఆరే ఉండేవి. అడవుల్లో స్మగ్లర్స్ చెట్లను విరివిగా కొట్టేయడం, వర్షాలు తక్కువ పడటంతో అవి నీటికోసం బయటకు వస్తున్నాయి. క్రితం సంవత్సరం రెండు పులులు ఇలాగే బయటకొస్తే ట్రాంక్విలైజర్ గన్స్‌తో పట్టుకొని అడవిలో వదిలేసాము. చుట్టూ ఫెన్సింగ్ వేయించాము. ఆ తరువాత వాటి రాక బాగా తగ్గింది" అన్నాడు.

"ఈ అడవిని పులుల అభయారణ్యంగా ఎప్పుడూ ప్రకటించారు? ఒడిషా ప్రభుత్వం వీటి కోసం ఏమైనా సర్వే చేపట్టిందా?"

"దీన్ని ప్రకటించి పదేళ్ళకుపైగా అయింది. ఒడిషా కూడా మనలాగే పులుల సర్వే చేసింది. అక్కడ సంవత్సరం క్రితం ఆరు పులులున్నట్లు తేలింది..."

"కానీ అవే పులులు మన పక్క కూడా రావచ్చు కదా?"

"రావు సార్! మధ్యలో ఇంద్రావతి పెద్ద నది ఉంది. అది ఓ పెద్ద లోయ వల్ల సాధారణంగా అవి నది దాటి రావు..."

"మన దేశంలో పులులు ఏ రాష్ట్రంలో ఎక్కువ ఉన్నాయంటారు. నేను చదువుకున్న ప్రకారం మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఉన్నాయంటారు? నిజమేనా?"

"అది కరెక్టే సార్! మనకి శ్రీశైలం నల్లమల అడవుల్లో ఎక్కువ ఉన్నాయి. రాజీవ్ గాంధీ పులుల అభయారణ్యం"

"సరే! నేను, తహసీల్దార్ రామారావు గారు రేపు అక్కడికి వస్తాము. మీరు కూడా రండి. అక్కడ పరిస్థితుల్ని స్వయంగా చూస్తే ఒక అవగాహన వస్తుంది. ఆ ఏర్పాట్లు మీరు చూడండి. మీ సిబ్బందిని అందర్నీ అక్కడ ఉండమనండి" అనీ చెప్పాను.

వాళ్ళు "సరే సార్" అనీ చెప్పి వెళ్ళిపోయారు.

■■■

తెల్లవారి ఐదుగంటలకి మేము రెండు జీపుల్లో పాచిపెంట అడవికి బయలుదేరాము. ఒక అరగంట తరువాత మేము ఏజన్సీ ప్రాంతం అంటే గిరిజనులుండే ప్రాంతానికి చేరుకున్నాము.

అక్కడ నుండి ఘాట్ రోడ్డు ప్రారంభమైంది. చుట్టూ ఎత్తైన కొండలు ఆకాశాన్నంటుతున్నట్లు కనిపిస్తున్నాయి... పచ్చటి హరివర్ణపు పొడవైన యూకలిప్టస్ వృక్షాలు. ఆ చెట్ల మధ్య నుంచి సన్నటి దారి... అప్పుడే సూర్యోదయపు లేత ఎర్రటి కిరణాలు అడవిలో ఏటవాలుగా పడుతున్నాయి... అప్పుడే పక్షులు నిద్రలేచి గూళ్ళ నుంచి బయటకొచ్చి అరుస్తూ ఎగురుతున్నాయి.

మొత్తానికి నాకా వాతావరణం ఆహ్లాదకరంగా అనిపించింది... కొంచెం సేపటికి దట్టమైన అడవిలోకి ప్రవేశించాము. మధ్య మధ్యలో గిరిజన తండాలు ఆ ఏటవాలు కొండల మీద అక్కడక్కడ కనిపించ సాగాయి.

"రామారావు గారూ, ఇంతటి దుర్గమారణ్యంలో వీరుంటున్నారు కదా? వీళ్ళకి మౌలిక సదుపాయాలు ఉన్నాయా?"

"చాలా వరకు ఈ గ్రామాలకు ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద రహదార్లను వేసాము. 90 శాతం గ్రామాలకు బోర్‌వెల్స్ వేయించాము. స్కూళ్ళు కూడా ప్రతి గ్రామానికి ఉన్నాయి. విద్యుత్ కూడా అన్ని గ్రామాలకు కల్పించాము. మన మండల కేంద్రంలో ఉన్న వైద్యశాల డాక్టర్లు, నర్సులు అప్పుడప్పుడు వెళుతుంటారు."

"రేపు నాకొక నివేదిక ఇవ్వండి. ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిని కూడా మనం ఒకసారి కలుద్దాము" అని నేను చెబుతుండగా పులి గిరిజనుల్ని చంపిన ప్రాంతం వచ్చింది.

కొద్ది దూరంలో జీపు ఆగింది. మోహన్‌రావు జీపు దిగి "సార్... ఇంక జీపు వెళ్ళదు." అనీ చెప్పడంతో నేనూ రామారావు మిగతా సిబ్బంది అందరం అక్కడ దిగిపోయి నడవటం మొదలు పెట్టాము.

కొంచెం సేపటికి గిరిజనులు పులివాత పడ్డ ప్రదేశానికి చేరుకున్నాము.

అక్కడ నేలమీద రక్తపు మరకలు కొద్ది దూరం దాకా కనిపించాయి... అక్కడికి కొద్ది దూరంలో చెట్టును కొట్టే గొడ్డలి, చెట్ల కొమ్మలు కనిపించాయి.

ఆ తరువాత అడవిలోకి కొద్ది దూరం నడిచాము. ఆ సమయంలో అటవీ శాఖకు చెందిన ఫారెస్ట్ గార్డ్స్ నలుగురు తుపాకీలతో వచ్చారు.

పులి మళ్లీ ఈ ప్రాంతాలకు వస్తోందా?" అని వారిని అడిగాను.

"లేదు సార్..." అంటూ కొద్ది దూరం వెళ్ళి అక్కడ ఉన్న పులి 'పగ్‌మార్క్'ని చూపించాడు... అవి వరుసగా అడవిలోకి వెళ్ళి పోయినట్లుగా ఉన్నాయి...

"ఇవి పులుల పగ్‌మార్క్స్ అనీ ఎలా చెప్పగలరు?"

"పులుల పగ్‌మార్క్‌కి ఒక పేడ్, నాలుగు టోస్ ఉంటాయి అంటూ నాలుగు చిన్న చిన్న గుంతల్లాంటవాటిని

చూపించాడు. ఒక పెద్ద సున్నాదాని చుట్టూ నాలుగు చిన్న సున్నాల్లా ఉన్నాయవి. వీటి మీద ఏదో పౌడర్ చల్లి దాన్ని కాగితం మీదకు ట్రేసింగ్ చేసాడు ఒక గార్డ్... ఆశ్చర్యకరంగా ఆ కాగితం మీదకు ఆ పులి పాదముద్ర స్పష్టంగా వచ్చింది.

"అన్ని పులులకు పగ్‌మార్క్స్ ఒకేలా ఉంటాయా?" అని అడిగాను.

"లేదు సార్... ఏ రెండు పులుల పాదముద్రలు ఒకేలా ఉండవు. అందుకే సర్వేలో ఎన్ని పులులున్నాయో లెక్కకట్టగలము – కెమెరాలు చాలా చోట్ల పెట్టాము. ఇప్పుడు వీటి కదలికల్ని పసిగట్టగలం" అనీ అతను చెప్పాడు.

"అయినా మన అడవిలో ఉన్నవే పది పులులు సార్. మొత్తం మన రాష్ట్రంలో 2017లో 48, ఈ 2020లో 61 పులులున్నాయి. శ్రీశైలంలో మిగతావి వున్నాయి. ఎక్కువగా కర్నాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు లలో ఉన్నాయి. మొత్తం మన దేశంలో ఉన్నవే సుమారు 3000 పులులు' అని చెప్పాడు ఆ గార్డ్... అతని పేరు కేదార్‌నాథ్. అతినిది యూపీ అట... పులుల గురించి చాలా విషయాలు అనర్గళంగా చెప్పాడు. అతనికి వాటి గురించి బాగా అవగాహన ఉన్నట్లుంది.

అలా ఆ ప్రాంతమంతా ఒక గంట తిరిగిన తరువాత కేదార్‌నాథ్ "సార్! ఇంక లోపలి కెళ్ళకూడదు. పులులు ఒంటి గంటకు కొండ దిగే సమయం. పదండి వెళ్ళిపోదాం... ఇంక అవి బయటకొచ్చే సమస్య ఉండదు. గిరిజనులకు కూడా అడవిలోకి రావద్దనీ చాటింపు వేసాను" అనీ చెప్పటంతో మేమంతా వెను తిరిగి జీపులాపిన స్థలానికి వచ్చాము.

"మోహన్ రావు గారూ! మనం ఇక్కడికి దగ్గర్లోని నాలుగైదు ఊళ్ళకు ఓసారి వెళదాము. ఎలాగూ వచ్చాము కదా... వాటిని చూసినట్లు కూడా ఉంటుంది. ఆ గ్రామాల స్థితిగతులు కూడా నాకు తెలుస్తాయి" అనటంతో గార్డులను అక్కడే వదిలేసి మేము అక్కడికి దగ్గర్లోని కెంగువ, లడ్డ, జుమ్మాపేట, లవిడి ఊళ్ళకు బయలుదేరాము.

ముందుగా కెంగువ గ్రామం తగిలింది. అది ఓ కొండవాలులో ఉంది. మేము వెళ్ళేసరికి మిట్ట మధ్యాహ్నం ఒంటి గంటైంది.

వీఆర్వో దిగి సబ్‌కలెక్టర్ గారు, తహసీల్దార్ వచ్చారు అనేసరికి ఊరివాళ్ళంతా రావడం మొదలు పెట్టారు. దూరంగా కొండవాలులో అక్కడక్కడా విసిరేసినట్లు ఇళ్ళు... వీధి అంటూ లేదు. మురికినీరు ఇళ్ళ ముందే పారుతోంది. ఓ చింతచెట్టు కింద ఇద్దరు తాగేసి నులకమంచం మీద పడుకొనీ ఉన్నారు. దూరంగా ఉన్న పొలంలో కొందరు పిల్లలు మామిడిటెంకలతో ఏదో ఆటలు ఆడుతున్నారు.

ఇంతలో వీఆర్వో ఒక వ్యక్తిని చూపించి 'ఇతను సహదేవ్, ఊరి సర్పంచ్'' అనీ చెప్పాడు. అతను బాగా తాగి తూలుతున్నాడు.

"రామారావు గారూ! ఇక్కడంతా బాగా తాగుతుంటారా?"

"అవును సార్! వాళ్ళు విప్పపూల సారా బాగా తాగుతారు."

"రోడ్లు వేసావన్నారు? వాళ్ళ ఊరికి రోడ్డే లేదు. స్కూలు ఉందా?" అని అడిగాను.

"రోడ్డు కోసం ఐటీడీయే వాళ్ళు నాలుగు సార్లు టెండర్లు పిలిచినా ఈ కొండల్లో వెయ్యడానికి ఎవ్వరూ ముందుకు రావట్లేదు. పైగా ఇది నక్సల్స్ ప్రాంతం... అందుకే చాలామంది ఉద్యోగస్థులు ఆ సాకు చూపించి రారు" అన్నాడు.

"ఒక్కసారి స్కూలు కెళదాం పదండి" అనడంతో ఆ ఊరి పిల్లలిద్దరూ ముందుకు నడుస్తూ మమ్మల్ని తీసికెళ్ళారు.

అది స్కూలు బిల్డింగ్ అనటంకన్నా ఓ పాడుపడిన భవనం అంటే బాగుంటుంది. ఆ రోజెవ్వరూ అక్కడ లేరు.

"స్కూలు తెరవలేదా ఈ రోజు"

"బాబూ! నెలరోజుల నుంచి టీచరు గారు రావటం లేదు" అన్నాడు ఓ యువకుడు.

"ఎందుకు రాలేదు?"

"బాబూ! అతను నెలకోసారి వస్తాడు... వచ్చినప్పుడు. స్కూలుంటుంది. లేనప్పుడు లేదు." అన్నాడతను.

''రామారావుగారు... అతను రాకుండా జీతం తీసుకుంటున్నాడా? వెంటనే ఎంక్వైరీ చేసి సస్పెండ్ చెయ్యండి. ఈ విషయం ఐటీడియ్యే పీఓకి డిఈఓకి రాయండి. తహసీల్దార్‌గా మీకూ బాధ్యత ఉంది. మీరెప్పుడైనా ఈ ప్రాంతానికి వచ్చారా?" అని అడిగాను.

"సార్... ఈ స్కూళ్ళన్నీ ఐటీడియ్యే పరిధిలోకి వస్తాయి."

"అయినా సరే! మనం కూడా వీటిని విజిట్ చెయ్యాలి. నేను ఈ రోజే కలెక్టర్‌తో మాట్లాడతాను... ఇలా ఎంతమంది విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారో సర్వే చేసి నాకు వివరాలు లిఖిత పూర్వకంగా ఇవ్వండి." అన్నాను.

"ఆ తరువాత ఊళ్ళోకి బయలుదేరాము. ఇద్దరు స్త్రీలు ముక్కుకి పుడకలు, మెడలో పూసలదండలతో వచ్చారు. వాళ్ళ శరీరం కమిలిపోయి ఉంది. పౌష్టికాహార లేమి వాళ్ళను చూస్తుంటే తెలుస్తోంది. వాళ్ళ వెనకాలే నలుగురు పిల్లలు... వాళ్ళని చూస్తుంటే జాలి వేస్తోంది. సరియైన బట్టలు లేక బలహీనంగా కనిపిస్తున్నారు.

''ఊళ్ళో బోరింగ్ పనిచేస్తోందా? మంచి నీటికేం చేస్తున్నారు" అని అడిగాను.

"బోరింగ్ పాడై ఐదు నెలలైంది. అప్పట్నుంచీ కొండగడ్డ నీళ్ళే తాగుతున్నాము" అనీ చెప్పింది ఒక యువతి.

ఇంతలో ఐటీడియ్యే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వచ్చినట్లు తహసీల్దార్ చెప్పాడు. జీపు దిగి పొడవైన వ్యక్తి నా దగ్గరికి వచ్చాడు.

"సార్! నా పేరు జానకిరాం... నేను గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ని... మీరు ఇక్కడికి వెళుతున్నారనీ ఉదయమే తెలిసి ఇలా వచ్చాను" అన్నాడు నాకు నమస్కరిస్తూ...

"జానకిరాం గారూ? ఐటీడీయ్యే లు పెట్టింది ఈ కొండల్లోని గిరిజనుల సంక్షేమం కోసం. ఈ కొండల్లోని వీళ్ళ సంక్షేమం కోసం ప్రతి సంవత్సరం వందల కోట్లు ప్రభుత్వాలు ఖర్చు పెడుతున్నాయి. కానీ ఈ ఊళ్ళని చూస్తుంటే స్వాతంత్ర్యం వచ్చినపుడు ఉన్నట్టే కనిపిస్తున్నాయి. ఏ విధమైన అభివృద్ధి కనిపించటం లేదు; మరి ఖర్చు పెట్టిన డబ్బులేమయ్యాయి?"

"సార్... చాలా ఊళ్ళకు రోడ్లు వేయించాము. ఈ కొండల్లో పనిచెయ్యడానికి ఎవ్వరూ ముందుకు రావటం లేదు."

"మిస్టర్ జానకిరాం! ఈ దేశీయులమైనందుకు మనం సిగ్గుపడాలి... మనందరం పట్నాల్లో పెద్దపెద్ద ఇళ్ళల్లో కార్లు, ఏసీలతో బతుకుతున్నాము. ఈ పేదవారు జంతువుల్లా బతుకుతున్నారు. వీళ్ళకి స్కూళ్ళు లేవు, ఉన్నా టీచర్లు రావటం లేదు, రోడ్లు లేవు, బస్సులు లేవు, డాక్టర్లు రారు... రోగాలొస్తే చనిపోవడమే... ఇప్పుడు నేను వచ్చిన రోడ్డు అంతా గుంతలమయం. ఈ రోడ్డు ఎప్పుడు వేశారు. దీని క్వాలిటీ చాలా ఘోరంగా ఉంది. అసలు పనిచేసిన కాంట్రాక్టరు ఎవరు? మీ ఐటీడియ్యే పీవో గారు ఈ ప్రాంతాలకు వస్తున్నారా? మీరు ఈ పనుల్ని పరిశీలిస్తున్నారా?" అని కోపంగా ప్రశ్నించాను.

ఈఈ మౌనం దాల్చాడు.

"రామారావుగారూ! కలెక్టర్‌కీ, ఐటీడియ్యేపీవోకి, డిఈఓకి ఉత్తరాలు రాసి నాకు ఇవ్వండి. నేను నా సంతకాలతో పంపుతాను. ఒక ఎంక్వైరీకి ఆర్డర్ చేస్తాను" అంటూ ఆ గ్రామం నుంచి ఇంకో గ్రామం లడ్డ, ఆ తరువాత జుమ్మాపేట, లవిడి వెళ్ళాము. అన్నీ ఊళ్ళలో అదే సమస్య...

నేను వెనుదిరిగిన వెంటనే కొందరు గిరిజనులు మా దగ్గరికొచ్చారు. వాళ్ళు కొంచెం నాగరికంగా ఉన్నారు. ఒకతను మండల ప్రసిడెంటు; పేరు బిడ్డిక దొర...

నేను అతనితో "మీ మండలంలోని చాలా గ్రామాలు చూసాము. పులి తిరుగుతున్న గ్రామాలకు కూడా వెళ్ళాము. ఇంక మీకు పులుల భయం లేకుండా చూస్తాము" అనీ చెప్పాను.

"సార్! అడవిలో జంతువులు, పులుల మధ్య పెరిగోటోళ్ళం. మాకు పులుల భయం లేదు అవి మమ్మల్నేటి చేస్తాయి... అంతకన్నా భయంకరమైన పులులు ఉన్నాయి. మాకు ఆవాసంగా ఉన్న ఈ కొండలను తవ్వేస్తామంటున్నారు. మేము సేకరించిన ఉత్పత్తులకు తగిన ధర దక్కటం లేదు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అందుబాట్లో ఉండరు. వైద్య సదుపాయం దక్కక ఎన్నో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఈ సమస్యల కన్నా ఆ పులులేం ప్రమాదకరం కావు. మా వల్ల కొన్ని వేలకోట్లు లంచాల రూపంలో తింటూ అవినీతికి పాల్పడుతున్నా అవినీతి పులుల నుంచి, అభివృద్ధి పేరిట నిధులను మింగేస్తున్న రాజకీయ పులుల నుంచి మమ్మల్ని కాపాడండి. ఇరవై ఏళ్ళైంది. కొన్ని వేల కోట్లు ఖర్చు పెట్టామంటున్నారు... ఒక్క ఊరికి రోడ్డు గానీ, బస్సు గానీ, హాస్పిటల్ గాని కట్టారా? డాక్టర్లు వస్తున్నారా? వర్షాకాలంలో మురికి నీరుతాగి వేలమంది చనిపోతున్నా ఐటీడియ్యే గానీ, రెవెన్యూ శాఖవాళ్ళు గానీ పట్టించుకోవటం లేదు. వీళ్ళంతా మా గిరిజనుల అభివృద్ధి కోసం... వాళ్ళ అభివృద్ధి కోసం పాటుపడుతూ కొన్ని వందల కోట్లు తినేసి పులుల కన్నా ఘోరంగా మమ్మల్ని హింసిస్తున్నారు. ఈ పులుల సంగతి చూడండి" అంటూ నాకొక వినతి పత్రం ఇచ్చాడు.

నేను ఆ వినతి పత్రం తీసుకుంటూ "మీకు న్యాయం చేస్తాను" అని వెనుతిరిగాము.

▪▪▪

సంవత్సర కాలంలో పరిస్థితులు చాలావరకూ చక్కపడ్డాయి. చాలా గ్రామాల్లో స్కూలు భవనాలు కట్టబడ్డాయి. టీచర్లను అక్కడ ఉండేటట్లు చేసాము. వాళ్ళకి యూనిఫార్మ్ పెట్టాము. డాక్టర్లు, నర్సులు ప్రతివారం ప్రతి గిరిజన గ్రామం వెళ్ళేటట్లు చేసాము... రోడ్లు వేస్తున్నారు. పనుల్లో నాణ్యత పెరిగింది. ఇద్దరు ఎక్జిక్యూటివ్ ఇంజనీర్లను, నలుగురు డెప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్లను, నలభైమంది టీచర్లను ఆరుగురు డాక్టర్లను ఉద్యోగం లోంచి తీసివేసాము. పదిమంది కాంట్రాక్టర్లను జైలుకి పంపేము. అవినీతి చేస్తే జైలు ఖాయం అనే సందేశాన్ని పంపేము.

ఈ సంవత్సరం రాష్ట్రంలో మా రెవెన్యూ డివిజన్‌కి అభివృద్ధిలో మొదటి రేంక్ వచ్చింది.

కలెక్టర్ గారు ఓ అభినందన సభలో నన్ను అభినందిస్తూ ఉంటే నా కళ్ళు చెమ్మగిల్లాయి. ఆరు నెలల ముందే జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించడం నాకు మరింత ఆనందం కలిగించింది. ▪

# వంటింటి అతిథి

- పుట్టి గిరిధర్
94914 93170



"తమ్ముడూ!
నాన్న అంట్లు తోముతున్నాడురా" అనగానే
బుడ్డోడు చూసిన ఆ చూపులో
నవ్వు కనబడినా రేపటి కర్తవ్యాన్ని చూపించింది!
"పక్కింటి మావయ్య
బట్టలు ఉతుకుతాడు నాన్న" అంటే
హమ్మయ్య! మనింట్లో యంత్రమున్నదని
లోలోన సంతోషించినా,
ఆడ మగ పనులు వేరుకాదని
బోధించే అవకాశాన్ని చూపించింది!
అందుకే అనిపిస్తుంది
'ఇంటినుండే సమాజం మొదలౌతుంది' అని!

కరోనా విపత్తు కాలం
బయట చావడం కాదు
ఇంట్లో బతకడం ఎలాగో నేర్పింది
పనిమనిషి రానందుకు
వంటింటి ప్రవేశం చేయించి
బాల్యాన్ని తిరిగి తవ్వి తీసింది!
అమ్మకు తోడుగా చేసే పనుల్లోని కమ్మదనం
ఇప్పుడు గుండెలో జ్ఞాపకమై కదులుతోంది!

అంట్లంటే...
తిన్న తర్వాత
మూతికి, ముఖానికి ఆహారం పూసుకున్న పసిపిల్లలు
వాటిని కొంగుతో ప్రేమగా తుడవాలి
అప్పుడే అవి తళతళా నవ్వుతాయి!

అంట్లకొండను పిండిచెయ్యాలంటే
చేతికి గిన్నెకు మధ్య మురికితో యుద్ధం చేయాలి
కుప్పలుగా పడ్డ గిన్నెలన్నీ
అతిథుల్లా కనిపిస్తుంటాయి
సహనంతో మర్యాదలు చెయ్యాలి
లేదంటే కడుపుకు చేతికి మధ్య
బంధం దూరమైపోతుంది!

తాము కాలిపోయి
ఎన్నో రుచులను పంచె గిన్నెలు
వాటి కడుపు ఖాళీ చేస్తేనే
వాటికి కడుపు నిండినట్లవుతుంది
లేదంటే పాచిపోయిన ముఖమేసుకుంటాయి!

ఇన్ని గిన్నెలు వాడటమెందుకనుకునేలోపు
ఉదయం లేచినప్పటినుంచి పడుకునే దాకా
ఎన్నెన్ని పాత్రలతో కడుపు నింపావో
గుర్తుతెచ్చుకోమంటూ
నోరు తెరిచి లెక్కలు చూపిస్తాయి!

నా రాకతో వంటిల్లు ఉలిక్కిపడిందో
ఉగ్రరూపం దాల్చిందో గానీ,
ఆ సామ్రాజ్యానికి రాజు, రాణి ఇద్దరూ ఉంటారని
గిన్నెలు ఢంకా మోగించి మరీ చెప్పాయి!

ఏడాదికోసారి తోమగానే కవిత్వమొస్తే
ప్రతిరోజూ కడిగే మగువల చేతులు
ఎన్నెన్ని కవితలు వల్లించాలి?
వాళ్ళ మనసులోని భావాలన్నీ వంటల్లో ఆవిరై
కడిగే నీళ్ళల్లో పడి కొట్టుకుపోతాయేమో,
వాటికి అక్షరాలుగా రూపమొస్తే
ఏ మగాడి హృదయాలు తట్టుకోలేవు! ■




# అలజడి రేపిన 'తొలి అడుగులు'

- కెంగార మోహన్
90007 30403

**"మానవ విషాదమంతా ముద్దకట్టింది.
జీవన సంక్షోభమంతా మూర్తి కట్టింది."
– ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి**

ఈ ఏడాది వొచ్చిన కవిత్వ సంకలనాలు పరిశీలిస్తే ఆకట్టుకుని మరీ చదివించిన కవిత్వ పుస్తకం ఇటీవల మనలో మనం ప్రచురణలు వేసిన *తొలి అడుగులు* కవితా సంకలనం. కవయిత్రులు కొంతమంది సమూహమై, సైన్యమై కలాల కత్తులతో చేసిన అక్షర యుద్ధరావమే ఈ కవిత్వం. కొత్తగా రాస్తున్న వాళ్ళు, ఇప్పటికే తెలుగు కవన సేద్యం చేస్తున్న మహిళలు చేసిన చిరు ప్రతయ్నమే ఈ సంకలనం. ఈ సంకలనంలో కవితలుగా స్థానం సంపాదించుకున్న వాళ్ళకు కవిత్వ మెలకువలు చెప్పి ఇలా ఈ సంకలనం తెలుగు సాహిత్యలోకానికి పరిచితమయ్యేలా కృషి చేసిన కవి రాచపాళెం. విమర్శకుడిగా రాచపాళెం ఆధునిక తెలుగు సాహిత్యానికి సుపరిచితులు. కాని అనిర్వచనీయ కవిత్వానికి విలువల రంగులద్దుతూనే ఈ తరానికి వొక కవిత్వ తరాన్ని తయారు చేస్తున్న కవి. రాయడమే కాదు, రాస్తున్న వాళ్ళను ప్రోత్సహించి కవిత్వ లోకానికి కవులుగా పరిచయం చేస్తున్నారు. ఆయన ఉచ్వాస నిశ్వాసాలు కవిత్వమే. అలా తను నడిపించి ప్రోత్సహించి తీసుకొచ్చిన కవితా సంకలనమే ఈ తొలి అడుగులు.

లబ్ధప్రతిష్టులైన కవయిత్రులు, కొత్తగా అక్షరాన్ని ప్రేమించి కవిత్వలోకంలోకి వచ్చి వర్ధమాన రచయిత్రులుగా సామాజిక మాధ్యమాల్లో రాస్తున్న వాళ్ళంతా కలసి **'మనలో మనం'** అని వొక చిన్న వాట్సప్ సమూహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కవిత్వపు లోతులు తెలుసుకోవాలంటే కొంతమంది పేరు ప్రతిష్టలున్న కవులను చేర్చుకోవాలనుకున్నారు. ఈ నేపథ్యంలో వాళ్ళకు కవిత్వపు లోతుల్ని చెప్పే బాధ్యతను ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి తీసుకున్నారు. ఎప్పటికప్పుడు వాళ్ళ కవితల్ని తప్పొప్పులను సవరించి గొప్ప కవితలుగా వాటిని వస్తు శిల్ప సౌందర్యాలతో మలిచే ప్రయత్నం చేశారు. అలా వచ్చిందే ఈ సంకలనం. ఒక చిత్రాన్నిచ్చి ఆ చిత్రానికి అనుగుణంగా కవిత్వం రాయమని చెప్పి, రాసిన వాళ్ళ కవితల్లో లోపాలు సవరించి తిరిగి సమూహంలో ప్రచురించి, చర్చకు పెట్టి ... ఇలా అన్ని దశలు పూర్తి చేసుకుని సంకలనంలోకి స్థానం కల్పించే అరుదైన ప్రయత్నం చేశారు. ఇది కవిత్వంలో గొప్ప ప్రయోగమూ, ప్రయత్నమే అని చెప్పాలి.

ఈ సంకలనంలో 20 బొమ్మల మీద 47 కవితలు రాశారు. వీళ్ళంతా సరికొత్త ప్రయోగమే చేశారు. గ్రూపులో వొక బొమ్మను పెట్టి రాయమనడం, అలా స్పందిండమే గొప్ప కవిత్వ మధనం. తప్పొప్పులపై చర్చించుకుని ఒక నిర్ధారణకు రావడం ఎవరికి వారు ఎప్పటికప్పుడు కొత్తగా కవిత్వ నిర్మాణ రహస్యాలు తెలుసుకోవడం అసాధారణం. ఈ కవితలు అలా ఏరుకున్నవి, మెరుగులు దిద్దుకున్నవి, మూల్యాంకనమైనవి. పునర్మూల్యాంకనమైనవి కవితలై ఈ తొలి అడుగులుగా సగర్వంగా నడుచుకుంటూ తెలుగు పాఠకులకు ముందు నిల్చున్నాయి. ఈ కవితల్లోని కవిత్వస్పర్శ ఊహలై, ఉషస్సులై, నిప్పుకణికలై సమాజం ముందు నిల్చుంది.

మొదటి కవిత **'దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉంది'.** కరోనా నేపథ్యంలో సాగిన ఈ కవిత స్వర్ణలత రాశారు. దేశంలో

సాగుతున్న అరాచకాలన్నీ కవితగా రాశారు. సరిహద్దుల్లో కాపలా కాస్తున్న వీరజవానుల దగ్గర్నుంచి కరోనాను అదుపు చేయని పాలకుల దుర్నీతి విధానాలన్నింటినీ ఎండగడుతూ రాశారు. **'సరిహద్దు లోపల.. ఏళ్ళు గడచినా.. పేదరికం ఆకలి మంటలు'** అని చెబుతూనే.. **అభివృద్ధి నాస్తి– ఆర్భాటం జాస్తి,** దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని చెబుతారు. ఇది పూర్తిగా వచనమే అవ్వొచ్చు.. బలమైన అభివ్యక్తి ప్రదానమైన కవితగా మనకు కనబడుతుంది. ఇలా కూడా పాలకుల వైఫల్యాలను ఎండగట్టొచ్చా అని చెప్పిన కవిత ఇది. మరొక కవితలో శీలా సుభద్రాదేవి అసమానతల సమాజాన్నిలా ప్రశ్నిస్తుంది.

**నిలువునా రూపెత్తే కులం గోడల సందుల్లోంచి**

**పరువు కత్తులు మెరుపై దూకటమే దర్శనమిస్తాయ్ (జీవన విలువలు).** ఈ కవితలో భావకవిత్వపు లోతుల్లోకి సంచరిస్తూనే అవిభాజ్యమైన ప్రేమకిరణాలను జీవితాలపై కురిపిస్తుంది. కులరక్కసి కోరలు చాచిన సమాజాన్ని నడిబజార్లో నిల బెడుతుంది. అంతేకాక ప్రేమను కాంక్షల్ని చెరోపక్కకు నిలబెట్టి యువతను ప్రశ్నిస్తుంది. జీవితాన్ని ప్రేమించడెలాగో గొప్ప సందేశాన్నిస్తుంది. ఇటువంటి ఆలోచననే ఇచ్చే జి.నిర్మలారాణి ఈ సంకలనంలో 'ఆశ' అనే కవితలో ..

**పరువు ప్రతిష్టతో ప్రాణం తీసే పర్వతమంతటి పాషాణ**

**మనుషుల నడుమ, నలిగిన లేత ఊపిరులు!** అంటూ చెబుతుంది. ఈ రెండు కవితల మధ్య సారూప్యత ఉంది. అలాంటి సారుప్యతతలే ఇందులో అనేక కవితల్లో కనబడ తాయి. ఆ సారూప్యతలు గమనించే మందు ఈ కవితకు నేపథ్యం కూడా తెలుసుకోవాలి. కుల అహంకారంతో ప్రేమ వివాహం చేసుకున్నదన్న కసితో జరిగిన ప్రణయ్ హత్యోదంతం దేశాన్ని కలవరపెట్టింది. వెలుతురు చూడని వెలుగులోకి రాని ఎన్నో హత్యల మరణాలు చరిత్రశిథిలాల కింద కాలగర్భంలో కలిసిపోతున్నాయి. అయినా కవిత్వంలో మాత్రం ఆలా అసువులు బాసిన వాళ్ళపై అక్షర నీరాజనాలర్పించారు. అలా అనుకుని రాయలేదేమో కాని.. ఆ చిత్రానికలా అర్థవంతమైన దృశ్యాన్ని కవిత్వంగా మలిచారు. అందులో సునీత గంగవరపు అదే ప్రేమంటే అనే కవితలో ఇలా అంటుంది..

**కులం కంచెలు దానిని బంధించలేవు**

**కాలం చెల్లిన నీతులు కాపలా కాయలేవు**

**ఎన్నిసార్లు తుంచినా/ ప్రేమ తరువు చివురులేస్తూనే ఉంటుంది.** సునీత చెప్పినట్టు ఎన్ని మరణశాసనాలు లిఖించినా, ఎన్ని కుత్తుకలు తెగ్గోసినా ప్రేమ చిగురిస్తూనే ఉంటుందని చెప్పడం భావకవిత్వపు భావోద్రేకశిల్పం. బంధాల బందీఖానాలు, సంకెళ్ళు బంధించలేవంటుంది. ఇక చిత్రాన్ని చిలుకూరి దీవెన మరో కోణంలో చూసింది. రాయలసీమ కన్నీటిలో తడిసిన బిడ్డగా కరవుదృశ్యంగా కవిత్వం చెప్పింది.

**"నెర్రెలు చీలి/ నోరు తెరుచుకున్న/ సీమతల్లి/ గొంతులో/ ఇరక్కపోయి/ బిక్కుబిక్కుమని/ వెలుగువైపు/ చూస్తున్న/ వేరు శనగ విత్తనము/ పచ్చటి చెట్ల/పట్టుచీర కట్టుకున్నట్లు/ కలగంటోంది.."** ఈ కవిత చదివాక రాచపాళెం రాసిన ఒక కవిత గుర్తొచ్చింది. **'విత్తనాలు చల్లినా/ మొలిచేది కొడవళ్ళు, గొడ్డళ్ళు../ కొడవళ్ళ కరచాలనానికి/ తాళిబొట్లు తెగటం కనిపించదు..'** ఈ కవితను విశ్లేషించిన వల్లంపాటి వెంకటసుబ్బయ్య "ఈ పరాధీనసీమలో జీవితం ఇంకా ప్రజాస్వామికీకరణం పొందలేదు. ఇక్కడ నవీన యుగ విశేషాలు, మధ్యయుగ అవశేషాలు మాత్రమే. భారతమాత రాయలసీమకు వస్తే బాంబు కిరీటాన్ని ధరించివస్తుంది. అన్నపూర్ణచేతిలో వరికంకి ఉండదు– నాటుతుపాకీ ఉంటుంది" అన్నారు. **(రాయలసీమలో ఆధునిక సాహిత్యం – వల్లంపాటి వెంకటసుబ్బయ్య పుట : 86)** దీవెన చూసిన దృష్టికోణం వేరు. ఇతర కవుల దృష్టికోణం వేరు. పువ్వులో కొందరు అందాన్ని చూస్తారు.. ఇంకొందరు మకరందం చూస్తారు. మరికొందరు ఆ పూలకింద మొలిచిన ముళ్ళను చూస్తారు. ఇదంతే.. ఇది జీవితం.. ఇది కవిత్వజీవన పాఠం.. ఇక ఈ సంకలనంలో అమాంతం నన్నాకట్టుకున్న కవిత **'జ్వలన సంకేతమై'** శీర్షికతో మనోనేత్రంపై కవిత్వ సొగసులతో నాగమణి పలకరించింది..

**మంచు ముసుగును ఛేధించుకొని/ వాడి వేడి కాంతులధారతో/ ధరిత్రిని రాగరంజితం చేస్తున్న/ ఆ సూర్యోదయం/ అసంకల్పిత కార్యక్రమంలో/ ఏ దార్శనీయతనో దాగుందనిపిస్తుంది/ పునరాగమనంలో/ నిర్యాణ నిర్మాణమేదో దాగున్నట్లుంది/ జీవనపారమార్థికతను ప్రభోదిస్తున్నట్లుంది/ చలనసహిత సందేశమై/ జ్వలన సంకేతమై/ స్వప్నసాకారమేదో/ దాగున్నట్లుంది.** ఈ కవితలో కవిత్వ నిర్మాణ రహస్యాలన్నీ ఉన్నాయి. కవిత్వం దృశ్యరూపమై కనబడుతుంది. జీవితాన్ని కవిత్వం ఉన్నతీకరిస్తుందని ఎక్కడో చెబితే విన్నాను.. ఈ కవిత చదివాక నిజమనిపించింది.

సుజాత తన కవితలో **"అవును మేము తెలుసుకున్నాము/**

మా ధిక్కార స్వరానికి ఆహ్వానం ఉండదని.. అయినా– మాపై జరిగే అణచివేతల్ని ప్రశ్నించాలని.. అవును – మేము నిర్ణయించుకున్నాము.**" అసలు కవిత్వమంటేనే ధిక్కార స్వరం. అసలు కవిత్వమంటేనే తిరుగుబాటు. అసలు కవిత్వమంటేనే బిగించిన పిడికిలి. సుజాత చాలా స్పష్టతగా ఈ విషయాన్ని ఈ కవితలో చెబుతుంది. స్పష్టమైన అజెండాతో ముందుకు మున్ముందుకు సాగుతున్నట్లనిపించింది. వొక జీవన జీవిత ప్రయాణాన్ని అల్పాక్షరాల్లో, అతి సుకుమారవంతంగా సౌందర్య వంతంగా చెబుతుంది కలసి నడుద్దాం అన్న కవితలో డా.ఎం.ప్రగతి. అదెలాగంటే..**"నువ్వయినా నేనయినా/ స్వీయ నియంత్రణలోనే మనుగడ సాధ్యం/ సమన్వయంతో సాగుదాం/ కలసి ముందుకు నడుద్దాం."** ఇదే కదా జీవితం..ఈ కవితను చదివాక మనసు మానవీయస్పర్శను వెతికుతుంది. ఇద్దరి ప్రపంచాలు వేరు కాదు.. వొక్కటేనన్న సంకేతం.. సందేశం ఇస్తుంది. అదేలాగంటే వెంకటలక్ష్మి పదనేస్తం అదే మన గమ్యం అన్నకవితలో చెప్పినట్టు **"ప్రాణం అల్పమే కానీ సడలని సంకల్పం నాది"** ఈ కవయిత్రిదే కాదు..ఈ సంకలనంలో స్థానం సంపాదించుకున్న ప్రతి వొక్కరి కవితల దృక్పథం కూడా ఒకటే. ఈ సంకలనంలో బిజిలి అనే రచయిత్రి రాసిన కవితలు వైవిధ్యంగా సాగుతాయి. రాసిన ప్రతీ కవితా వాక్యం సున్నితంగా మనసును తాకుతుంది. వొక్క కవితా వాక్యంతో అవిభాజ్యమైన మనసుపొరల్ని తాకుతుంది. **"సుఖదు:ఖాలలో నిను వీడనని నీలో సగం నేనని అన్నానని.."** ఇక ఆపై సంఘర్షణతో కూడిన జీవితాన్ని ఆవిష్కరిస్తుంది. ప్రేమగా చెబుతున్నట్టే ఉన్నా మనస్సంద్రంలోంచి కన్నీళ్ళు ఉబికి వస్తాయి.

ఈ తొలి అడుగుల్లో ఆచార్య మహాసముద్రం దేవకి సముద్రమంత అభివ్యక్తిని తన కవిత్వంలో వ్యక్తీకరిస్తారు. వలసబాట అనే కవితలో..**"సానుభూతి సముద్రాల జలమంత/ సాయం మాత్రం ఆ జలాల తక్షణ ప్రయోజనమంత.."** వలసగాథల్ని ఎంతో మంది ఆవిష్కరించినా నిండైన కవితావాక్యాలతో ఈకవితలో అక్షర సృజనచేశారీ ఆచార్యులు.

ఈ రచయిత్రులు చేసిన తొలి అడుగులు తొలి ప్రయత్నమే అయినా గొప్ప కవితావాక్యాలకు పురుడుబోసి ప్రాణ ప్రతిష్ట చేశారు. ఇలాంటి సమూహాల కవిత్వాలు తెలుగు కవిత్వనేలను తడిపి అక్షరాల సిరులు పండించాలి.

■

## నేనెవరిని?

నేను నీ చేతుల్లో
వాలిపోతూ గింగరాలు తిరుగుతూ
హొయలు పోతుంటే
నువ్వు చల్లబడతావు ప్రియా!

నీవు వేడి వేడి అన్నం
పప్పు గోంగూర నెయ్యి రుచి ఆరగిస్తున్నా
నన్ను ఓ చేతిలో పొందికగా నిమురుతూ
నా వైపు ఓ కొంటె చూపు
నా గాలి తగలనిదే ముద్ద దిగదు కదూ ప్రియా!

భానుడు సెగలు కక్కుతున్నా
నేను నీ చెంత
అటూ ఇటూ నా పైట తగిలీ తగలనట్టు
అలసటే మరచి పోవుదువు కదూ సఖీ!

ఆరుబయట మంచం
ఉక్కిరి బిక్కిరి ఉక్కలో
నేను నాట్యమాడుతుంటే మైమరచి
చుక్కల్లో చూపులు మరలి
శయనించుదువు కదూ!

అంత అందం నాలో లేదు
నా ముఖం అర్ధ చంద్రమో కోలమో
నాలుగు పలకలో
చూసుకుందామన్నా అద్దం నాకు శత్రువు
ఎలా మసలుకోవాలో
నువ్వే నేర్పుతావు
నేనొట్టి ఆకతాయిని!

నా పుట్టుక
వెదురు తోటలోనో
తాటి కమ్మల్లోనో
గజిబిజి అల్లికో సొంపైన సాగసుతో
నీ కోసం నాడు నీ గుమ్మంలో
నేడు కాని దాననై
వీడిపోతున్న విసనకర్రని!

**- గిరి ప్రసాద్ చెలమల్లు**
**94933 88201**





## స్వాతంత్ర్యానంతర దశాబ్ది

# కథానికల్లో రచయిత్రుల కృషి

**మంచూరు కిషోర్**
తెలుగు అనువాద అధ్యయన శాఖ, పరిశోధక విద్యార్థి
**ఆచార్య కిన్నెర శ్రీదేవి**
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

**1946-55** దశాబ్దంలో స్త్రీల కథలు ఎక్కువగానే వచ్చాయి. స్వాతంత్ర్యానికి పూర్వం స్త్రీలు కథలు రాసినప్పటికీ, స్వాతంత్ర్యానంతరం కూడా కథాసాహిత్య క్షేత్రంలో రచయిత్రులు కృషి చేస్తూనే వున్నారు. ఆచంట శారదాదేవి, వాసిరెడ్డి సీతాదేవి, ముప్పాళ్ళ రంగనాయకమ్మ, అబ్బూరి ఛాయాదేవి, ఇల్లిందల సరస్వతీ దేవి మొదలైన ఉద్దండులైన రచయిత్రులు ఈ దశాబ్దిలోనే రచనా వ్యాసంగం ప్రారంభించారు. వితంతు స్త్రీల దుర్భర స్థితిగతులు, వరకట్న దురాచారం, అస్పృశ్యతా సమస్య ... ఇలా అనేక సమస్యలపై రచయిత్రులు కథలు రాశారు. ఈ కాలంలో కథలు రాసిన స్త్రీల పేర్లు సాహిత్య చరిత్ర గ్రంథాల్లో కనబడుతున్నాయి. కానీ ఆ రచనలన్నీ ఈనాడు అందుబాటులో లేవు. 1947కు ముందు రాసిన మగవాళ్ళ రచనలు అనేకం లభిస్తుండగా, స్త్రీల రచనలన్నీ సొంతం లభించకపోవడం అసంతృప్తి కలిగిస్తోంది.

స్వాతంత్ర్యా నంతరం స్త్రీలు బుద్ధిజీవులుగా నిర్వహించిన సాంస్కృతిక పాత్ర తక్కువదేమీ కాదు. సంస్కరణోద్యమ ఫలితంగా ఏర్పడిన స్త్రీల సంఘాలు ఒకవైపు జాతీయోద్యమం, ఆంధ్రరాష్ట్ర ఉద్యమాల్లో భాగంగా నిర్వహించిన మహిళాసభల్లో అధిక సంఖ్యలో తమ భావాలను వ్యక్తీకరించేందుకు ప్రోత్సహించాయి. ఫలితంగా స్త్రీలు వివిధ సమస్యల మీద రాసిన వ్యాసాలు వివిధ సందర్భాల్లో చేసిన ఉపన్యాసాలు, అభిప్రాయాలు వందల సంఖ్యలో కనబడుతున్నాయి. స్త్రీ విద్య దగ్గర నుండి ప్రారంభించి రాజకీయాల్లో స్త్రీల భాగస్వామ్యం వరకు అనేక విషయాల మీద కథలు రాశారు. స్త్రీల జీవిత దృక్పథ పరిణామాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడగల సమర్థవంతమైన కథాసాహిత్య ప్రక్రియకు మించిన ప్రక్రియ మరొకటి లేదని తమ రచనల ద్వారా తెలియజేశారు.

1946లో రచనావ్యాసంగం ప్రారంభించిన ఇల్లిందల సరస్వతిదేవి, వాసిరెడ్డి సీతాదేవి, ముప్పాళ్ళ రంగనాయకమ్మ, ఆచంట శారదాదేవి, అబ్బూరి ఛాయాదేవి మొదలైనవారు దాదాపు ఇరవై మంది రచయిత్రులుండటం విశేషాంశం.

ఇల్లిందల సరస్వతీ దేవి రాసిన 'బలియసి కేవలమూ ఈశ్వరాజ్ఞ'. ఈ కథలో ఇతివృత్తంతో పాటు కథాకథనం కూడా బాగుంది. జమీందారిణియైన శకుంతలాదేవి వైశాఖ పూర్ణిమ రోజున పేదలకు దానం చేసి వాళ్ళను సంతోషపెట్టడం అలవాటు. ప్రతి ఏడాదిలాగే రామయ్య, చెల్లెమ్మ దంపతులు రాలేదని ఎదురు చూసి ఇంకా రాలేదేమిటని తనే స్వయంగా అద్దాల బండి పంపించి రప్పిస్తుంది. రామయ్య, భార్య చెల్లమ్మ సహాయంతో బండి దిగుతాడు. కొయ్య కాళ్లతో చేతుల కింద పెట్టుకున్న కర్ర సహాయంతో నిమిషానికి ఒకొక్క అడుగు వేస్తూ అతను వస్తుంటే శకుంతల మనసంతా జాలితో నిండిపోయింది. ఇలా నాలుగేళ్లుగా చెల్లెమ్మ భర్త రామయ్యతో పడుతున్న అవస్థను తెలుసుకుని బాధపడుతుంది. శకుంతల గతమంతా కళ్ళముందు కదిలింది. ఎండాకాలం ఎండవేడి కలగకుండా బంగ్లాకు చల్లదనం కోసం తడికలు కట్టడానికి వచ్చినవాళ్ళు రామయ్యని, చెల్లమ్మను అపురూపంగా చూస్తుంటారు. వాళ్ళిద్దరూ చిలకా గోరింకల్లా అన్యోన్యంగా వుండటం, తెచ్చుకున్న భోజనాన్ని తింటూ మాట్లాడుకుంటూండేవారు. జమిందారిణి వాళ్ళ అన్యోన్యం చూసి ఆశ్చర్యపోయింది. ఒక రోజున నిచ్చెనమెట్లు ఎక్కి తడికలు కడుతున్న రామయ్య పైనుంచి కింద పడిపోవడంతో కాళ్ళు రెండు విరిగి పోయాయి. చెల్లమ్మ బాధ చూసి విస్తుపోయిన ఆమె వెంటనే హాస్పిటల్‌కి పంపించింది.

చెల్లమ్మ రామయ్య పట్ల చూపిన శ్రద్ధ, ప్రేమ తనలో లేవేమిటి? అన్న మీమాంస ఆమెలో మొదలౌతుంది. జమీందారు గారు అనారోగ్యంగా వున్నా, మందైనా ఇవ్వకుండా ఇన్నాళ్లు నిర్లక్ష్యంగా వున్న తనని తాను విమర్శించుకొని భర్తకు ఇకనుంచి సేవలు చేయాలని నిర్ణయించుకుంది. భర్తను నిరాదరించిన తన కళ్ళు తెరిపించినందువల్లనే రామయ్య, చెల్లమ్మల పట్ల ఆమె ఆదరణగా మారడం జరిగింది. హృదయ పరివర్తన కలిగించిన కథ ఇది.

1952లో మొదటి కథ రాసిన వాసిరెడ్డి సీతాదేవి ఈ దశాబ్దిలో(1946–55) మంచి కథలు రాశారు. యాభయ్యవ దశకం రచయిత్రుల సాహిత్యంలో తమదైన స్థానాన్ని కల్పించుకుంటున్న దశాబ్దం. రచయిత్రులుగా తాము ఏం రాయాలి? ఎట్లా రాయాలి? అనే ప్రశ్నల్ని వేసుకున్న దశాబ్దం. ఆ కాలంలో రచయిత్రిగా వాసిరెడ్డి సీతాదేవి ఉనికి తెలుగు సాహిత్యానికి పెద్ద ఉపకారం చేసిందనే చెప్పాలి. 1950 దశాబ్దానికి ఇంకొక ప్రత్యేకత కూడా ఉంది. స్వాతంత్ర్యానంతరం ప్రజలకు కొత్త ఆశలు కలిగించిన కాలం. ఆ సందర్భంలోనే సీతాదేవి కథలు రాయడం మొదలుపెట్టారు. సీతాదేవి పై ప్రశ్నలకు తన మొదటి కథలోనే సమాధానం ఇచ్చారు. దాదాపు ఆమె కథలన్నింటిలోనూ కింది కులాల వాళ్ళు, బీద, వ్యవసాయ కూలీలు, ఆడవాళ్ళ బాధలనే చిత్రించారు. ఆమె కథలు చదువుతున్న కొద్దీ, ఆమె తనకు పరిచయమైన జీవితం తప్ప మరొకటి రాయలేదని అర్థమవుతుంది. వర్గం, జండర్ గురించి ఇంత సీరియస్‌గా కథలు రాసిన సీతాదేవి హాస్య, వ్యంగ్య కథలు రాయటంలో కూడా సిద్ధహస్తురాలు. మనుషుల స్వభావాలనూ, ప్రవర్తనలనూ, ఆశలనూ, అత్యాశలనూ ఆమె హాస్య ధోరణిలో వాఖ్యానించగలరనేదానికి అపస్వరాలు, ఎల్లమ్మ, అతని కథ, ఖాకీడ్రస్సు, తిరస్కృతి, ప్రతిబింబం, శ్రీనాథరావుతో పరిచయం తదితర కథలు ఉదాహరణలు. ఈ కథల్లోని వ్యక్తులతో పాటు తద్వారా వాళ్ళు సృష్టించే సామాజిక సమస్యలను కూడా చెప్పటం వల్ల సాహిత్య ప్రయోజనాన్ని కలిగిస్తారు. 'శ్రీనాథరావుతో పరిచయం' కథ అలాంటిదే. మధ్య తరగతి జీవితాల గురించి, వాళ్ళ పిరికితనాల గురించి కూడా మంచి కథలు రాశారు. ఎంత క్లిష్ట విషయాన్నయినా, సరళంగా, స్పష్టంగా రాయటం సీతాదేవి ప్రత్యేకత. తను ఎంచుకున్న వస్తువు తనకు బాగా పరిచయమైనదీ, తాను స్పష్టంగా చెప్పగలిగినదీ అయితే తప్ప ఆమె కథ రాయరని కథలన్నీ చదివితే అర్థమవుతుంది. అందువల్లనే ఆమె కథలు వాస్తవికతలో పాదుకుని ఉంటాయి. కేవలం వాస్తవికతను చిత్రించటంతోనే ఆమె తృప్తి పడదు. ఆ వాస్తవికతను ఒక ప్రత్యేక దృష్టికోణం నుంచి చూసి విశ్లేషిస్తుంది. ఆ దృష్టికోణం వర్గ దృక్పథం కావచ్చు. లింగ వివక్ష రూపాలను గుర్తించగలిగే సూక్ష్మ దృష్టి కావచ్చు, మానసిక విశ్లేషణ కూడా కావచ్చు. చక్కని తెలుగు రాస్తూ, మధ్య మధ్యలో పైరుగాలి పరిమళాన్ని మోసుకు వచ్చే కొన్ని అచ్చమైన గ్రామీణ ప్రజల పదాలనూ, వ్యక్తీకరణలనూ వాడటంతో పాఠకులకు ఈమె కథలు చదవటం తేలికవుతుంది. విషయం బలంగా మనసుకెక్కుతుంది. గ్రామీణ వాతావరణాన్ని వర్ణించగలదు. కృత్రిమమైన, ఆడంబరమైన అలంకారాలు లేని సహజమైన సరళమైన శైలి సీతాదేవిది. ఆమె పాఠకుల ఆవేశాన్ని రెచ్చగొట్టి, ఉద్రేకాన్ని కలిగించాలని ప్రయత్నించరు. ఆలోచనల్ని రేకెత్తించి అవగాహన కలిగించాలని ప్రయత్నిస్తారు. అందువల్ల ఆమె కథల్లో అనవసర వర్ణనలూ, గ్లామరైజ్ చేసే చిత్రణలూ కనిపించవు. కథ సూటిగా చెప్పటం, కథ మాత్రమే చెప్పటం మంచి కథానికల లక్షణం అంటారు కొడవటిగంటి కుటుంబరావు.

సీతాదేవి కథల సంపుటి 'ఆమెలోకం' పుస్తకానికి ముందుమాట రాస్తూ, కొడవటిగంటి కుటుంబరావు ఇలా అన్నారు : 'కథా రచయిత్రుల సంఖ్య ఇప్పుడిప్పుడే పెరుగుతున్నది. అయితే వారిలో అభ్యుదయ వాదాన్ని అర్థం చేసుకున్నవారి సంఖ్య తక్కువ. ఉన్న కొద్దిమందిలో సీతాదేవికి పెద్ద స్థానం ఉన్నది. ఆమె రాసిన కథలు ఎక్కువ లేనప్పటికీ జీవిత సమస్యల గురించి ఆమెకు గల దృక్పథాన్ని అవి స్పష్టం చేస్తాయి' అని అన్నారు. ఆ దృక్పథమే కథా రచయిత్రిగా సీతాదేవికి ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తుంది. సీతాదేవి కథలు ముఖ్యంగా వర్గపీడన, దోపిడీ, లింగపరమైన అణచివేతలను ప్రతిబింబిస్తాయి. అరవయ్యవ దశాబ్దంలో వెల్లువలా వచ్చిన జనరంజక ధోరణి ఆమెను తాకకపోవటానికి కూడా ఆమెకున్న అభ్యుదయ దృక్పథమే కారణం. ఆమె మొదటి కథ 'సాంబయ్య పెళ్లి' నుంచి ఆమె ఎంచుకున్న సమస్యలూ, చిత్రించిన జీవితం భిన్నమైనవి.

సీతాదేవి మొదటి కథ 'సాంబయ్య పెళ్లి' ఒక కురూపి కథ. సాంబయ్యది మామూలు అంద విహీనత కాదు. ఒక కన్ను కాయగాసి ముఖమంతా మచ్చలతో లోతైన గుంటలతో ఇనుము పైన తుప్పు పట్టినట్లు ఉంటుంది. అతని అనాకారితనం వల్ల తోటిపిల్లలు ఆటలకు కూడా రానిచ్చేవారు కాదు. ఎంత అనాకారికైన జీవేచ్ఛ అందరిలో ఉన్నట్లుగానే సాంబయ్యలో కూడా ఉంది. పాలేరు పని చేస్తున్న సాంబయ్యకు ఇరవై ఏడు ఏళ్ళు వచ్చాక పెళ్లి కుదురుతుంది. సాంబయ్య ఎంత అనాకారి అయినా, భౌతికంగా ఎలాంటి అవకతవకలున్నా సాటి మానవులు అతని భౌతిక రూపం నుంచి మనుసును మాత్రమే

వేరు చేసి చూస్తున్నా, అతని స్వభావం మానవ సహజ స్వభావమే. తన భార్య గుడ్డిదీ, కుంటిది కాకూడదనుకుంటాడు. అందంగా ఉందని సంతోషిస్తాడు. మూగదని తెలిసినా 'ఆమె కూడా తన వంటి దురదృష్టవంతురాలే గదా" అని ఆమెను సానుభూతితో దగ్గరకు తీసుకుంటాడు. మానవ అనుభూతుల క్రమ పరిణామాన్ని సాంబయ్య పాత్రలో చూపించడంలో సీతాదేవి గొప్ప ప్రతిభ చూపించారు. మొదటి కథలోనే విలక్షణమైన పాత్రను ఎంచుకొని, ఇంతకుముందున్న రచయితలు చిత్రించని పాత్ర సృజనతో కథను రక్తి కట్టించడం ఆమె కథనంలోని ప్రత్యేకత.

'ధర్మదేవత గుడ్డి కళ్ళు' కథలో కింది వర్గపు భార్యభర్తల సంబంధాన్ని వాస్తవికంగా చిత్రిస్తూ అందులో మార్పు రావలసిన అవసరాన్ని ఎంతో సున్నితంగా, అదే సమయంలో ఒక శక్తివంతమైన గొంతుతో చెప్పించారు సీతాదేవి. మధ్య తరగతి ఇళ్ళల్లో గుట్టు చప్పుడు కాకుండా జరిగే దృశ్యాన్ని నడిబజార్లో చూసేసరికి, మధ్య, పై తరగతి వాళ్ళు భరించలేకపోతారు. పోలీసులను పిలిచి భర్తను అరెస్టు చేయిస్తారు. అక్కడున్న ఒక ముసలాయన 'పేదోళ్ళ సంసారం పెద్దోళ్ళకు లోకువ' అని గొణుక్కుంటాడుగానీ ఆయనేమీ చేయలేడు. పేదవాళ్ళ పరిస్థితిని వాస్తవికంగా చిత్రించటంతోపాటు పేదవాళ్ళ ప్రేమలను వర్గ దృక్పథంతో మాత్రమే చూడకూడదని సీతాదేవి ఈ కథలో చెప్పారు.

అబ్బూరి ఛాయాదేవి తన కథలన్నింటిలోనూ స్త్రీల సమస్యలను వస్తువుగా స్వీకరించారు. స్త్రీ సమస్యల పట్ల ఆమెకు గల ప్రాపంచిక దృష్టి కోణానికి నిదర్శనం.అన్ని కథల్లోనూ కుటుంబ చట్రంలో స్త్రీలు కంటికి కనబడని మానసిక హింసకు ఎంతగా గురవుతుంటారో చాలా సున్నితంగా ఎత్తి చూపగలిగారు. 1954 నాటికి ఎంతో అభ్యుదయకరంగా, ఆదర్శవంతంగా ఆలోచించగలిగారు. ఆనాటికే ప్రగతిశీల భావాలు కలిగిన 'ప్రయాణం' లాంటి కథ ఆమె రాసిన కథలన్నింటిలోనూ చాలా ముందుచూపుతో, శాస్త్రీయ, స్త్రీవాద దృష్టితో రాసిన కథ. స్త్రీవాద వుద్యమం బలోపేతమైన తర్వాత కానీ ఇలాంటి అజెండాను రూపొందించుకోలేక పోయారు. స్వార్థం కోసం, స్వప్రయోజనాల కోసం అలమటించే మనుషులను, ఆదర్శాలకు నిలబడే మనిషిని ప్రధాన పాత్రలుగా చేసుకుని చెప్పిన ఈ కథ ఎంతో గొప్ప కథ. ఎందుకంటే, స్త్రీ వాద భావాలను విస్తరించిన తర్వాత స్త్రీలపై జరిగే అత్యాచారాలను అన్యాయాలను పాజిటివ్‌గా, పాసిసివ్‌గా అర్థం చేసుకునే క్రమంలో వెల్లివిరిసిన భావచైతన్యం 1954 నాటికే ఈ కథలో చర్చించారు. తన ప్రమేయం ఏ మాత్రం లేకుండా జానకిపై జరిగిన అత్యాచారాన్ని మనం సరైన పద్ధతిలో ప్రయాణం చేస్తున్నప్పటికీ రాంగ్ రూట్‌లో వచ్చిన వాహనదారుల తప్పిదాలకు అవతలి వ్యక్తి కూడా ఆ తప్పులను, నష్టాన్ని ఏవిధంగా భరించాల్సి వస్తుందో అదే విధంగా స్త్రీలపై జరిగే అత్యాచారాలు కూడా స్త్రీల ప్రమేయం లేకుండా జరిగే అత్యాచారాలను 'ఆక్సిడెంట్' గా భావించాలి తప్ప శీలభంగంగా భావించి ఆత్మహత్యలకు పాల్పడరాదనే అవగాహన ఈ కథలో వ్యక్తమవుతోంది. ఇక్కడ రచయిత శిల్పనైపుణ్యాన్ని అభినందించి తీరాలి. కథనం ఏ మాత్రం జాగ్రత్తగా లేకపోయినా రచయితకి స్త్రీలపై జరిగే అత్యాచారాల పట్ల సానుభూతి లేదని అపార్థం చేసుకొనే ప్రమాదం వుంది.

స్త్రీలపై జరిగే అత్యాచారాన్ని ప్రాణం కన్నా మిన్నగా తీసుకోవాల్సిన పనిలేదని ఈ కథలో రచయిత్రి చెప్పారు. చాలామంది అమ్మాయిలు ఆత్మహత్యలకు పాల్పడకూడదన్నది ఆమె ఉద్దేశం. ఏమాత్రం అజాగ్రత్తగా రాసినా ఈ కథను అపార్థం చేసుకునే ప్రమాదం ఉంది. అమ్మాయిలపైన జరుగుతున్న అత్యాచారాలను ఉదాసీనంగా తీసుకోవాలని అర్థం స్ఫురించగలదు. కానీ ఈ కథలో అలాంటిదేమి జరగలేదు. అబ్బూరి ఛాయాదేవి కథాపరిధి 'కుటుంబ జీవితం'. అందుకే ఆమె కథలో స్త్రీవాద చైతన్యం కూడా కుటుంబ జీవితానికే పరిమితమైంది. రచయిత్రికి కుటుంబ జీవితం పట్ల నమ్మకం, వైవాహిక వ్యవస్థ పట్ల సదాభిప్రాయం వున్నాయి. అందుకే ఈమె కథల్లో మనకు తాగుబోతు భర్తలు కానీ, భార్యలను హింసించే శాడిస్ట్ భర్తలు కానీ కనిపించరు. దాదాపుగా ఈమె కథలన్నీ స్త్రీ సమస్యలకు సంబంధించినవే. మరి స్త్రీల సమస్యలు స్పృశించడంలో రచయిత ఆర్తి ఏమిటి? అంటే కుటుంబంలో తీరిక లేకుండా స్త్రీలు చేసే శ్రమ పట్ల 'సానుభూతి' అని చెప్పవచ్చు. ఈమె కథకు ముడిసరుకులు తన జీవితానుభవాలే. తనకు తెలియని జీవితాన్ని చెప్పడానికి ఏ కథలోనూ ప్రయత్నించలేదు.

ఛాయాదేవి గారి కథన పద్ధతి చాలా ప్రత్యేకమైంది. పదునైన హేతుబద్ధమైన మౌలిక మార్పులను కోరే భావాలను చాలా సరళంగా, సున్నితంగా రాశారు. భాష ఎంతో హాయిగా వుంటుంది. ఆంగ్ల పదాలు అత్యవసరమైతే తప్ప వాడరు. తెలుగు భాషను వాడిన తీరు ఆ కథలకు సౌందర్యాన్ని తెచ్చి

పెట్టింది. ఇంత నిరాడంబరంగా చెప్పడం వల్ల పాఠకులకు ఈమె చెప్పే విషయాలు బాగా అర్థమవుతున్నాయి.

'పార్వతమ్మ' కథ ప్రచురణతో రంగనాయకమ్మ కథాసాహిత్య జీవితం ప్రారంభమైంది. ఈ కథ 1955లో వచ్చింది. జీవించే పద్ధతిలో, ఆలోచించే విధానంలో వున్న ప్రత్యేకతను పరిశీలించి కథావస్తువును మలుచుకోవడం రంగనాయకమ్మ కథాసాహిత్య లక్షణం. అందాన్ని గురించి ఆకాంక్ష, చైతన్యం ప్రతి మానవుడిలోనూ అంతో ఇంతో ఉంటాయి. అవి మోతాదు మించినప్పుడు ఏమవుతుంది? స్వీయ సౌందర్య స్పృహ సాంఘిక సంబంధాలకు, సహజ పరిణామాలకు అవరోధంగా పరిణమిస్తుంది. అట్లాంటి అసహజత్వంలోకి జారిన పార్వతమ్మ కూతురు పెళ్లి తర్వాత కొన్ని రోజులకు మనుమడు పుట్టిన తర్వాత మళ్లీ సహజ సౌందర్య భరిత మానవ సంబంధాల్లో చాలా సాధారణంగా ఇమిడిపోయి జీవించడాన్ని చూపించిన కథ 'పార్వతమ్మ'.

1945లోనే రచనావ్యాసంగం ప్రారంభించిన ఇల్లిందల సరస్వతీదేవితో కలుపుకొని పి.శ్రీదేవి, వాసిరెడ్డి సీతాదేవి, వట్టికొండ విశాలాక్షి, రంగనాయకమ్మ, ఆచంట శారదాదేవి, అబ్బూరి ఛాయాదేవి, మాలతీ చందూర్ మొదలైన వారు ఈ దశాబ్దం (1946 – 55)లో మంచికథలు రాశారు. చదువుకొన్న స్త్రీల సమస్యలు, వైవాహిక జీవిత సమస్యలు, కౌటుంబిక సంఘర్షణలు వాళ్ళ సృజన సాహిత్యానికి వస్తువులయ్యాయి. హరితవిప్లవం వల్ల కలిగిన మిగులును అనుభవించే భిన్న వ్యవసాయక వర్గాల నుండి ఉద్యోగాల కోసమో, వ్యాపారాల కోసమో పట్టణంలో జీవించే వాళ్ళ సంఖ్య ఎక్కువైన కొద్దీ.. ఆ వర్గాలతో ప్రత్యక్షంగానో పరోక్షంగానో సంబంధంలో వున్న స్త్రీలకు లభించిన విశ్రాంతి వాళ్ళను అస్తిత్వాన్వేషణలోకి నెట్టింది. తామెవరు? తమకు కావలసింది ఏమిటి? స్వీయ ఆకాంక్షలను, ఆశలను సంతృప్తి పరుచుకొనటానికి తాము సంఘర్షించాల్సింది ఎవరితో? సమన్వయం సాధించాల్సింది ఎక్కడ? వంటి ప్రశ్నలతో కూడిన కథలు మొదలయ్యాయి. ఈ కాలపు మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి స్త్రీల జీవితాలను ఎంతటి సంఘర్షణకు ఆందోళనకు లోను చేశాయో వీరి కథల్లో చిత్రించారు. ఈ దశాబ్ది కథాసాహిత్యం చదివితే స్వాతంత్ర్యానంతర తొలినాళ్లలో మన సమాజపు మహిళల స్థితిగతులను, సంఘర్షణలను కొంతమేరకు అర్థం చేసుకోవచ్చు.

■

## ఖమ్మం ఈస్థటిక్స్ -2022 పురస్కారాలకు ఆహ్వానం

ఖమ్మం ఈస్తటిక్స్ పేరిట ప్రతి యేటా ఒక ఉత్తమ కవితా సంకలనానికి, మూడు ఉత్తమ కథలకు పురస్కారాలు ఇవ్వనున్నాం. మూడు ఉత్తమ కథలకు ప్రథమ, ద్వితీయ, తఅతీయ పురస్కారాలు ఇవ్వడమే కాక మరో తొమ్మిది కథలను కూడా ఎంపిక చేసి 12 కథలను ఒక పుస్తకంగా అచ్చెయ్యడం జరుగుతుంది. ఉత్తమ కవితా సంకలనానికి రూ.40 వేల నగదు బహుమతి, మూడు ఉత్తమ కథలకు మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండవ బహుమతిగా రూ.15 వేలు, మూడవ బహుమతిగా రూ.10 వేలు అందచేస్తారు. కవితా సంకలనాలు 2021 ఏప్రిల్, 2022 మార్చి నడుమ ప్రచురితమై ఉండాలి. కనీసం 25 కవితలకు తగ్గకుండా సంకలనం ఉండాలి. పురస్కారం కోసం కవితా సంకలనం నాలుగు ప్రతులను పంపాల్సి ఉంటుంది.


పోటీకి పంపే కథలు కేవలం ఈ పురస్కారం కోసం మాత్రమే రాసినవై ఉండాలి. కథ ప్రింట్ నాలుగు ప్రతులను, యూనికోడ్ సాఫ్ట్ కాపీని పంపాలి. ఖమ్మంలో నవంబర్‌లో జరిగే వేడుకలో అవార్డుల ప్రదానం ఉంటుంది. ఈ అవార్డుల కోసం కథలు, కవితా సంకలనాలు పంపగోరేవారు ఆగస్టు 31, 2022 లోపు కింది చిరునామాకు పంపాలి. ఈ అవార్డుల కమిటీకి ఓల్గా, ఎల్లెస్సార్ ప్రసాద్ గౌరవ సలహాదారులుగా వ్యవహరిస్తారు. ఖమ్మం ఈస్థటిక్స్ సభ్యులుగా ప్రసేన్, సీతారాం, మువ్వ శ్రీనివాసరావు, రవిమారుత్, ఫణి మాధవి, వంశీకృష్ణ, పగిడిపల్లి వెంకటేశ్వర్లు వ్యవహరిస్తారు. కవితా సంకలనాలు, కథలు పంపాల్సిన చిరునామా : ఖమ్మం ఈస్తెటిక్స్ సాహిత్య పురస్కారాలు, 11–2–51, బాలాజీ నగర్, ఖమ్మం – 507001.

**– రవి మారుత్**

## సాహితీ కిరణం కవితల పోటీ

చిరంజీవి జాహ్నవి కొనరాజు (అన్యతాసి) జయంతి సందర్భంగా (జులై 15) సాహితీ కిరణం కవితల పోటీ నిర్వహిస్తోంది. ప్రథమ బహుమతి రూ.3000, ద్వితీయ బహుమతి రూ.2000, ఒక్కొక్కటి రూ.1000 చొప్పున 5 ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి.కవిత 20 – 30 లైన్ల మధ్యలో ఏ అంశం మీదైనా ఉండొచ్చు. కవితలు పోస్టు/ కొరియర్ ద్వారా 30.06.2022 లోపు ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్ నెం.3. హైదరాబాద్– 500102కు పంపాలి. వివరాలకు 94907 51681 నెంబర్లో సంప్రదించొచ్చు.

**– పొత్తూరి సుబ్బారావు**






# లొట్టిముంత పొంగేలా ఒంపిన కవిత్వం

- మెట్టా నాగేశ్వరరావు
99510 85760

ఇటీవల కవులను చూస్తుంటే ముచ్చటేస్తోంది. చాలామంది కవులు కాలక్షేపానికి రాయడం లేదు. కాలానికి ఏది అవసరమో అదే మాట్లాడుతున్నారు. జీవితంలో ముంచి కవిత్వాన్ని తెస్తున్నారు. తెలుగు కవిత్వానికి ఇదివరలో అపరిచితమైన ఎంతో వ్యథాభరితమైన జీవితం దగ్గరవుతోంది. అనేక వృత్తుల మీద సాధికారికమైన పట్టుతో కవితలు రావడం అందుకు సాక్ష్యం. అనంతపురం నుంచి రాధేయ మగ్గంబతుకు వచ్చినప్పటి నుంచీ బహుజన వృత్తులను మూలాల్నుంచి రాసే సోయ పెరిగింది. తాజాగా ఈ.రాఘవేంద్ర రాసిన 'కల్లంచుల బువ్వ' దానికి సంపూర్ణమైన వృత్తి కవిత.

రాఘవేంద్ర 'గాయపడ్డ విత్తనం'తో సీరియస్ పోయెట్‌గా అందరి దృష్టినీ ఆకర్షించాడు. కరువునేలలో నాగలి పట్టిన రైతు వాన కలిసిరాక, వలసవెళ్లి, నగరంలో వాచ్‌మెన్‌గా బతుకుతున్న దుస్థితిని ప్రతిభావంతంగా రాయగలిగాడు. రెండవ సంపుటిగా 'కల్లంచుల బువ్వ' తీసుకొచ్చాడు. ఇది కల్లు గీతతో ఊపిరిగీతను పొడిగించుకునే గౌడ బతుకుని విస్తృతంగా ఆవిష్కరించాడు. దీర్ఘకవిత రాయడం అంత సులభమేమీ కాదు. పది పంక్తుల కవితలోనే అటో ఇటో సడలిపోతాం. అలాంటిది అనేక భాగాల దీర్ఘ కవితలో కవిత్వ గంధం చెడకుండా నిర్వహించాలంటే ఎంతో కళాతృష్ణ వుండాలి. రాఘవేంద్ర ఈ సంపుటిని వస్తువులోనే కాదు, అభివ్యక్తితోనూ ఆకట్టుకుంటాడు. వాళ్ల నాయిన కల్లుగీతకు బయల్దేరిన వేళలో కవిత్వం మొదలైంది.

'ఊరంతా చప్పుడు చేయని గువ్వై
మెలుకువ రెక్కలు/ తెరవక ముందే
కళ్లల్లో నిద్రను తుడిచి
కడుపు సంచిలో/ ఉత్తపేగుల్ని తడుముతూ
ఈదుల్ని దారితాడుతో చేదుకుంటూ
ఇంటి నుండి మొదలైతుంది/ మా నాయన పయనం'

నాయన పయనమే కాదు; ఈ సంపుటిలో కవిత్వ పయనమూ జోడి కుదిరింది. సూర్యోదయం కాకముందే నాయన ఆకలిని తీర్చే వృత్తిపనికి బయలుదేరాడు అని చెప్పడానికి ఎంత పనితనాన్ని చూపెట్టాడో గదా!

చప్పుడు చేయని గువ్వని ఊరుతో అభేదం చెప్పి, మెటాఫర్‌ని సాధించాడు. కడుపుసంచీ, దారితాడు కూడా మెటాఫర్లే. కవితనం అతడి అభివ్యక్తి నిపుణతలోనే వుంటుందనీ కవి రాఘవేంద్ర ఆద్యక్షరంలోనే నిరూపించాడు.

'తాటిచెట్టు కింద/ చేరిన బుద్ధుడై
మా బతుకుబువ్వను దర్శించే / సూత్రాన్ని కనుగొంటాడు'

ఇందులో నాన్నకు, బుద్ధుడికి సామ్యతను కూర్చుజేశాడు. బుద్ధుడిది రావిచెట్టు, దు:ఖాన్ని దాటే అష్టాంగసూత్రం. కవి నాన్నది తాటిచెట్టు, బతుకుబువ్వ దర్శించే సూత్రం. ఏదొకటి పోలిక చెప్పేద్దాం అనే ఉబలాటం కాదిది. ఔచిత్యాన్ని గీటురాయిపై సరిచూసుకున్నాకే పదాలకు ప్రాణం పోద్దామనే తపసు కవిది. రాఘవేంద్ర భావుకత కావ్యం పొడవునా రమణీయమై ఒప్పినది.

"ఆయన వూపిరి స్పర్శ/ పసిగట్టిన చెట్లన్నీ
గౌరవసూచకంగా/ మబ్బుల దుప్పటిని మడతబెట్టి
గురువుముందు నిలబడిన/ విద్యార్థులవుతాయి"

"కుండనిండా
కల్లు తొలుకుతుంటే
ఆయన ముఖం
చుక్కలు కాసిన ఆకాశమయ్యేదీ"

ఒక్కో వాక్యాన్ని ఊహాశక్తిగానూ, మరో వాక్యంలో వాస్తవికం గానూ దర్శనమిస్తాడు. అల్లసాని అంబరాన్ని చుంబించే పర్వతాన్ని వర్ణించాడు. ఈ కవి మబ్బులు తాకే తాడిచెట్టుని వర్ణించాడు. అక్కడ కల్పనాశక్తి. ఇక్కడ నిజజీవితం. తాతలకాలం నుంచీ తాను చూసిన కల్లువృత్తి వెతలను, వృత్తి నైపుణ్యాన్నీ చాలా నిశితంగా వర్ణించాడు.

"చలకత్తితో మట్టలను / తొలుస్తున్న శ్రద్ధ
వైద్యం చేస్తున్నట్లుగానే వుంటుంది
మోకుతో పాకుతూ పారతో చెక్కి/ లొట్టికి మెలికిగట్టి
ఏ పుస్తకాల విద్దెకు అందని / నేర్పనితనమే"

వృత్తిపరమైన పనిముట్లను, క్రియలకు కవిత్వం తొడిగే ఒడుపు ఇదే. చలకత్తిని కోస్తాలో పెనక్కత్తి అంటాం. మువ్వదాక వెళ్లాక అడ్డుగ వున్న కమ్మలను, మట్టలను తొలగించే కత్తిది. గెలను గీతేసేది గీతకత్తి. దీనిని బ్లేడంత పదునుంటుంది. ఇంకా మోకు, గుజిబంధం, కత్తినూరు బల్ల, బుకునీ (నడుంకి చుట్టే తోలుబెల్టు), నెర్సుకోల, తల్లికొలిక, పిల్లకొలిక, కొయ్య, గరికే, దోనిబల్ల వంటి పదాలను వాడటం వల్ల కల్లుగీత కవిత్వం సహజత్వ పరిమళమైనది. రాఘవేంద్రలో వృత్తి పట్ల దార్శనికత మెండుగా వుంది.

బహుజనుల వృత్తుల్లో నైపుణిత మెండుగా వున్నా, ఒళ్లు పులిసేలా చెమటపాటు పడినా బువ్వనవ్వు కోసమే సరిపోతుంది. వృత్తికొక వెత, తంటా వుంటుంది. రాఘవేంద్ర రాసిన ఈ బతుకుచెట్టు మీద గౌదగుండె పాట్లు ఎలా వున్నాయో చూద్దాం!

"గెనం గట్లపై నడుస్తున్నప్పుడు
గుజిబంధం లేపిన
కాళ్లపుండును పచ్చిక పుల్లలు
కొరుకుడు పెడుతుంటాయి
నడుం చుట్టూ ముత్తజు రాపిడి
వీపుపై మోకు రాకిన వాతలు
చెట్టుకున్న బరకులు / తొడలపై రంపపు కోతలు
తనువంతా గాయాల కొలిమిలో/ నుసిదేలుతున్నా
మా యింట్లో వెలిగే స్థిమితత్వపు
నిలువుకాళ్ల బుడ్డీ తను"

... ఇంకా తాడిమీద జారిపోవడం, కోతులు గీకిన గాట్లు, పురుగులు, చీమలు, తేనెటీగలు, పసరపాములు, తాడేలు పాముల పీడల మధ్య వృత్తిని నడపడం దినదినగండంగా వుంటుంది. అందుకేనేమో.. 'మరణం వంతెనపై నడిచే/ విచ్చుకత్తుల విన్యాసంలాంటి/ బతుకులు మావి' అంటాడు.

ఒక వృత్తికి మరొక వృత్తి సహకారం వుంటుంది. చాకలి వృత్తికి కుమ్మరి కుండలకు అనుబంధం వుంది. బోనం కుండలు, చావుకుండలు రైతులకు చాకలే తెస్తాడు. రేవు పొయ్యిలో పుల్లలు నరకడానికి గొడ్డలి కావాలి. దానికి పదును పెట్టడానికి కొలిమి కాక కావాలి. అలాగే గౌడీయవృత్తి నిర్వహణకు కొలిమి, మాదిగ తాత సాయం, పద్మశాలి నేత ఎలా తోడ్పతవో బొమ్మ కట్టించాడు.

"దాపగత్తి మారగత్తి / చలకత్తి గొడ్డలిగా
గీతకత్తులన్నీ సిద్ధపరచి
మా నాయనను బతుకు యుద్ధానికి
యోధున్ని చేసేది సుబ్బారాయుడు! (కమ్మరి సాయం)
"తొడలు అట్టుకట్టి / నార నలిపి
చేతులు కందిన కర్మయోగి మాదిగ మారెన్న
మోకు బుకునీ నళ్లుతుంటే
బిడ్డకు జడలల్లిన తల్లిలా
చాలు దున్నినంత నేర్పును
కళ్లప్పగించి చూస్తుండేపోయేవాళ్లం"
బడిగే నిచ్చెన/ వడ్ల నెర్సుకోల
పద్మశాలి బొంత"

సకల కులవృత్తులు సహజీవన సమన్వయ తత్వం బహుజన దృక్కోణాన్ని కళ్లకు కట్టించాడు కవి.

◆ ◆ ◆

దీర్ఘకవిత ఏ భాగానికాభాగం నడిపితే సరిపోదు. చెప్పాల్సిన విషయం పట్ల నిబద్ధత, నిజాయితీ వుండాలి. స్పష్టమైన సామాజిక దృక్పథం వుండాలి. మానవీయత దాని అంతిమ లక్ష్యం అయ్యుండాలి. వెనకబాటుతనం పోయి బడుగులు ఎదుగుదల మెట్టు మీద నిలబెట్టే సోయిని ఫలశ్రుతిగా వినిపించాలి. రాఘవేంద్ర వృత్తి గొప్పతనాన్ని, వృత్తికడగండ్లను ఏకరువు పెట్టి ఆగిపోలేదు. వృత్తి బతుకు పాలిట కరువుగా ఎలా మారిందో చెప్పాడు. "ద్రవ్యతంత్ర వంచన కత్తుల కింద/ కులవృత్తులు చితికిన ఆల్చిప్పలు/ వృత్తికారుల పొత్తి కడుపులో కసిగా/ దింపిన ఆయుధం సరళీకరణ". మరి కారణాలు

చూపేసీ ముగించనూ లేదు. ప్రగతికి విద్యమార్గాన్ని అన్వేషించాడు. అంబేద్కరు, ఫూలే మహాశయుల చైతన్యాన్ని కవి పుణికిపుచ్చుకున్నాడు. దాంతో ఇది కావ్యం స్థాయి ప్రయోజనానికి అద్దం పట్టినట్టయింది.

"ఉలి పలికిన చేయి / బలపం దిద్దమంటుంది
తాడిచెట్టెక్కిన కాళ్లు / బడి మెట్లెక్కమంటుంది".

◆◆◆

ఏ కవికయినా వస్తువు సగం బలమే. కళాభివేశనం మాత్రం ఇంకో సగం. అయితే వస్తువు దృక్పథానికి చెందింది. అభివ్యక్తి ప్రతిభకు చెందింది. కళ కనబడని కవిత్వంలో వస్తువెంత వాస్తవికతను ప్రదర్శించినా నిండుతనం వుండదు. రాఘవేంద్రకు ఈ ఎరుక వుంది. శీర్షికలోనే అభివ్యక్తి గొప్పతనం వుంది. కల్లు అంచున బువ్వ. కల్లు రేకలో జారితే, దాని అంచునే కల్లుపైకం. అదే గౌడన్నకు బువ్వగా మారుతుంది. అంటే కల్లు గౌడన్న పాలిట జీవరసం. ఇక పుస్తకంలోని వాక్యాల కళాత్మకత పరిశీలిద్దాం.

1. మా నాయిన చేతులు సోకిన చెట్లన్నీ ఆనంద ముగ్ధమైనట్లు/ తాడిచేతుల్లోని/ మంచుబిందువులన్నీ/ లయబద్ధంగా అడుగులు పడుతున్న/ ఆయన తలపై/పూలవానై కురిసేవి"

చెట్టు ఆనంద ముగ్ధమవడంలో మానవీకరణ శిల్పముంది. తాటాకుల మీద వున్న మంచుబిందువుల పూలవాన కురవడం సుందరమైన వూహాభివ్యక్తి.

2. ఇంజనీరుగా, రాజులాగ, భగీరథుడిగా, కర్షకుడిగా గౌడన్నను వర్ణించడంలోనూ సహజత్వం వుట్టిపడింది.

3. 'మా కడుపుల ఉడికిన/ మెతుకుల పిడస తను'. నాయినను మెతుకుల పిడస అనడం ఎంత అపురూపమో, అంత నిజమూనూ!

4. సొనకట్టెను ప్రాణవాయువుగా మారుతుంది అనడంలో నిగూఢత వుంది.

సంపుటిని మొదలుబెట్టి ముగించేలోపు పొడిపుటలు లేవు. మూసదనంలేదు. కొత్తగా వాక్యాన్ని రాద్దామనే తపన రాఘవేంద్రలో మెండుగా వుంది. వర్తమాన కవులెందరో కీర్తికండూతితో వాక్యాలను గారడీశిల్పం చేయడం కానవస్తుంది. రాఘవేంద్రలో ఆ వైపు చూపు లేదు. ఈ సంపుటి వృత్తి కవితలకు పెద్ద చేర్పు. బహుజన వృత్తులను జీవనపథంలో ఎత్తులకు ఎదిగే సూత్రాన్ని చూపెట్టిన కవి రాఘవేంద్రకు అభినందనలు. ■

## దొరకని నిధి

**అ**తను ఇప్పటికీ అక్కడే వున్నాడు
చాలా కాలంగా..
మోకాళ్ళ పై కూర్చొని
మంచు కురిసిన పచ్చిక మొదళ్లలో
ఏదో వెతుకుతుంటాడు

ఎండ గొడుగు కిందకు చేరి
తన నీడను తాను తడుముకుంటాడు
పట్టరాని ఉద్వేగానుభవం
అతని కళ్ల వెనుక ప్రవహిస్తుంటుంది

ఆమె తన ఇంటిలో నుంచి
కిటికీ రెక్క కొద్దిగా తెరిచి అటుగా చూస్తుంది
వణుకుతున్న మాటలతో ఏవో సంగతులు
నెమరు వేసుకుంటూ కనిపిస్తాడతను
ఒక నిర్వేదంతో ఆమె పెదాలు
బిగిసుకుంటాయి!

కిటికీ రెక్క మూస్తుందామె
రాత్రంతా నిద్ర పోయే ప్రయత్నంతో
రాత్రి ముగుస్తుంది
తెల్లవారుజామున
కిటికీ లోంచి చూసినపుడు
అతడు లేని శూన్యం
పచ్చికపై తేలుతూ పలకరిస్తుందామెను
అవును..
అతను అక్కడ లేడు..
కిటికీ రెక్క పట్టుకుని
ఆమె మాత్రం అక్కడే నిలబడివుంది!

**- సునీత గంగవరపు**
**94940 84576**



# నువ్వే నేనుగా ...

- ఎం.ఆర్.అరుణకుమారి
81215 23835

**"స**మీరా! నువ్వు నన్ను క్షమిస్తాను అంటే నీకు ఒక విషయం చెప్పాలి!" ప్రసాదు దీర్ఘంగా భార్య వైపే చూస్తూ అన్నాడు.

ఇసకలో పిచ్చుక గూళ్ళు కడుతూ అన్యమనస్కంగా ఉన్న సమీర తలెత్తి చూసింది ఏమిటన్నట్లుగా.

"నేను... నేను పెళ్ళికి ముందే కాలేజీ రోజుల్లో ఒక అమ్మాయిని ప్రేమించాను" నింపాదిగా అన్నాడు.

అది విన్న వెంటనే సమీర మొహం చిన్నబోయింది. బంతి పువ్వులా విచ్చిపోయిన కళ్ళతో భయంగా చూసింది. అదురుతున్న పెదవిని మునిపంటితో అదిమింది. అప్రయత్నంగా ఆమె చేతులు తగిలి కడుతున్న పిచ్చుక గూడు చెదిరి పోయింది.

"సారీ! నీకు ముందే చెబుదామనుకున్నా కానీ నీ రియాక్షన్ ఎలా ఉంటుందో.... మా ఇంటిల్లిపాదికీ నచ్చిన సంబంధం ఎక్కడ చెడిపోతుందో అన్న భయంతో చెప్పలేకపోయాను కానీ మోసం చేయాలని మాత్రం కాదు."

గుండెదడను ఆపే ప్రయత్నంగా చేతిని గుండెపైన వేసి అదుముకుంది సమీర. ఆమె చూపుల్లో తత్తరపాటు రెపరెపలాడుతోంది.

వాళ్ళిద్దరికీ పెళ్లి అయ్యి నెల అవుతుంది. అంతే! వారం రోజుల పెళ్లి... అటు ఇటు మనుగుడుపుల తిరుగుళ్ళు... అంతలో ఆమె నెలసరి రావడం... శోభనానికి మూహూర్తం కుదరనేలేదు. ఇంతలో పెళ్లికని పెట్టిన సెలవు అయిపోవడంతో వెళ్లి డ్యూటీలో చేరిపోయాడు. ఉగాది పండుగ, శని ఆదివారాలు కలిసి రావటం దానికి జతగా మరో రోజు సెలవు పెట్టుకుని అత్తారింటికి వచ్చాడు.

సమీర సహజ అందగత్తె . పెళ్లి చూపుల్లో చూసీ చూడంగానే ప్రసాద్‌కు తెగ నచ్చేసింది. ఎంతటి వారినైనా మోహంలో పడేస్తానంటున్నట్లున్న బాదం కాయల్లాంటి పెద్ద కళ్ళు.. వాటిని కాపు కాస్తున్నట్లు విల్లంబుల్లా వంగిన కనుబొమ్మలు... మధ్యన సన్నగా పొడవుగా సంపెంగ ముక్కు... లిప్‌స్టిక్ ఎరుగని గులాబీ రంగు పెదవులు... కృష్ణమ్మ చిక్కటి పాయలా బారెడు జడా... కె.విశ్వనాథ్ హీరోయిన్లా నిండుగా ఉన్న సమీర రూపం తొలిచూపులోనే మనసులో ముద్రించుకు పోయింది. ఆమె తన శ్రీమతి కాకపోతే తన మతి పోయేది ఖాయం అనుకుని వెంటనే తన అంగీకారం తెలియజేశాడు. ప్రసాదు తల్లిదండ్రులకూ అభ్యంతరాలు ఏమీ కనబడలేదు కాదనడానికి. తాంబూలాలు పుచ్చేసుకొని శుభలగ్నం నిర్ణయించేసారు .

తమకు ఉన్నంతలో చేశారో... లేనిది తెచ్చుకుని చేశారో గాని పెళ్లి మాత్రం చాలా ఘనంగా చేశారు అత్తింటివారు. కట్నమంటూ ప్రత్యేకం ఇవ్వకపోయినా బట్టలకని, బంగారానికి, అత్తా, ఆడపడుచుల లాంఛనాలనీ బాగానే ముట్ట చెప్పారు. వద్దని వారించినా వినేవారు కాదు.

"డబ్బుదేముందండీ.. మా అమ్మాయి సుఖంగా,

సంతోషంగా ఉంటే చాలు మాకు!" అని పదేపదే అనేవారు.

సమీర అమ్మ నాన్న, అన్నయ్యలు, వదినలు, పెదనాన్నలు, బాబాయిలు.. వారి భార్యా పిల్లలు, మేనత్తలు... వారి భర్తా పిల్లలు ... చాలా పెద్ద కుటుంబమే!

అందరూ కొత్త అల్లుడుని చాలా ఆత్మీయంగా, మర్యాదగా చూసుకుంటారు. రకరకాల ఫలహారాలు, పిండి వంటలు, వంటకాలు వండి తినమని బలవంత పెడతారు. తాను ఎక్కువ తినలేదని బాధ పడిపోతారు.

"మొహమాట పడకండి అల్లుడు గారూ.. ఇది మీ ఇల్లే అనుకోండి!" అంటూ వడ్డిస్తారు ఆప్యాయంగా.

"ఆహారం దగ్గర, వ్యవహారం దగ్గర మొహమాటం పనికి రాదండి బావగారు" అని నర్మగర్భంగా నవ్వుతారు బావమరుదులు.

తన బిడియం వాళ్లకు సరదా! అలాగని హద్దులు దాటరు. సున్నితమైన హాస్యమే గాని వేళాకోళం చేయరు. ఇంటి కోడళ్ళు సొంత తమ్ముడిలా ఆదరంగా చూస్తారు.

అంతా బాగానే ఉంది కానీ సమీరకు తను ఎందుకు దగ్గర కాలేకపోతున్నాడో అర్థం అవడం లేదు. అందరిలో ఉన్నప్పుడు సరదాగా నవ్వుతూ ఉండే సమీర ఏకాంతంలో 'టచ్ మీ నాట్‌లా' గా ముడుచుకుపోతుంది.

'కొత్త' అని కొన్నాళ్ళు, 'భయం' అని కొన్నాళ్ళు, 'జంకు' అని కొన్నాళ్ళు అనుకొన్నాడు. కానీ రోజులు గడుస్తున్నా ఆమెతో సాన్నిహిత్యం ఏర్పడడం లేదు. పొంగి పొరలే వయసు పరవళ్ల చిన్ని చిన్ని సరదాలు కూడా తీరడం లేదు. ప్రేమరాహిత్యమో... జడత్వమో... తమిద్దరి మధ్యా ఏవో అదృశ్య గోడలు! అడ్డు పడుతున్నాయి. ఆ గోడలు బద్దలు కొట్టకపోతే ... నిలవ నీటిలో పాచిలా సమస్య జటిలమవుతుంది. సమస్య పరిష్కార మార్గాలు అన్వేషించాడు. చిన్న బావమరిదితో రహస్య మంతనాలు సాగించాడు. సిగ్గుపడకుండా తన మనసు విప్పి చెప్పుకున్నాడు. భయపడుతున్న బావమరిది భుజం నొక్కి భరోసా ఇచ్చాడు.

"సమీర నా కంటి పాప! నా కంటిని నేనే పొడుచుకో గలనా?" అంటున్న ప్రసాదు చేతులు పట్టుకుని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు బావమరిది.

"ఆ కృష్ణమ్మంత, కృష్ణమ్మ నుంచి వచ్చే గాలి అంత స్వచ్ఛమైనది మా సమీర" అంటుంటే మల్లె పువ్వులా నవ్వేడు ప్రసాద్ తనకు తెలుసన్నట్టుగా.

ఆ రోజు రాత్రికి శోభనం ముహూర్తం నిర్ణయించబడింది. సమీర మొహంలో సిగ్గు బిడియం కన్నా ఆందోళన ఎక్కువైంది. అక్కలు, వదినలు, స్నేహితురాళ్ళు ఆమెతో నవ్వుతూ ఏదేదో మాట్లాడుతూనే ఉన్నారు కానీ సమీర మొహంలో నవ్వు లేదు.

"మరీ అంత భయం అయితే బతక లేవే!" అంటోంది ఒక స్నేహితురాలు మందలింపో... హెచ్చరింపో!

"భయమా? కృష్ణమ్మ నీళ్లు తాగి పెరిగిన ఏ ఆడపిల్లకైనా భయమంటే తెలుసటే? నువ్వు మరీనూ!" అంటోంది మరో స్నేహితురాలు.

"మరీ ఇంత సత్తెకాలపు సత్తెమ్మలా ఆలోచించకు. చదువుకున్న పిల్లలు కాదూ! అవన్నీ పట్టించుకుంటారా ఏమిటి?" మేనత్త ధైర్యం చెబుతోంది.

"మా కొడుకులు నీ కన్నా చిన్నవాళ్ళయిపోయారని గానీ లేకపోతే నిన్ను బయట సంబంధానికి ఇచ్చేవాళ్ళమా ఏమన్నానా?" ఇంకో మేనత్త అంటోంది.

"అవునటే అమ్మా! నువ్వలా ముందే చెప్పకపోతివి. నాకేం అభ్యంతరం లేదే సమీరను పెళ్ళాడ్డానికి" మేనత్త కొడుకు చిలిపిగా హాస్యమాడుతున్నాడు.

"ఓర్నాయనో! అదసలే భయపడుతూంటే... మధ్యన నీ గోలేమిట్రా రామాయణంలో పిడకల వేటలా.." ఎవరో విసుక్కొంటున్నారు ముద్దుగా.

"అందుకేగా చెప్పేదీ... ఆడపిల్లల్ని కాస్త ప్రపంచాన్ని చూడనివ్వండీ అనీ. అబ్బే! సాంప్రదాయాలు, ఆచారాలూ అంటూ పంజరంలో చిలకల్లా పెంచితే ఇదో.. ఇలా ప్రతి చిన్న విషయాలకూ భయపడక ఏం చేస్తారూ?"

''ఒరేయ్! పే..ద్ద ఆరిందాలా మాట్లాడకూ! నువ్వెళ్ళిక్కడ్నుండీ! మామయ్య వింటే నీ తాట తీస్తాడు"

"ఎప్పుడూ అదిలింపులు, బెదిరింపులే గానీ మా మాటలు చెవిన పెట్టరు గదా!" ఉక్రోషం!

"సర్లేరా! పెద్దోళ్ళం ఏం చెప్పినా మీ మంచికోసమే కాదుట్రా?" సర్దిచెప్పడాలు

"మరే! పాల్తాగే పాపాయిలం కదూ! మంచి చెడూ మాకేం తెలీదు మరి!" ఉడుకు నెత్తురు రువ్వే రుసరుసలుజ

అన్నో.. కొన్నో.. మాటలు భోజనం చేసాక గదిలో పడుకొన్న తన చెవిన పడుతూనే వున్నాయి. ఆమె మనసులో భయమో, బెరుకో పూర్తిగా పోవాలంటే తను మాట్లాడాలి. లేచి స్నానం చేసి తయారై సమీరనూ బయల్దేరదీశాడు శివాలయానికి వెళదామని. పూజ, అర్చన చేయించి వచ్చి కఅష్ణమ్మ ఒడ్డున కూర్చున్నారు. నెమ్మదిగా మాట్లాడ్డం మొదలెట్టాడు ప్రసాద్. ఎప్పట్లానే మౌనంగా వింటోన్న సమీర తనో అమ్మాయిని ప్రేమించానని ప్రసాద్ చెప్పగానే

బెదిరిపోయింది. ఆమె మనోసాగరంలో ఎన్నో భయాల అలలు మనసు గోడల్ని భీకరంగా ఢీకొంటున్నాయి. ఆ ధాటికి తట్టుకోలేనట్లు ఆమె శరీరం సన్నగా వణుకుతోంది. ప్రసాద్ ఆమె దగ్గరగా జరిగి భుజం చుట్టూ చెయ్యి వేసాడు ఆప్యాయంగా.

"అదంతా గతం సమీరా! మేమిద్దరం ప్రేమించుకున్న మాట నిజమే అయినా మా ఇద్దరి ఇళ్లల్లో మా పెళ్ళికి ఒప్పుకోరని మాకు తెలుసు. ప్రేమ అనేది రెండు మనసుల మధ్య బంధం కావచ్చు కానీ పెళ్లి అనేది రెండు కుటుంబాల మధ్య సంబంధం కదా! ప్రేమకు కులమతాలు, ఆస్తులు, అంతస్తులు.. ఏమీ అక్కరలేదు. ప్రేమకు అక్కర్లేని ఇవన్నీ పెళ్ళికి కావాలి. ఈ కావాల్సిన వాటిని కాదనుకుని ఎదిరించి పెళ్లి చేసుకునే ధైర్యం, మా బతుకు మేం బతకగలమన్న ధీమా ఆ ప్రేమకు ఉండాలి. ఆ స్థైర్యం మా ప్రేమకు లేకపోయింది. ఆ 'లేకపోవడం'లో పిరికితనమే కాదు; కుటుంబ ఒత్తిళ్లు కూడా ఉండొచ్చు. ఎదిరింపు భవితలో ఆనందం ఉంటుందో లేదో తెలీదు గానీ ఇరు కుటుంబ సభ్యుల ఆదరణ అయితే ఉండదన్న సత్యం గ్రహించాక విడిపోవడమే మంచిదన్న నిర్ణయాన్ని తీసుకున్నాం. ఎవరి బతుకులు ... బతికే దారులూ వేరైనప్పుడు.. జీవితంతో రాజీ పడక తప్పదు కదా సమీరా! మన రాతలను మనమే రాసుకోలేనప్పుడు కాల నిర్ణయాన్ని స్వాగతించి.. సాగక తప్పదు కదా!"

సమీర తలెత్తి అతని వైపే చూస్తోంది. నిండుగా సాగుతున్న కృష్ణమ్మంత ప్రశాంతంగా, మంద్రంగా, ఆర్తిగా, ఆత్మీయంగా, మృదుమధురంగా, ఒక్కో అక్షరమే మృదయఫలకం మీద చెక్కుతున్నట్లుగా చెబుతున్నాడు ప్రసాద్.

"సమీరా! జీవితం అన్నాక... ఎన్నో దశలు, ఎందరో మనుషులు... ఎన్నో ప్రయాణాలు... మరెన్నో మలుపులు... మజిలీలు ఉంటాయి! ప్రతి మలుపు ఆనందదాయకం కాకపోవచ్చు. ప్రతి మజిలీ శాశ్వతమూ కాదు. కలుపుకోవలసినవి కలుపుకుంటూ... విడువవలసినది విడిచిపెట్టేస్తూ.. దొరికిన వాటితో తృప్తి పడుతూ, వాటిలోనే ఆనందాలు వెతుక్కుంటూ, సృష్టించుకుంటూ .సాగిపోవడమే జీవితం!

అందని ద్రాక్ష పుల్లన అనుకోవడం వివేకం. అందిన పండును ఆస్వాదించడం విచక్షణ! అంతే సమీరా! మనమిప్పుడు ఒక జీవిత కాలం కలిసి ప్రయాణం చేయాల్సిన జీవన సహచరులం! గతంలో మనం ఏమైనా కానీ... గతజల సేతు బంధనం వల్ల వర్తమాన వారధి దెబ్బ తినడం తప్ప మనకు మిగిలే ఆనంద భవిత ఏముంది చెప్పు?

ఇదో.. ఈ కృష్ణమ్మనే చూడు. తనలో మాత్రం ఆకులు, పువ్వులు, చెత్తా చెదారం, మురికి... ఎన్ని కలవటం లేదు? అన్నిటినీ ప్రవాహంలో నెట్టేస్తూ.. తను నిర్మలంగా పారడం లేదూ? మనిషి మనసు, బతుకూ అలా సాగిపోవాలి సమీరా! పెళ్ళినాడు చేసిన 'నాతిచరామి' అన్న బాసకు నేను నా చివరి శ్వాస దాకా కట్టుబడి వుంటాను. నన్ను నమ్ము సమీరా!"

ప్రేమించిన వాడిని మర్చిపోలేక, పెళ్లాడిన వాడిని మోసం చేస్తున్నానన్న న్యూనతతో దగ్గర కాలేక బాధపడుతూన్న సమీర మనసును బావమరది ద్వారా తెలుసుకున్న ప్రసాద్.. భార్య మనసులో అపరాధభావం పోగొట్టటానికి, జీవిత సత్యాన్ని తెలపటానికి .. తనకు లేని ప్రేయసిని, ప్రేమకథనూ సృష్టించాడని తెలియని సమీర భర్తను ఆరాధనగా చూస్తోంది. తన మనసులోని భయాలు, చింతల పొరలన్నింటినీ కుబుసాల్లా వదిలించుకొంటూ ...

ప్రసాద్ లేచి నిలబడ్డాడు. చిరునవ్వుతో అతను చాచిన చేతిని అందుకొని లేచి అతని అడుగులో అడుగు వేసింది సమీర సంతృప్తిగా.. సంతోషంగా!

తన తపస్సుకు మెచ్చి పాణిగ్రహణం చేసిన శివయ్య చిటికెన వేలు పట్టుకొని సప్తపది వేస్తున్న పార్వతీదేవిలా.... ధవళ వస్త్రాలతో, మరింత మెరిసే శ్వేత చిరునగవులతో కలసి వెళుతున్న ఆ జంటను ఆశీర్వదిస్తున్నట్లుగా పున్నమి వెన్నెల జల్లులు కురిపిస్తున్నాడు గగనాన నిండు జాబిలి! అన్నీ తెలిసిన కృష్ణవేణమ్మ మరో కథను తనలోకి తీసుకొని సాగిపోయింది గంభీరంగా. ■



## జాలమేక కళ్ళ పిల్లా ...

- తగుళ్ళ గోపాల్
95050 56316



ఇది ఇష్టమో ,ప్రేమనో , ప్రాణమో
ఏం పేరు పెట్టాలో తెలుస్తలేదు
ఎండిన తుమ్మకాయలను
నీ కాళ్ళకు వెండిగజ్జెలుగ తొడిగిన కదా
ఆ పట్టాగొలుసుల గుర్తులే
ఇప్పుడు మిగిలిపోయినయి ...

తప్పిపోయిన మేకపిల్లను
తల్లిమేక పొదుగు దగ్గర
పాలు కుడపడం తెలిసిన దానివి
నన్నెందుకిట్లా
గుట్టల మధ్యన్నే వొదిలేసిపోయినవు?

ఊళ్ళో పరదా సినిమా వస్తే
తినకముందే పీర్లసావిట్లో తేలేదానివి
కాళ్ళు సోపుకొని ఎవరొచ్చిన తీయకుండా
నా కోసం జాగ ఉంచేదానివి
గుండెలో ఇంత జాగ ఉంచే వాళ్ళు
ఇప్పుడు లేరే లచ్చులూ...

ఆడివిల్ల అంజమ్మ కథలో
నేను వేషంగడితే
కాంటాకు పది రూపాయల నోటును గుచ్చి
అంగిజేబుకు పెట్టిపోయేదానివి
అప్పటి నీ ప్రేమను
ఇప్పటి ఏ నోట్లతో కొలువగలనే?

నువ్వేమో సదువుసాత్రం తెలిసినోడివి
నేనేమో బడిముఖం తెల్వని దానిని
మనిద్దరికి ముడి పడదని
మూగ జివాలను దగ్గరకు తీసుకొని
కంట నీరు పెడుతుంటే
ప్రాణమంతా తలతెగిన మేకపోతులాగ కొట్టుకునేది

ప్రేయసిని చంపిన వార్తను
పేపర్లో చదివి వినిపిస్తుంటే
ప్రేమించిన మనిషిని చంప
ప్రాణం ఎట్ల వస్తదో అని
రాలిన పూలను ఒడినిండా ఏరుకునేదానివి

గంజి నీళ్ళు గతిలేని పిల్లని
ఎవరూ ఉత్తగ మనువాడరని అన్నప్పుడు
నేను చదివే ఎకనామిక్స్ పాఠాల్ని
పండు వొలిచినట్లు వొలిచి చేతిలో పెట్టినట్లు ఉండేది
చిన్న ఈడున్నే నీకూ,
భార్యలేని ఇద్దరి పిల్లల తండ్రికి
రెండో సంబంధానికి అంటుదొక్కింద్రు

జాలమేక కళ్ళ పిల్లా....
నా నెత్తి మీద తల్వాలు పడుతుంటే
వాగులో నా ఒంటినిండవోసిన
ఆ ఇసుకధారే గుర్తొస్తుంది

నల్ల సర్పగుండు మీద
నువ్వు రాణోలో కూసుంటే
నీకు తువ్వాల నీడ పరిచేటోడిని
జీవితం ఎంతల తారుమారైందే లచ్చులూ
కంప్యూటర్ ముందల నేను
సద్దిమూటతో కూలికి నువ్వు!


# సాహితీ ప్రజ్ఞ

**నిర్వహణ : పిల్లా కుమార స్వామి**

1. ప్రసిద్ధి పొందిన ఇతివృత్తంతో, అష్టాదశ వర్ణనలతో, శృంగారంతో ఉన్న కావ్యాన్ని ఏమంటారు?
ఎ. ఖండకావ్యం బి. గాథ సి. మంజరి డి. ప్రబంధం
2. 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని' అన్న కవి ఎవరు?
ఎ. గురజాడ బి. సినారె సి. రాయప్రోలు సుబ్బారావు డి. బసవరాజు అప్పారావు
3 . 'కిన్నెరసాని' రచించిన కవి
ఎ. నండూరి బి. విశ్వనాథ సి. గురజాడ డి. రాయప్రోలు
4. 'శివభారతం' రచించిన కవి
ఎ. గడియారం వెంకటశేషశాస్త్రి బి. పుట్టపర్తి సత్యనారాయణాచార్యులు సి. శివశంకరశాస్త్రి డి. దేవులపల్లి కృష్ణశాస్త్రి
5. ట్రూత్ ఈజ్ బ్యూటీ అండ్ బ్యూటీ ఈజ్ ట్రూత్ అన్న ఆంగ్ల కవి
ఎ. షెల్లీ బి. కీట్స్ సి. స్టీవెన్‌సన్ డి. వర్డ్స్‌వర్త్
6. 'శృంగార రసమొకటే రసమని' చెప్పిన అలంకారికుడు
ఎ. భోజుడు బి. భవభూతి సి. శ్రీనాథుడు డి. భరతుడు
7. అలంకారాలన్నింటిలోకి ఏ అలంకారాన్ని మనోహరమైనదిగా అలంకారికులు భావించారు?
ఎ. ఉపమాలంకారం బి. వక్రోక్తి సి. రూపకాలంకారం డి. యమకము
8. 'కొంచెం నిజాయితీ, కొంచెం మానవతాదృష్టి, మరికొంత ఆధునిక విజ్ఞానం ఉండటమే అభ్యుదయ దృక్పథం' అన్నవారు
ఎ. శ్రీశ్రీ బి. కె.వి. రమణారెడ్డి సి. రారా డి. బాలగోపాల్
9. 'సాహిత్యం జీవిత వృక్షానికి పూచిన పువ్వు' అని పేర్కొన్న విమర్శకుడు
ఎ. కె.వి.ఆర్ బి. కొ.కు. సి. సింగమనేని డి. రాచపాళెం
10. 'పరమేశా గంగ విడువు పార్వతి చాలున్' అన్న కవి ఎవరు?
ఎ. పోతన బి. శ్రీనాథుడు సి. తెనాలి రామకృష్ణ డి. పెద్దన
11. 'మంచి గతమున కొంచెమేనోయ్' అన్నదెవరు?
ఎ. శ్రీశ్రీ బి. దాశరథి సి. గురజాడ డి. చలం
12. 'గతకాలమే మేలు వచ్చు కాలము కంటెన్' అన్నదెవరు?
ఎ. ఎర్రన బి. తిక్కన సి. తిమ్మన డి. నన్నయ
13. 'జాబిల్లీ నువ్వు సముద్రంమీద సంతకం చేసేటప్పుడు గాలి దాన్ని చెరిపెయ్యకుండా కాలమే పహారా కాస్తుంది' అన్న కవి?
ఎ. చెరబండరాజు బి. అలిశెట్టి ప్రభాకర్ సి. శివసాగర్ డి. శ్రీశ్రీ
14. 'గోడలు అసలే లేవు. గోడలను కూల్చడమే మా పని' అని గర్జించిన కవి
ఎ. జ్వాలాముఖి బి. చెరబండరాజు సి. శివారెడ్డి డి. శ్రీశ్రీ
15. కవి బ్రహ్మ తిక్కన వలె తన కావ్యాన్ని హరిహరనాథునికి అంకితమిచ్చిన కవి ఎవరు?
ఎ. నాచన సోమన బి. ముక్కు తిమ్మన సి. నంది తిమ్మన డి. ఎర్రన
16. 'మార్గకు మార్గము దేశీయ మార్గము అని తొలుత మార్గ, దేశీ పదాలు వాడిన కవి ఎవరు?
ఎ. నన్నయ్య బి. నన్నె చోడుడు సి. తిక్కన డి. జానపదులు
17. 'కలకంఠి కన్నీరొలికిన సిరియింట నుండ నొల్లదు అన్ని కవి ఎవరు?
ఎ. గురజాడ బి. శ్రీశ్రీ సి) బద్దెన డి. తిక్కన
18. శ్రీ వీరబ్రహ్మం 'కాళికాంబ హంస కాళికాంబ' మకుటంతో రాసిన రచన ఏది?
ఎ. శుకసప్తతి బి. సప్తపది సి. కాళీకాంబ సప్తశతి డి. సప్తశతి

జవాబులు : **1. డి 2. సి 3. బి 4. ఎ 5. బి 6. ఎ 7. బి 8. సి 9. బి**
**10. బి 11. సి 12. డి 13. డి 14. డి 15. ఎ 16. బి 17. సి 18. సి**





# వ్యక్తివాదపు తీవ్ర ధ్వని చండీదాస్ 'హిమజ్వాల'

- చెరుకూరి సత్యనారాయణ
98486 64587

'ప్రొఫెసర్ గారూ, మనిషికి ఆకలి వేసేది ఒక్క కడుపులోనే కాదు' ఎప్పుడో 47 సంవత్సరాల క్రితం 'ఆంధ్రజ్యోతి' వారపత్రికలో సీరియల్‌గా వచ్చి 1974లో పుస్తక రూపంలో వచ్చిన హిమజ్వాల నవలలో కథానాయిక గీతాదేవి పలికిన మాట ఇది. సి.సుబ్రహ్మణ్యేశ్వరరావు అనే శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సైకాలజీ ప్రొఫెసర్ 'వడ్డెర చండీదాస్' అనే కలం పేరుతో రాసిన తెలుగు నవలల్లో హిమజ్వాల మొదటిది కాగా 'అనుక్షణికం' రెండోది.

రాసిన ఒకే ఒక నవలతో విపరీతమైన ప్రాచుర్యంలోకి వచ్చిన రచయితలు అంతకు ముందు కూడా తెలుగులో ఉన్నారు. ఉన్నవ లక్ష్మీనారాయణ (మాలపల్లె), శ్రీదేవి (కాలాతీత వ్యక్తులు), బుచ్చిబాబు (చివరకు మిగిలేది) ఈ కోవలోకి వస్తారు. లెక్కకు తర్వాత కాలంలో మరో రెండు నవలలు రాసినా తొలి నవలతోనే తెలుగు నవలాలోకపు ఎవరెస్టు ఎక్కినవాడు చండీదాసు. ఆ నాటికి అది ఒక సంచలనం. కథాపరంగా చూస్తే ఏ మాత్రం ప్రగతిశీలత లేకపోయినా కథనం రీత్యా ఆనాటికి కొత్త పోకడలు పోయి తెలుగు నవలా పాఠకుల అభిరుచి స్థాయిని పెంచిన నవల హిమజ్వాల. ప్రతి విషయంలోనూ, ప్రతి రచనలోనూ సామాజిక ప్రయోజనం ఆశించలేం. జర్నలిజం విలువలు పెంచలేక పోయినా దినపత్రికని వంట గదుల్లోకి నడిపిన మేరకు ఈనాడు పత్రికని, రాసింది కేవలం కాలక్షేపపు చెత్తే అయినా తెలుగులో కాల్పనిక నవలా సాహిత్యానికి రీడబులిటీని పెంచి నవలలు అద్దెలకిచ్చే షాపులు వీధి వీధికి వెలిసిన కీర్తిని మూటగట్టుకుంది, యండమూరి, మల్లాది, మాదిరెడ్డి, యద్దనపూడి వంటి వారే.

60వ దశకం చివర నాటికి స్తబ్దతగా, నిస్తేజంగా, నిలువ నీరులా వున్న తెలుగు కవిత్వంలో దిగంబర కవుల ప్రవేశం ఒక సంచలనమే. అసమాన సమాజాన్ని ధిక్కరించే వారి స్వరాల్లో వ్యక్తమైన బూతు భాష మనకు అంగీకారం కాక పోయినా నిలువ నీటికి ప్రవాహవేగాన్ని కలిగించటంలో దాని ప్రభావాన్ని కాదనలేం. స్త్రీ, పురుష సంబంధాల్లో అసమానతలకీ, పురుషాహంకారానికి స్త్రీని భోగవస్తువుగా చూసే తత్వానికి మూలాలు కుటుంబంలోనే గాక భూస్వామ్య వ్యవస్థలోనే ఉన్నాయని మనం భావిస్తే కుటుంబ వ్యవస్థలోనే దాన్ని పరిష్కరించాలనుకున్న చలం భావనల్ని అంగీకరించక పోయినా చలం రేపిన సంచలనాన్ని అంగీకరించాలి. రంగస్థలంపై సురభి కళాకారుల సాంకేతికతను, నాటక కళ పట్ల ప్రజల అభిరుచిని కాపాడటంలో పద్య నాటకాల్ని పురాణ కథల్ని ప్రాతిపదికగా ఉన్న అనేక కళారూపాలని ఈ రకంగా పరిమిత ప్రయోజనాన్ని ఆశించి మాత్రమే చూడాలి తప్ప అన్నింటిలోనూ అభ్యుదయాన్ని ఆశించి రంధ్రాన్వేషణకి పూనుకోలేం. ఇలా పరిమిత ప్రయోజనం ఆశించినప్పుడు తెలుగు నవలారచనలో ఒక కొత్త ధోరణిని వచనంలో కవితా ధోరణికి మూడు చండీదాసు నవలలు అంకురార్పణ చేశాయి.

చండీదాసుది వ్యక్తివాదం. 'వ్యక్తి వినా సంఘం లేదు' అని చెప్పుకున్నాడు. సాంఘిక కట్టుబాట్లు అంటే ప్రజాబాహుళ్యా మోదం పొందిన విధానాలు అని అంగీకరిస్తూనే వావి వరుసల్లేని విశృంఖల శృంగారాన్ని తన నవలల్లో ప్రవేశ పెట్టాడు. మానవ మూల సమస్యలన్ని నిగూఢంగా ప్రజా బాహుళ్యానికి సంబంధించినవేనని, 'ప్రజా బాహుళ్యానికి సంబంధించినదే ప్రజా సాహిత్యం' అని తెలిసి కూడా ప్రజలకు సంబంధం లేని పాత్రలు పరిస్థితులతో నవల నింపాడు.

రక్తమాంసాల జీవిని సిద్ధాంతానికి పరిమితం చేయటం సాహిత్య హత్యగా చెప్పుకున్న ఈ 'బుద్ధిజీవి' తన నవలని 'తెలుగుతనపు కూపంలో ఇముడు లేకపోయినా' చివరకు మిగిలేది బుచ్చిబాబుకి అంకితం చేయటం వారిద్దరి 'మనోవిజ్ఞాన'పు సంబంధాన్ని తెలియచెప్తుంది.

దీనికి ముందుమాట రాసిన ఆనాటి ఆంధ్రజ్యోతి వార పత్రిక సంపాదకులు పురాణ సుబ్రహ్మణ్యశర్మ గారు... రాయట మనేది ఒక సాంఘిక బాధ్యత అంటూనే.. లోకంలో దు:ఖమే కాని సుఖమేమి లేనట్లే అని రాయటం కూడా దు:ఖమే కాని సుఖమేమి లేదు అంటూనే కొంత గందరగోళానికి గురై పాఠకుల్ని కూడా గందరగోళపరిచాడు.

ఇక 456 పేజీల ఈ నవలలో వర్ణనలు, సంభాషణల్లోంచి కథను ఏరుకుంటే కథానాయిక గీతాదేవి. ఆమె తల్లి ఒక జమిందార్ గారి కూతురు. ఒక సాదా సీదాని ప్రేమించి పెద్దలు అంగీకరించకపోవటంతో ఇంటినుంచి వెళ్ళిపోయి ఉత్తర దేశంలో అనేక చోట్ల తిరిగి గీత పుట్టిన తర్వాత చనిపోతుంది. గీతను మంచి వ్యక్తిత్వం అలవర్చుకునేలా పెంచి ఒక యాక్సిడెంటులో తండ్రి చనిపోతాడు. ఒంటరి అయిన గీత డిగ్రీ పూర్తి చేసి ఒక దొంగచే గాయపర్చబడి, కృష్ణచైతన్యచే రక్షింపబడి, అతడి ఇంటికి చేరుతుంది. ఇద్దరి అభిరుచులు, ఆసక్తులూ ఒకటే కావటంతో పరస్పరం చేరువై సహజీవనం చేస్తారు. గీత తీవ్రమైన కామదాహం గల స్త్రీ. కృష్ణచైతన్యతో అసంతృప్తి చెంది.. అదిగో ఇందాకటి డైలాగు రాసి అతణ్ని వదిలి వెళ్ళిపోతుంది.


అలా వెళ్ళిపోయిన గీత తన స్నేహితురాలు పద్మ దగ్గర ఆశ్రయం పొంది, ఆమె భర్త బలాత్కార ప్రయత్నం చేయగా తప్పించుకుంటుంది. పద్మకి విషయం చెప్పేలోగా గీత తనని లోబరుచుకోబోయిందని అతడు భార్యని నమ్మించాడు. ఆ ఇంటినుండి బయటపడి కృష్ణచైతన్య స్నేహితుడు శశాంక్ ద్వారా ఒక తాత్కాలిక ఉద్యోగం చేస్తూ శివరాం అనే వ్యక్తి పరిచయం కావడంతో వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుంటారు. కానీ, కొద్దికాలానికే ఇద్దరూ విడిపోతారు. ఆమెని కామపిశాచిగా నిందించి అరకులోయలో వదిలేసి వెళ్ళిపోగా ఒంటరిగా నడిచి వెళ్తున్న ఆమెని కృష్ణచైతన్య తండ్రి విజయ సారథి జీబులో ఎక్కించుకొని తన ఇంటికి తీసుకెళ్తాడు.

ఈ విజయ సారథి కృష్ణ చైతన్య తండ్రి అని అర్థమైనా పాత విషయాలేమీ చెప్పదు. ఆయనతో సంబంధం పెట్టుకుంటుంది. మరోవైపు ఊళ్ళు పట్టుకు తిరుగుతున్న కృష్ణచైతన్యకి ఊటీలో చిదంబర్రావు, ఆయన భార్య మాధురి పరిచయమవుతారు. తిరుగు ప్రయాణంలో విజయవాడ స్టేషన్‌లో శశాంక్ కనిపిస్తే అక్కడ దిగిపోయి తండ్రి మరణవార్త తెలుసుకొని వెళ్తాడు. గీత ద్వారా జరిగిన విషయమంతా తెలుసుకొని కూడా ఆమెని తన భార్యగా ఉండమని కోరతాడు. వావివరుసలు లేని ఆ చెత్త సంబంధాన్ని 'మహత్తర రాగ రంజిత రసానుబంధం'గా చెప్పుకుంటాడు. ఈలోగా శివరాం వచ్చి తిరిగి తనతో వచ్చేయమని ప్రాధేయపడి, కృష్ణచైతన్యతో సహా వచ్చేసినా తనకు అభ్యంతరం లేదని చెప్తాడు. ఆమె లొంగకపోయేసరికి పీక నులిమి హత్య చేస్తాడు.

నవలలోని భాష, వర్ణనల 'వెన్నెల తాగి మత్తుకి జోగుతున్న పచ్చని చెట్టు చుట్టూ స్నానం చేశాక తడి ఆరని ఒంటి చుట్టూ కప్పుకున్న తెల్లచీరలా కమ్ముకున్న మంచు ఆ చెట్ల వెనుక చలికి తట్టుకోలేక మొనల పైదాకా మంచు దుప్పటి లాక్కుని కప్పుకున్న పచ్చని కొండలు, దోమతెర కట్టినట్లు, లాలిత్యం పంచుకున్నట్లు పర్వత శిఖరాల మీంచి జారి వీపు మీద వాలిపోయిన ఆకాశం. అనాదిగా గుండెలో దాచుకున్న ప్రేమనంతటిని ఒక్క క్షణంలో అర్పించేసేటప్పుడు కలిగే అనుభూతి, ఒత్తిగిలిన లోయలు, నిరాశ తృష్ణతో తిరగబడినట్లు నడిచీ నడిచీ చివరలో పర్వతాలై పైకి లేచిన మైదానం, మైదానం గుండె చలమ చప్పుడికి లేచి నుంచుని నిశ్శబ్దంగా చలించే మంచు తెరలు' లాంటి వర్ణనలు కొల్లలుగా ఉన్నాయి. ఈ నవలలో ఫ్లారెన్స్ నైటింగేల్, సోఫియా లారెన్, తోరూదత్, పికాసో, డాలి, ఉల్ఫ్, రవివర్మ, జామినీరాయ్, మావో, నెహ్రూ, శ్రీశ్రీ, ఐన్‌స్టీన్, టెన్సింగ్, మిల్టన్, డావిన్సీ , సార్త్రే, ఫ్రాయిడ్, నీరో, ఫిరోజ్‌ఖాన్, నెపోలియన్ లాంటి అనేక మంది సందర్భానుసారం దూరిపోతారు.

బూడిద బుడ్డి (యాష్ ట్రే), అట్టముక్క (విజిటింగ్ కార్డు), తోలుసంచి (హాండ్‌బ్యాగు), గల్లా అర (క్యాష్ కౌంటర్), డోలుపుల్ల (డ్రం స్టిక్), పడక కాఫీ (బెడ్ కాఫీ) లాంటి తెలుగు పదాలు ఎబ్బెట్టుగా వుండి తర్వాత కాలంలో మరే రచయిత అనుసరించకుండా తిరస్కారానికి గురయ్యాయి. ఇవి ప్రయోగాల్లా కాకుండా భాషతో ఎకసక్కాలాడినట్లుగా ఉన్నాయి.

సిద్ధాంతం పట్ల కమిట్‌మెంటు కలిగిఉండటం, సామాజిక శ్రేయస్సే సాహిత్యానికి పరమావధి అనే విషయాల పట్ల విమర్శకు పూనుకున్న చరిత్ర మన సాహిత్య చరిత్రలో ఉంది. ఇందులో చండీదాస్ ఒకరు. ఈ రకమైన వాదనలు చేసి తదనుగుణమైన రచనలు చేసిన రచయితలు ఎంత ప్రతిభావంతులైనా వారి రచనలు ఎంత చక్కని రీడబులిటీ కలిగియున్నా వాటికి / వారికి శాశ్వతత్వం రాలేదని, రాదని గతం చెబుతుంది. దీనికి వద్దెర చండీదాస్ మినహాయింపు కాదు.



వ్యక్తివాదులుగా తమని తాము పేర్కొనే ఇలాంటి రచయితలు మెజారిటీ ప్రజలపట్ల నిబద్ధత కలిగిన వాళ్ళకి – అర్థం పర్థం లేని అస్తిత్వ వాదాల పట్ల మొగ్గు చూపే వాళ్ళకీ మధ్య అంతరాన్ని చూడలేరు. ఒకవేళ చూసినా చూడనట్లు నటిస్తారు. 'ఇజం' అనే పదమే ఒక బూతుగా భావించటమో లేక భావించినట్లు నటించటమో చేస్తూ దాన్నో ఫ్యాషన్‌గా మార్చుకుంటారు. వ్యక్తులకు 'రాజకీయాలుండకూడదు', 'సిద్ధాంతలుండకూడదు' లాంటి సమాజ వ్యతిరేక భావాల్ని కలిగిఉంటారు. ఇలాంటివారు మంచి సిద్ధాంతాన్ని – చెడు సిద్ధాంతాన్ని తులనాత్మకంగా చూడటానికి కూడా ఇష్టపడరు. తప్పుడు సిద్ధాంతాల్ని, చెడు సిద్ధాంతాల్ని ప్రవచించే వారితో సమానంగా చూసే ఈ 'సిద్ధాంత' వ్యతిరేకులు సమాజానికి నష్టం కలుగచేస్తారు.

సమాజం నమ్ముతున్న విలువల్ని ధిక్కరించటంలో గొప్పదనం ఉండదు. ఆ ధిక్కారం ప్రజలకు ఉపయుక్తమా? వ్యతిరేకమా? సమాజాన్ని మంచివైపు మళ్లించడానికి ఉపకరిస్తుందా? లేదా? అనే దానిపైనే ఆ ధిక్కార స్వరం యొక్క విలువని అంచనా వేస్తాం. అది సాహిత్యంలో అయినా, మరో సామాజిక అంశంలో అయినా సరే.

ఇజాన్ని వ్యతిరేకించటమే హీరోయిజం అనే తక్కువ స్థాయి ఆలోచనా ధోరణి, తెచ్చిపెట్టుకున్న భాష, భావం చుట్టూ క్షుద్ర సాహిత్యం విషం చిమ్ముకున్న రోజుల్లో ఆ తుపాను మధ్య పాఠకులు సేదతీరటానికి ఈ నవల ఒక శంకరాభరణం అయింది. తమ ప్రవచిత భావాలకు వ్యక్తివాదమని (చండీదాస్), అస్తిత్వవాదమని (బుచ్చిబాబు) చెప్పుకున్నా అవి ప్రజలకు పనికొచ్చేవి కావు. అసాధారణ రచనా సామర్థ్యం కలిగిన చండీదాస్ లాంటి వారు కొంచెం ప్రగతిశీలంగా ఆలోచిస్తే తెలుగు నవల మరింత సుసంపన్నమయ్యేది. ■




## ఎవర్ని నమ్మాలి

ఇప్పుడు మనుషులకు మనసనేదేలేదు.
అది నేడు స్వార్థానికి అమ్ముడు పోతోంది.
ఇప్పుడు మనిషి కేవలం
కత్తులు దింపుకోడానికి
పనికొచ్చే ప్రాణయంత్రం
గుండెలమీదికి శూలాల్ని విసరే విధ్వంసం
ఒకప్పుడు మనిషనే పదం ఎంతహాయిగా వుండేది!
తెల్ల గులాబీ నీడలో ఒదిగి హాయిగా నిద్రపోతూ!
ఇప్పుడు మనిషి దహనమవుతున్నాడు
వేట దాహంతో రగిలిపోతున్నాడు.
నిప్పుల్ని అదుముకొంటూ
మనసుల్ని కాల్చుకొంటూ తడబడుతూ.
చీకటి దారుల్లోకి నెర్రెలు బారుతూ!
మనిషన్నవాడు
మనిషిగా మనుగడ సాగించకపోతే ఎట్లా!
కళ్ళల్లో చేపపిల్లలు అభిమానంగా ఈదకపోతే ఎలా?
ఒళ్ళంతా నిండి మాట్లాడకపోతే ఎలా?
ఎవర్ని నమ్మాలిప్పుడు!
మాట్లాడే ప్రతి మనిషీ గొప్పవాడు కాకపోవచ్చు.
మనసున్న ప్రతివాడు  గొప్పవాడే.
మనిషి చిరునవ్వేప్పుడూ
విలువైన బహుమానమే!
ఒక్క క్షణమైనా మనిషికోసం నుంచోవాలి.
మనిషికోసం అభ్యర్థించాలి.
వసంతవనంలో మనిషిని నిలబెట్టాలి!

**- ఏటూరి నాగేంద్రరావు**

**74166 65323**






# అంత్యక్రియలు విజయవంతమవుగాక!

- చంద్రలత

**అ**రవైయేళ్ళ నాటి సంగతి. దాదాపు మూడు వందల మంది తెలుగు సాహితీవేత్తలకు ఆ రోజు తపాలాలో ఒక ఆహ్వానం అందింది. "మహాశయా, నా కావ్యానికి అంత్యక్రియలు. పండగ చేసుకొందాం రండి' అని. అదీ చదువులమ్మ పుట్టిల్లయిన వాల్తేరు ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి.

'కావ్యమేమిటి? దహనమేమిటి? ఈ విద్యార్థుల కొంటెపనులకు అంతూ అదుపు లేదా?' అని అనుకొన్నవారు నవ్వేసి ఊరుకోవచ్చు. 'పిల్లచేష్టలు' అని కొట్టిపారేయవచ్చు. కానీ, శ్రీశ్రీ మాత్రం అంతే కొంటెగా, 'విష్ ద క్రిమేషన్ సక్సెస్!' అని వెంటనే తంతి పంపారు. ఆ కాలాన టెలిగ్రాం రావడం అంటే చావుకబురు అందడమే. అదీ శ్రీశ్రీ సమయస్ఫూర్తి. చమత్కారం.

ఇక రావిశాస్త్రి గారి వంటి సాహితీవేత్తలు వెయ్యిమంది ప్రేక్షకుల ముందు ఆ విద్యార్థులు పుస్తకానికి సభా సాంప్రదాయబద్ధంగా దహన సంస్కారాలు చేశారు. ఎవరి పుస్తకాన్ని తగలబెడితే ఎవరూరుకుంటారు? రాజ్యాంగం సమ్మతించదు కూడాను. అయితే, ఆ కృతికర్తే స్వయాన తన కావ్యాన్ని తానే తగలబెట్టేస్తున్నాడు. ఆ వింతేమిటో చూద్దామనేగా అంతమంది ఆ బహిరంగ రంగస్థలం వద్ద గుమిగూడింది. అది కావ్యదహనోత్సవం. పదండి.. మనమూ ఆ చోద్యం చూసివద్దాం.

విశ్వవిద్యాలయాల్లో పుస్తకాలను తగలబెట్టడం కొత్తేమీ కాదు. మే 10, 1933లో నాజీ ప్రేరిత జర్మన్ విశ్వవిద్యాలయాల్లో ఐన్‌స్టీన్, ఫ్రాయిడ్, మార్క్స్, హెమింగ్వే, హెలెన్ కెల్లర్, హెచ్.జి.వెల్స్, కాఫ్కా.. ఎవరి పుస్తకాలూ మంటలను తప్పించుకోలేదు. ఆయా పుస్తకాల సారమెల్ల గ్రహించవలసిన విద్యార్థులు, ఆ పుస్తకాల చితిమంటల చుట్టూ కేరింతలు కొడుతూ నాట్యాలు చేశారు. నాజీ జర్మనీలో ఆనాడు విద్యార్థిలోకాన వేళ్ళూనుకొంటున్న ఉన్మాద నాజీ భావనకు అది ఒక పరాకాష్ట. ఆ అవాంఛనీయ దురాగతం 'నాజీ బుక్ బర్నింగ్'. సమీప చరిత్రలో ఓ విషాద జ్ఞాపకం.

వాస్తవంలోనైనా, కల్పనలోనైనా, పుస్తకాలు తగలబెట్టడం నిర్బంధ, నిరంకుశ, అమానవీయ చర్యలుగా పరిగణించబడుతున్నాయి. సాధారణంగా, ఈ తగలబెట్టడాలన్నీ రాజకీయ, సాంస్కృతిక ఈర్ష్యాద్వేషాల్లో, స్వార్థసంకుచితాల్లో, అహంకార అహంభావాల్లో వేళ్ళూనుకొని ఉంటాయి. యుద్ధాలు, రాజకీయాలు, మత విద్వేషాలు, తాత్విక విభేదాలు, ఆధిపత్య నిరంకుశాలు.. కారణాలు ఏవైనా, పుస్తకం తగలబెట్టడం మానవ మనుగడకు హానికరం.

కానీ, విశ్వవిద్యాలయ ఆవరణలో పుస్తకం తగలబెట్టడానికి తలపెట్టిన విద్యార్థులను మందలించి, అల్లరిచిల్లరలు కట్టిపెట్టించి, మంచిసెబర నేర్పాల్సిన మహోపాధ్యాయులు ఆ కావ్యాన్ని అంకితం అందుకొన్న కృతిభర్త వేదికెక్కి వంత పాడుతున్నారేంటి? అసలిది చేయదగిన పనేనా? చేయవలసిన పనా? అయితే, ఎవరి రచనలను వారే తగల బెట్టుకోవడం కూడా సాహిత్య చరిత్రలో కొత్తేమీ కాదు. డికెన్స్, గొగోల్, కాఫ్కా, సాకీ తదితర రచయితలు వివిధ సంధర్భాలలో తమ రచనలను తమ తదనంతరం భస్మం చేశారు. చేయించారు. ఈ 'కావ్య దహనోత్సవం' అలాంటిది కాదు. ఈ కృతికర్త పూర్తి స్పృహతో తనే తగలబెట్టాలని నిర్ణయించుకున్నాడు.

ఈ పుస్తకం శీర్షిక సూచిస్తున్నట్లుగా.. ఇది కావ్యానికి, కవిత్వానికి, కవి లోకానికి, కవుల తీరుతెన్నులపై, కవిత్వ విమర్శపై ఎక్కుపెట్టిన వ్యంగ్యాస్త్రమే అయినా, ఇందులో లేవనెత్తిన అంశాలు కవిత్వానికే పరిమితం కావు. ఏ రచనకైనా ఏ కళాసృజనకైనా వర్తిస్తాయి.

'ఇన్నోసెంట్లీ బ్రిల్లియంట్!' అన్న ఒక్కమాటే తడుతుంది

పుస్తకం చదవడం పూర్తి చేసేటప్పటికి. చురుకైన వ్యంగ్య సంభాషణల్లో చక్కగా మేళవించిన సునిశిత హాస్యం వలన చదువుతున్నంత సేపూ తెలియకుండానే ఒక నవ్వు కదలాడుతుంది. ఆరు దశాబ్దాల క్రితమే ఎంత అమాయకంగా తమ మేథో ప్రతిభను, వాదనా పటిమను ప్రకటించుకున్నారు కదా! దానాదీనా, కావ్య దహనోత్సవం ఒక చారిత్రక సందర్భం. ఇటు సాహిత్యంలో అటు సాహితీ విమర్శలో నిర్ద్వంద్వంగా.

ఈ ప్రతీకాత్మక వ్యంగ్య రూపకాన్ని మొదటిసారి 1957లో ఏలూరులోనూ, ఆపై 1960 డిసెంబరులో ప్రదర్శించారు. "అచ్చుయంత్రాలు లేని రోజుల్లో గ్రంథంలో గుణం లేకపోతే లేఖకులు తిరిగి రాసుకునేవారుకారు". అసలు ఈ కావ్య దహనోత్సవ మూలం ఏమిటో అధ్యక్షుడి ప్రారంభోపన్యాసంలో పరిచయం చేస్తారు. "అచ్చుయంత్రం వేలు, లక్షల పుస్తకాలను ప్రజల మీదకు పడేస్తున్నది. ఈ యాంత్రిక యుగంలో ఎప్పటికైనా గ్రంథ దహనోద్యమం ప్రారంభం కాక తప్పదు". అంటే, ఈ కావ్య దహనోత్సవం పొల్లుగింజల్ని చెరిగివేసి, ఆ తప్పలనీ తాలుల్నీ తగలేసి, గట్టి ధాన్యాన్ని కుప్పవేసుకొనే ప్రక్రియ అన్నమాట.

'అగ్నిశంఖం' కృతికర్త పి.బి.షెల్లీ 'ఎడొనాయిస్'ను చూస్తూ రాసిన 'విలపామి' అన్న ఖండకావ్యంతో 'ఛందో కవిత్వంలో సాహిత్యోద్యమంలో' అచ్చం షెల్లీ మహాకవిలా అవతరించాడు. వెంటనే కవుల యూనిఫార్మ్, ట్రేడ్ మార్కులైన, గ్లాస్కో పంచలు లేదా పెద్ద జరీ పంచలు, శాండో బనీను, తెల్లటి మల్లెపూవులాంటి లాల్చీలు, నగిషీ చెక్కిన చెప్పులు అతని వంటిమీదికి వచ్చి చేరాయి. 'సర్వ యువకవి బంధువు', 'పీఠాధిపతి' చేత పొగిడించుకొన్నాడు. ఇక, 'అగ్ని శంఖం' కావ్యం అచ్చుకయ్యే ఖర్చునిచ్చిన గోపాలరెడ్డికి ఆ కావ్యాన్ని అంకితం ఇచ్చాడు.

రచనల మీద మమత్వంతో కృతికర్త గుడ్డివాడయినప్పుడే, అతని పినతల్లి కూతురు చిన్నపిల్ల అయితేనేం గంటసేపు వాదించేసి, కృతికర్త మెడలో గంట కట్టేసింది. అంతకు మునుపే, ఒక సాహితీ సభాధ్యక్షుడైన హెడ్మాష్టారు చీకట్లోకి బాణం వేసినట్లుగా అతని మీదకు ఓ వాడిప్రశ్న విసిరేశారు. 'వాడిన మాటలకు అర్థాలు తెలుసునా?' అని నిగ్గదీశాడు.

అప్పుడు కదా కృతికర్తకి, 'కవిత్వానికి కూడా ఆలోచించాలని తోచింది. మాటలకు అర్థాలు తెలియాలనిపించింది.' ఈ పీడకల లాంటి తన అనుభవానికి మూలమేమిటో కూడా అతను గ్రహించినట్టే ఉన్నాడు. వందల ఏళ్ళు మనం దాస్యంలో ఉండడం వల్లనయితేనేమి, మన స్వబుద్ధితో ఆలోచించే అలవాటు ఎప్పుడో వదిలేయడం వల్లనయితేనేమి, మనం కృతకమైన బ్రతుకులు బ్రతకడానికి అలవాటుపడ్డాం. వెనకటి తరం వాళ్ళని నిందించి ప్రయోజనం లేదు. ఇక ముందయినా, నాటకాల్లో పాత్రల్లా బ్రతికే ఈ పద్ధతికి స్వస్తి చెప్పాలి."

పై నుంచి కళతికర్త అంటున్నాడు కదా, "ఇది ప్రజాస్వామ్యం. ఎవరికి వాడే సర్వజ్ఞుడు". ఇక సాహిత్యానికి, సాహిత్యకారుడికి పనేం ఉంది? అసలే కవి. కవిత్వం వదిలేస్తే, ఆపై మరేం చేస్తాడు? అన్న సందేహానికీ, అడక్కముందే అతనే జవాబిచ్చాడు. "సాహిత్యంతో సంబంధం పెట్టుకోను అంటే ఇక సినిమాలకి మాటలు పాటలు రాస్తాననుకోనని కాదు. ఆ పని చెయ్యను!" అని హామీ కూడా ఇచ్చాడు.

అదుగోండి అక్కడే, ముందు వరుసలో కూర్చున్న రావిశాస్త్రి గారికి కోపం వచ్చింది. ఆ ఒక్క వాక్యం శ్రీశ్రీని ఉద్దేశించినట్లుగా ఉందని. కుర్రాళ్ళ వేళాకోళాలకి హద్దుపద్దూ లేదా? ఎంత మాటంటే అంతమాట అనేయడమే! హన్నన్నా! అసలే కుర్రకారు. ఆపై అభ్యుదయవాదులు. ఎవరిని మాత్రం వదులుతారు? అదీ, వ్యంగ్యానికి ఉన్న బలం! ఈ రూపకంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గన్న ప్రతి ఒక్కరూ, ఆ దరిమిలా తెలుగు సాహిత్యం అభ్యుదయ పథాన సాగడంలో ముఖ్య పాత్ర వహించిన వారే.

ఇంతలో ప్రేక్షకుల్లో ఉన్న పాఠకుడు వేదిక మీదకు ఒక నోట్ పంపాడు. "రాసుకొన్న కవి అయితే మాత్రం అచ్చువేసి జనాల మీదకి వదిలిన తరువాత, తనకి తగలబెట్టే హక్కు ఉందా? కావ్యాలలో మంచీ చెడ్డలని నిర్ణయించే హక్కు మహా జనానిదే కానీ మరెవ్వరికీ లేదు! కావ్యం అచ్చువేసిన తరువాత ఆ కావ్యం అకావ్యం అనే హక్కు అతనికి లేదు".

ఇక తిలాంజలి పలికిన ఆఖరి ప్రధాన (నిర్)వాహకుడు, సభను ముక్తాయించారు. "ఈ రామారావు లాంటివారే ఈనాడు సాహిత్య రంగంలో అవ్యవస్థకు మూల కారణమనీ.. కవి గారి కావ్యాల మీద ఆ కవిగారికే లేని అభిమానం, ఈయన కెందుకు?" అంటూ.

ఇది వీర పాఠకులు అందరిపైనా వేసిన చురక. చదివినా చదవకపోయినా, ఆ కావ్యం విలువెంతో, ప్రయోజనమేమిటో, భావమేమిటో తెలియకపోయినా, ఉత్తుత్తి కావ్యాన్ని తమ నెత్తిన పెట్టుకు ఊరేగే వీరాభిమానులు అన్ని కాలాల్లో ఉంటారు కదా. భజనబఅందం లాగా. వారిని ఛెళ్ళున చరిచిన చరుపు. సరిగ్గా ఇక్కడే, ఈ ప్రహసనంలో టి.ఎస్.ఎలియట్ ప్రస్తావన సముచితం అనిపిస్తుంది. రోలండ్ బార్తా పాఠక ప్రధానవాదనకు ప్రతివాదనగా వారు చేసిన 'ఇంటెన్షనల్ పాలసీ' గుర్తొస్తుంది. పాఠక దృష్టి ఎంత సులువుగా ప్రభావితం కావచ్చో కదా, మరి సాహిత్యం విలువలను నిర్ధారించడానికి కేవలం పాఠకదృష్టే ప్రామాణికం అవుతుందా? అదీ ప్రశ్న.

అందుకే, నన్నయ్య నుంచి ఎలియట్ దాకా వేలూరి గారు ఈ ప్రహసనంలో చేసిన ప్రస్తావనలు, ఉల్లేఖనాలు ఎంతగానో

ఆశ్చర్యపరిచాయి. ఎప్పుడో ఆరు దశాబ్దాల క్రితం, ఏలూరులోనూ, విశాఖ తీరాన, ఇంకా పట్టభద్రులు కాని కుర్రాళ్ళలో ఇంతటి విమర్శా దార్శనికతా అని. ప్రపంచ సాహితీ విమర్శలో ఈ సిద్ధాంతాలు రాకమునుపే, ఈ ఆలోచనలన్నీ ఎంత సహజంగా చేశారో కదా అని. వారు అబ్బూరి రామకృష్ణారావు, బమ్మకంటి శ్రీనివాసాచార్య, వేల్చూరి నారాయణ రావు గార్ల స్ఫూర్తితో, ఈ ప్రహసనానికి జీవం పోసినవారు మేడిపల్లి, వేలూరి, బంగోరే, చేరా, సత్యమూర్తి తదితరులు.

ఈ రచనను చదవగానే మొదట గుర్తొచ్చింది. రోలండ్ బార్తా ది డెత్ ఆఫ్ ది ఆథర్. ఎందుకంటే ఈ ప్రహసనంలో ఎంతో యథాలాపంగా ప్రస్తావించిన 'విలపామి', షెల్లీ 'ఎడొనాయిస్' కి మచ్చుకు మచ్చు అనువాదం అయిన ఆ విషాదగీతి ఇలా మొదలవుతుంది. "నేను ఎడొనాయిస్ కోసం విలపిస్తున్నాను / అతను మరణించాడు". కవి మరణించాడు. కవి మరణానికి కారణమెవ్వరు? కీట్స్ మరణ వార్త వినగానే షెల్లీ విషాద స్పందన ఆ కవిత. సున్నిత మనస్కుడైన కవిని ఘాటైన విమర్శకులు ఎలా నిర్దాక్షిణ్యంగా మాటలతో తగలబెట్టగలరో ఎలుగెత్తి లోకానికి చెప్పినవాడు షెల్లీనే కదా. విమర్శకులు కీట్స్‌ను చితిమంటల్లోకి పడేస్తే, పాఠకులు అతనిని పాలపుంతల్లో పొదిగి, పూల పల్లకీల్లో ఊరేగించారు.

తన కావ్యానికి దహన సంస్కారాలు చేస్తూనే, కృతికర్త ఇకపై సాహిత్యంతో సంబంధం పెట్టుకోనని, కవిగా తన మరణాన్ని ప్రకటించాడు. అయితే, అందుకు భిన్నంగా ఈ ప్రహసనం రచననూ, రచయితనూ కలకాలం జీవించమని చెబుతుంది. ఆరోగ్యకరంగా.. పటిష్ఠంగా. "నిష్కపటంగా, సత్యనిష్ఠతో, సాహితీ ప్రీతితో" ప్రవర్ధమానమవమని నిర్దేశిస్తుంది. కావ్య రచనకు కావలసింది పైపైన తెచ్చిపెట్టుకునే కృత్రిమాలు కావనీ, "కవుల యూనిఫాంలు, ట్రేడ్‌మార్క్‌లు, ఛందో కవిత్వం, కృతిభర్తలు, సాహిత్య పీఠాలు, వాటి పీఠాధిపతులు, ఇవేమీ అవసరం లేదని చెబుతుంది. ఇంత లోతుపాతులున్న రచన కాబట్టే కదా, ఈ 'కావ్యదహనోత్సవం' ఒట్టి వేళాకోళం అని కొట్టి పారేయలేకపోవడం. మళ్ళీ మళ్ళీ తరిచి చూడడం.

ఈ సభను అప్పటికి వందేళ్ళ జనగణమనతో ముగించినా, శ్రీశ్రీ "చేదుపాట"తో మొదలుపెట్టారు. ఈ ప్రహసనంలోని కథన ప్రయత్నాలు ఆహ్వానం, కార్యసరణి నుంచీ అన్నీ కొత్తగా ఉన్నాయి. కల్పనకు వాస్తవానికి మధ్యన హద్దులు చెరిగిపోయాయి. పాత్రలన్నీ ఆయా నటుల అసలు పేర్లతోనే ఉన్నాయి. ఈ కథన చమత్కారం వలన, వేదిక మీద జరుగుతున్నది ఉత్తుత్తి ప్రహసనం కాదు, నిజంగా జరుగుతుంది అని అనిపిస్తుంది. సంభాషణలన్నీ ఎవరికి వారు అప్పటికప్పుడు సహజంగా మాట్లాడుతున్నట్టుగా ఉన్నది. ఎవరో రాసిన స్క్రిప్టుకు అనుగుణంగా వేదిక మీద సాగుతున్న నటన అని తోచదు. ఈ కథన ప్రయోగం అర్థం అవుతున్న కొద్దీ, ఈ రచన ప్రాధాన్యత తెలుస్తుంది. ఉదాహరణకు, చేకూరి రామారావు గారి పాఠకుడి పాత్ర. ఒక సాహిత్యాభిమాని పాత్ర. రామారావు అన్న పేరుతోనే, ప్రేక్షకుల మధ్య నుంచి ఒక చీటీ పంపడం వంటివి యథాలాపంగా, గంభీరంగా జరుగుతుండడం, అదొక కల్పన అనీ, వేళాకోళం చేస్తున్నారనీ, వ్యంగ్యాలు పడుతున్నారనీ అనిపించడం కన్నా, ఒక యథార్థ సభాసంధర్భం లాగానే ఉన్నది.

ఈ కథన విధానం గమనిస్తుంటే, ప్రపంచ యుద్ధాల అనంతరం సినిమాల్లోనూ, ఇతర ప్రదర్శన కళల్లోనూ ఉప్పెనలా వచ్చిన ఇటాలియన్ నియోరియలిజం గుర్తుకువచ్చింది. అందులోనూ, వేలూరి గారు ప్రహసనం మూలప్రతిని తయారు చేసి, ఎవరి సంభాషణను వారు అవగాహన చేసుకొని, ఆయా నటులు వారి భావాలకు, భాషకు తగ్గట్టుగా, ఆ సంభాషణలో మార్పులు చేర్పులు చేసుకొనేట్టు ప్రోత్సహించారు. ఇదెంత ప్రజాస్వామిక పద్ధతి! ప్రజా నాటకానికి ఇలాంటి స్వేచ్ఛ మూలం కాదా!

ఇక, ఎవరి వేషభాషలు వారివే. దానితో, అక్కడ జరుగుతున్నది వాస్తవమేనన్న భావన ప్రేక్షకులకు కలగడంలో ఆశ్చర్యం ఏముంటుంది? ఆ విధంగా బహుశా తెలుగులో నయా వాస్తవిక నాటకాలకు ఈ ప్రహసనం తెరతీసింది.

"రచయిత మరణించాడు" అంటూ ఎలుగెత్తిన రోలండ్ బార్తా చేసిందల్లా, అప్పటిదాకా సాహితీ ఉత్పత్తికి ఒక వినియోగదారుడుగా భావించే పాఠకుడిని, 'నీవు సాహితీ ఉత్పత్తి దారుడివి' అని విప్పిచెప్పడమే. సాహిత్యంలో పాఠక భాగస్వామ్యం ఎంత ముఖ్యమో ఈ పాఠక ప్రధాన సిద్ధాంతం ప్రకటిస్తుంది. ఈ ప్రహసనంలోని పాఠక ప్రతినిధి రామారావు పాత్ర పోషించినదీ సరిగ్గా అలాంటి పాత్రే. పైనుంచి, రచన రచయిత స్వంతమా? అది పాఠకుల స్వంతమా? అన్న కీలక ప్రశ్నను లేవనెత్తారు. దానికి ఖలీల్ జీబ్రాన్ వద్ద సమాధానం దొరుకుతుంది. లక్ష్యాన్ని ఛేదించడానికి సారించిన బాణం ఎంత వాడిదైనా, ఎక్కుపెట్టే విల్లు బలిష్ఠమైనది స్థిరమైనది కావాలి కదా! పిండికొద్దీ రొట్టెలాగా, రచయిత సామర్థ్యాన్ని బట్టేగా రచన. అలాగే, పాఠకుని బట్టీ!

ఈ ప్రహసనం రచన, రచయిత, పాఠకుడు, విమర్శకుడు, వీరందరి నడుమ ఎప్పటికప్పుడు తాజా పరుచుకోవాల్సిన సమీకరణాన్ని గుర్తించేటట్టు, గ్రహించేటట్టు చేస్తుంది. ఆ రూపేణా, అన్ని తగలబెట్టడాలు ఒకటి కావు. మొత్తానికి, అక్కడ పుస్తకం తగలబెట్టడం తథ్యం. నిజమే. ఎన్నెన్ని అసంగత పదాలనీ, అసందర్భ వాక్యాలనీ, అవాంఛిత కావ్యాలనీ

తగలబెట్టాల్సి ఉందో కదా! తెలుగు చేలల్లో మంచి సాహిత్యపంట పండించడానికి!

ఇంతాజేసి, ఇది ఎంత పుస్తకమనీ? వ్రాతప్రతితో పాటు అచ్చువేసినా, ఎనభై పుటలన్నా లేవు. నలుసంత మర్రివిత్తులో వటవృక్షం దాగి ఉన్నట్టుగా. నిస్సందేహంగా సాహిత్యంతోనూ, కళలతోనూ ముడిపడిన వారందరూ ఒక పాఠ్య పుస్తకంలా చదవ వలసిన ప్రహసనం ఈ 'కావ్య దహనోత్సవం'. ఎన్నెన్ని విషయాలు నేర్చుకోవాల్సి ఉందో! ఎన్నెన్ని విషయాలు మార్చుకోవాల్సి ఉ ందో! రచయిత వేలూరి వెంకటేశ్వరరావు గారికి వినమ్ర వందనాలు. దాదాపు అరవై ఏళ్ళ తరువాత అయినా, ఆనాటి రాతప్రతితో సహా ఈ పుస్తకం అచ్చువేయడం ఎంతో బావుంది. తెలుగు సాహిత్యంలోని ఒక చారిత్రక ఘట్టాన్ని కళ్ళముందు కలకాలం నిలిపినందుకు ముద్రాపకులు గొర్తిసాయి బ్రహ్మానందం గారికి ధన్యవాదాలు. ■



## జేగంట

**క**డుపు మంటతో లాభం లేదు
కాచుకునే చలిమంట కాదు
మింటిన మెరిసే నక్షత్రం అది
సమాజాన్ని మేల్కొలిపే జేగంట అది
చూపుడు వేలు దిక్సూచిగా
ప్రతి ఇంటికి వెలుగై నిలిచేది
కాంతిని చిమ్ముతూ దారి చూపేది
అంబేద్కర నామధేయం
అభ్యుదయానికి పర్యాయ పదం
ప్రవచించిన సమన్యాయం
జాతి ప్రగతికి సరియైన పథం!

**- డా. డి.వి.జి.శంకర రావు,** మాజీ ఎంపీ,

**94408 36931**



## గర్వభంగం

**నే**ను రానంటాను నువ్వు వస్తానంటావు
వచ్చేటప్పుడు ఏదో తెస్తావు
తెచ్చేదెదో చూపించమని మారాం చేస్తాను
నువ్వు చూపించవు
అది విప్పి చూపించాలని నేనంటాను
ససేమిరా అని నువ్వంటావు
ఇద్దరి మధ్య నిశ్శబ్దం ఏదో తెలియని అగాధం
ఏం చేస్తోవో చూస్తానంటాను
నువ్వేం చెయ్యలేవని నువ్వంటావు
ఏదో తెలుసుకోవాలనే పరిశోధక విద్యార్థిలాగా
అన్నీ కెలికేసి, చెల్లాచెదారంగా పడవేసి వెతికేస్తాను

నీ అంతు చూస్తానని హెచ్చరిస్తాను
నవ్వి ఊరుకుంటావు
పంతం పెరిగింది
సాధించాలనుకున్నది రాత్రి, పగలు కష్టించి
ఎట్టకేలకు సాధించాను
అఖండ కీర్తితో విశ్వాన్నంతా జయించినంత
ఎత్తుకి ఎదిగి ప్రపంచ ప్రఖ్యాతుడినయ్యాను
డాక్టరేట్ మంత్రదండంతో వెకిలిగా నవ్వుతూ
గర్వంతో దాని మొహంలో మొహంపెట్టి చూసాను
దానికి చిర్రెత్తుకొచ్చింది
ఎంత గొప్పవాడివైతే మాత్రం
నాముందు తలవంచాల్సిందేనని హెచ్చరిస్తూ
తన కోరలన్నీ చాచి విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నట్టు
కరతాళ నృత్యం చేస్తూ...
నన్ను అక్కున చేర్చుకునేందుకొచ్చిన మృత్యువు!

**- చలపాక ప్రకాశ్**

కథ



# కదిలిపోతున్న నేల

- పి.శ్రీనివాస్ గౌడ్
99494 29449

సెల్ మోగుతా వుంది. ఎత్తలా. మళ్లా మోగుతాంది. చూస్తే శ్రీకర్. ఏందబ్బా ఇంత అర్జంటు పొద్దున్నే.. రమ్మనా...

మళ్లా మోగుతా వుంది. ఎత్తా.

"బావా.. గ్రౌండుకి తొందరగా రా. పిచ్ మీద మనోళ్లని ఆడనియ్యకుండా ఆళ్లు ఆడతన్నారు. అదేమంటే పఠాన్ గాడి మీద మీదకి వత్తన్నారు. నువ్వు తొందర్రా బావా.."

'ఎవర్రా ఆళ్ళు' అనేలోపే పెట్టేసాడు.

'ఇదేందబ్బా ఎప్పుల్నేంది? గ్రవుండులో మనకి తెలీనోళ్లు ఎవరబ్బా.. అంత ఇదిగా మనల్ని ఎదిరికిచ్చి ఆడేవోళ్లు ఎవురయి వుంటారు?'

అయోమయంగా క్రికెట్ కిట్టు తీసుకొని ఆవుంతున బండి మీన అదరాబదరా గ్రవుండకి వెళ్లా. వాతావరణంలో ఏదో తేడా కొట్టింది. మావోళ్లంతా కిట్లు ముందేసుకొని, తలకాయలు ఏలాడేసుకొని అశోక చెట్టు కింద గమ్మున కూచోనుండారు.

నల్లబడిన మొకంతో శ్రీకరు.. ఎర్రబడిన మొకంతో పఠాను ఎదురొచ్చారు.

"ఏందంటరా బావా.. ఎవరాళ్లు?" అడిగా.

"తెలిసినోళ్లే సార్. దండుబాట కాడ కుర్రోళ్లు. మీగ్గూడా తెలుసు.." పఠాన్ అన్నాడు.

'నాకు తెలుసా.. ఎవరాళ్లు? దండుబాట కాడ కుర్రోళ్లా.. ఎవరబ్బా.. చూస్తే గుర్తుపడతానేమో..'

"పద బావా.. అసలెవరో చూద్దాం. మన గ్రవుండులో మనల్ని కూడా ఆడనీకుండా ... ఎవర్రాళ్లు? పా.."

కిట్ల కాడ ఇద్దర్నుంచి, కొదమా మా బ్యాచంతా మాతో కలిసి గ్రవుండులోకి వచ్చారు.అప్పుడే వచ్చిన బిట్టూ (శ్రీనాథ్ గాడి ముద్దుపేరు) కూడా కలిసాడు.

పిచ్ మీన మూడు పుల్లలు పాతి, రబ్బరు బాలు, బ్యాటుతో వచ్చీరాని ఆట ఆడతన్నారు నలుగురు కుర్రాళ్లు.

'పిచ్ మీన బ్యాటింగ్ చేస్తన్న అబ్బాయిని చూస్తంటే యాడో చూసినట్టే అవుపిస్తా వుంది. ఆ అబ్బాయి మాత్రం నన్ను చూడనట్టే .. 'ఎయ్యారా బాలు.. ఎయ్యహే..' అని బాల్ని మాకేసి కొట్టడానికి చూత్తన్నాడు. నేను సరిగ్గా స్క్వేర్ పాయింట్ కాడ నుంచున్నా.. ఆడకి కావాలని బాలు కొట్టాలంటే మొనగాడు బ్యాట్స్‌మన్ అయి వుండాలి. చానాసార్లు కొడదామని చూసాడు గానీ వల్లగాలా. కాసేపు అట్ట చూసి.. మెల్లంగా ఆ కుర్రాడి కాడకి పోయా.

"నానా.. కాస్త అవతలకు పొయ్యి ఆడుకోండి నానా. మాకు రేపు క్రికెట్ మ్యాచు వుంది. ప్రాక్టీసు చేసుకోవాల.." అన్నా.

ఆ కుర్రాడు తల గూడా తిప్పకుండా.. 'ఆ... అవతలకు పొయ్యి మీరే ఆడుకోండి..' అన్నాడు తుస్కారంగా. నాకు చర్రమంది. అయినా తమాయించుకొని.. "హలో బాబూ మేం ఈడ రోజూ ప్రాక్టీసు చేస్తా వుంటాం. నువ్వీరోజు వచ్చి ఈడే ఆడతానంటే ఎట్టా? లేసి అవతల ఆడుకోండి. చానా గ్రవుండుంది" అన్నా కాస్త గట్టిగా.

ఆ కుర్రాడు ఆడటం ఆపి.. 'హలో ఏంది హలో.. మేం ఈడ నుంచి లేవం.. ఏందంటా.. నీ బాబుగాడి గ్రవుండా ఏంది? మీరే అటు పొయ్యి ఆడుకోండి. లేకపోతే పోండి....' అన్నాడు విసురుగా.

ఒక్క నిమిషం ఆ గీర మాటలకి అవాక్కయ్యా.

"రేయ్..తిరపతిగా.. ఏందా మాటలు సార్‌తో. తిన్నగా మాట్టాడలేవారా.." అన్నాడు పఠాన్ గాడు కోపంగా.

"ఏంద్రోవ్.. ఆయన్నంటే నీకు లేస్తంది.. మూస్కుని పోంద్రా.."

"ఏంద్రా పొయ్యేది? రోజూ ఆడేది మేము. ఈ రోజొచ్చి ఈడ నీ రుబాబేంది.."

"రేయ్ పఠాన్గా. ఎంతలో వుండాలో అంతలో వుండు. ఎక్కవ తక్కువలు మాట్టాడేవంటేనా. గాండు మార్తుం..."

ఆ చివరి మాటకి ఆ కుర్రాడి కాడ వున్న కొదవా కుర్రాళ్లు కిసక్కన ఎగతాళిగా నవ్వారు. పఠాన్కి మొకం జేవురించింది. వింటా వున్న మావోళ్లందరికీ కడుపు మండింది. పుట్టి బుద్దెరిగిం తర్వాత గ్రవుండులో ఇంత మాట మమ్మల్ని ఎవరూ అనింది లేదు. ఆ కుర్రాడు అంత కిండలుగా ఎందుకు మాట్టాడుతున్నాడో అర్థం కాలా. నాకు నోరు గబక్కన పెగల్లా.

"గాండు.. గీండు అన్నావంటే తిరపతి తీస్కెళ్లి గుండు కొట్టిస్తాం రోయ్ ఏవనుకున్నావో.. దొబ్బండి అవతలకి" అనంటా బిట్టూ స్టంపుల్లా పాతిన ఆళ్ల పుల్లల్ని కాల్తో కసిగా తన్నాడు. అయ్యెళ్లి అంత దూరాన పడ్డాయి.

అది చూసి "ఏంద్రారేయ్.. బలిసిందా.." అంటా పెద్దగా అరుస్తా బూతుమాటలంటా బ్యాటు రెండు చేతుల్తో పైకెత్తి పోట్లగిత్తలా బిట్టూ మీనకి దూసుకొచ్చి ఏసి కొట్టాడు తిరపతి. పఠాన్ గాడు గబక్కన తీతుని పక్కకు తోసాడు. లేదంటే బిట్టూ తల కొబ్బరికాయలా పగిలేదే. అప్పటికీ కణతల పైన బ్యాటు కొస తగిలింది. సన్నగా రక్తం కారతంది. ఇక ఆ దెబ్బకి అందరూ కీసర బాసరగా అరుచుకుంటన్నారు. కొట్టుకుంటన్నారు. ఎవుర్ని ఎవరు కొడతన్నారో తెలీటల్లా. అరుపులు కేకల్తో ఒకళ్ల మీదొకళు పడి దొర్లుతున్నారు. పిడిగుద్దులు గుద్దుకుంటన్నారు. గ్రవుండులో దుమ్ము రేగతా వుంది.

"రేయ్.. రేయ్.. ఆగండ్రా" అని గొంతు చించుకొని అరస్తన్నా ఒక్కడూ నా మాట వినిపిచ్చుకోవట్లా. గ్రవుండులో వాకింగు చేత్తా వుండేవోళ్లంతా గుడ్లప్పగించి చూత్తా ఎళ్తన్నారు తప్ప ఒక్కరు గూడా ఈళ్లను ఆపట్లా! పఠాన్ గాడ్ని, తిరపతి గాడ్ని ఆపడం వల్లకావట్లా. ఇద్దరూ ఉడుం పట్టు పట్టుకోనుండారు. ఆళ్లిద్దర్నీ పక్కకు లాగబోతుంటే ఎవరో నన్ను ఎనకనుంచి ఎగిరి తన్నారు. ఆవుంతున నేను బొక్కబోర్లా కింద పడ్డా. శ్రీకర్, ఇంకో ఇద్దరు పిల్లలు గబాల్న వచ్చి నన్ను పైకి లేపారు.

ఇంక లాభం లేదు. యవ్వారం బాగా ముదిరిందని చేతులు దులుపుకొని గబగబా ఎళ్లి తిరపతి గాడికి, ఆడి పక్కనే వున్న ఇంకో కుర్రాడికి లాగిపెట్టి గూబల మీన రెండిచ్చా. దెబ్బకి మంత్రం ఏసినట్టు అందరూ ఆగిపోయారు. తిరపతి చెంప మీన చేతులుంచుకొని, షాక్ తిన్నట్టు అట్టాగే బొమ్మలా వుండిపొయ్యాడు.

"ఏరా. ఏవనుకుంటన్నార్రా మీరు. ఈడ ఆడుకోవడాని కొచ్చారా. కొట్టుకోవడానికొచ్చారా. వేస్ట్ నాయాళ్లారని.. పోన్లే చిన్న కుర్రాళ్లని ఊరకుంటంటే మరీ రెచ్చిపోతన్నారే. పెద్దంతరం.. చిన్నంతరం లేదంట్రా. ఎట్టబడితే అట్ట మాట్టాడతా వున్నారు? కొట్టడానికి మీనకి వచ్చేత్తా వున్నారు." అని పెద్ద పెద్దగా అరిచేసరికి అందరూ తలకాయలొంచుకొని గమ్మునయ్యారు.

"రేయ్.. ఇంక మీరిక్కడ వుండొద్దు. ఎళ్లి పొండి. ఈడ అనవసరంగా గొడవలు పడితే బాగోదు.."

ఆ కుర్రాళ్లు కదల్లా. "రేయ్. మీకే చెప్పేది. ఎళ్లండి" ఆ కుర్రాళ్లలో ఇద్దరిని ఎళ్లమన్నట్టు తోసాను. తిరపతి, ఆడి కుర్రాళు మిర్రిమిర్రి చూసుకుంటా కాళ్లీడ్చుకుంటా బలవంతాన ఎళ్లి దూరంగా చెట్టు కింద కూచున్నారు.

మా కుర్రోళ్లంతా అశోక చెట్టు కిందకి చేరాం. ఒక్కొక్కళ్లకి బానే తగిలినట్టున్నాయి దెబ్బలు. బిట్టూకి కణతల కాడ తగిలిన దెబ్బ బొప్పి కట్టి రక్తం కారతా వుంది. చేతుల మీన స్టంపులతో కొట్టిన దెబ్బలు కమిలి అవుపడతా వున్నయ్యి. పఠాన్ గాడికి జబ్బల మీన తగిలిన దెబ్బలు దద్దుర్లు తేలి బాగా అవుపడతా వున్నయ్యి. కొదవా వాళ్లకీ ఆడాడ బానే తగిలినియ్యి.

"అరే బావ. బిట్టూకి, పఠాన్కి బాగా దెబ్బలు తగిలినట్టున్నాయి. ఇట్టా ఇళ్లకెళితే పంబేత్తారు. ఏం చేద్దాం?" శ్రీకరు అడుగుతున్నాడు.

'ఏం కారణం లేకోకుండా ఆ కుర్రాల్లిట్టా కొట్లాటకి ఎందుకు వచ్చేర..'ని నా బుర్రలో ఇందాకట్నుంచి ఆ ఆలాజనే తిరుగుతా వుంది. శ్రీకరు మాటలు నేను వినిపించుకోలా. ఇంతలో సాయినాథ్ బండేసుకొని దబదబా వచ్చాడు. ఆడూ మా టీమ్లో ఆడతా వుంటాడు. బ్యాంకు పరీక్షలకి తయారవుతా వున్నాడు.

"అన్నా.. ఏమయిందన్నా. ఏరా నాయాళ్లు. దెబ్బలు బాగా తగిలాయా. ఆ నా కొడుకుల్ని .." అదరాబాదరాగ పిల్లలకు తగిలిన దెబ్బలు చూసి 'స్.. అరరే...' అంటన్నాడు.

శ్రీకరు, తీతు జరిగింది సాయినాథ్కి చెప్పారు.

"అన్నా.. నీకు తెలీదు. ఇది చిన్న వ్యవహారం కాదు. ఆళ్లు ఊరక తెలీక వచ్చినోళ్లేం కాదు. మనం జాగర్తగా వుండాల.." అన్నాడు సాయినాథ్ శ్రీకరు కెళ్లి చూత్తా.

"పిల్లల్లేరా... వాళ్లదేముందిలే.. తెలీదు.." అన్నా తేలిగ్గా..

"ఆఁ..... నీకు తెలీదు బావోవ్. దీనెనుక చాలా కతుందిలే.. ఎందుకయినా మంచిది మనం ముందే జాగర్త పడాల" అన్నాడు శ్రీకరు కిట్టు కిందకి దింపుతా.

బిట్టూ, పఠాను, సాయినాథ్, శ్రీకరు ఒకరి మొకాలు ఒకరు చూసుకున్నారు. కళ్లతోనే ఏందో చెప్పుకున్నారు. "ఏంద్రా.. నాగ్గూడా తెలీకుండా..." అన్నా ఆళ్ల వాలకం చూసి.

"రేయ్ పఠాన్.. ముందే పొయ్యి కేసు పెట్టెయ్యండి. తర్వాత సంగతి తర్వాత చూసుకుందాం. ఏమంటావు బిట్టూ?" అన్నాడు సాయినాథ్ తీతు దెబ్బలు చూస్తూ ఆలోచనగా.

"కేసుల్దాక ఎందుకులే సాయి.." శ్రీకరు వారించాడు.

"లేదన్నా.. వాళ్లు పెద్ద ప్లాను మీనే వచ్చారు మన మీనకి. లేకపోతే ఎప్పుడు రానోళ్లు ఇయ్యాళ కావాలని గ్రవుండుకి ఎందు కొచ్చారు? కావాలని గొడవ ఎందుకు పెట్టుకున్నారు? అసలు మనకీ ఆళ్లకీ ఏం వుందని?"

శ్రీకరు ఏం మాట్టాడలా. కుర్రాళ్లంతా నిజమేనన్నట్టు చూస్తన్నారు.

"మనకన్నా ముందెల్లి ఆళ్లు కేసు పెట్టారనుకోన్నా. అప్పుడేం చేత్తారు?"

ఆ మాటకి బిట్టూ, పఠాన్ కాస్త భయంగా చూసారు.

"ఆఁ.... మరందుకే.. ముందే మనం పెట్టేమనుకో. మనం కాత్త సేఫ్లో వుంటాం. ఆ తర్వాత పరిస్థితి బట్టి కావాలంటే వుంచుకోవచ్చు. కాదనుకుంటే తీసేసుకోవచ్చు. చేతిలో పనేగా.." సాయినాథు ఏవంటారు అన్నట్టు చూసాడు.

గ్రవుండులో జరిగే క్రికెట్ మ్యాచుల్లో ఏవో చిన్నచిన్న గొడవలు జరుగుతుంటాయి గాని ఎయ్యా ఇప్పటిదాకా గ్రవుండు దాటి బయటకి పోలా.అట్టాంటిది ఇప్పుడు ఎకాఎకిన పోలీసు కేసంటే ... మనసు ఒప్పుకోవడంలా. సాయి చెప్పింది కూడా కరెక్టే.. వాళ్లు ముందెల్లి కేసు పెడితే.. ఏవో మరి.

తెలిసిన ఎస్ఐ ఫ్రెండొకడు వుంటే కాల్ చేసా. జరిగిందంతా చెప్పి సలహా అడిగా.

'ఒక్క నిమిషం కూడా ఆలిస్యం చేయకుండా గవర్నమెంటు ఆస్పత్రికెళ్లండి. మిగిలినదంతా ఆళ్లే చూసుకుంటారు' అన్నాడు

కాసేపు తర్జనబర్జనలాడి ఆస్పత్రికే ఎళ్దామనేసుకున్నాం.

అప్పటికే చానా పొద్దెక్కింది. ఎండ చిమచిమలాడతా వుంది.

చిమచిమలాడతా పిల్లలంతా కిట్టుల్దీస్కోని ఇళ్లకు మళ్లారు. శ్రీకరు ఆళ్ల అబ్బాయిని తీస్కోని ఇంటికెళ్లి మళ్లస్తానని ఎళ్లాడు.

చూస్తే చెట్టు కింద ఆ కుర్రాళ్ల బ్యాచ్చి లేదు.

ఇంక నేను, బిట్టూ, పఠాను, సాయినాథు దబదబ గవర్నమెంటు ఆస్పత్రికి బయల్దేరాం.

■■■

బిట్టూకి కణతల పైన తగిలి చీరుకుపోయిందానికి రెండు చిన్న కుట్లేసి కట్టు కట్టేరు.చేతుల మీన గాయాలకి ఆయింట్మెంట్ పూసి బ్యాండేజి ఏసారు.ఇక పఠాన్ గాడికి తగిలిన దెబ్బలు చూసి కాంపౌండర్ కూడా బిత్తర పొయ్యాడు.వీపు మీన,తొడల మీన, పిర్రల మీన కమిలిపోయి దెబ్బలే దెబ్బలు..ఆ వజాన ఆళ్లెట్టా కొట్టారో.. ఈడెట్టా ఓర్చుకున్నాడో... బాబోయ్..

పోలీసాయన వచ్చి ఎందుకు జరిగింది, ఎట్టా జరిగింది అన్నీ గుచ్చిగుచ్చి అడిగి పూచికపుల్లతో సహా రాసుకొని ఎళ్లాడు.

ఇద్దర్నీ జనరల్ వార్డులో మంచాల మీన పడుకోబెట్టి,

సాయినాథు నేను కిందకొచ్చి చెట్ల కింద సిమెంటు బెంచీల మీన కూచున్నాం. పిట్టల అరుపులు.. చల్లగా ఈత్తన్న గాలిని కూడా పట్టించుకోకుండా ఎవరి బుర్రలో ఆలోచన్లు ఆళ్లకి తిరగతా వున్నయ్యి. కాసేపటి దాక ఎవురం మాట్టాడుకోలా.

ఇందాక గ్రవుండులో శ్రీకరు గాడు 'నీకు తెలీదులే బావ.. దీనెకమాల చానా కతుందిలే' అనింది గెవనానికొచ్చింది.

"ఏంర్రా సాయి.. ఏందో కత వుందన్నారు.. ఏంది దీనెకమాల కత?" అన్నా ఆడి వైపు తిరిగి.

సాయినాథ్ పొడుగ్గా ఎగబీల్చి.. నిట్టూర్చి.. చెప్పడం మొదలేసాడు.

"మా నాన, మా బాబాయి రాంబ్రహ్మం.. నీకు తెలుసుగాన్నా.. ఎప్పటినుంచో పోలేరమ్మ గుళ్లో అర్చకత్వం చేస్తన్నారన్నా. ఆ గుడికి జనం రావడం, రద్దీ పెరగడం చూసి ఊళ్లో కొంతమంది దుష్టి దీని మీన పడిందన్నా. ఎవరో కాదు.. చందూ అని మన గ్రవుండుకి కూడా వస్తా వుంటాడు. నువ్వు చూసే వుంటావు. ఆడి నాన్నే. కాత్త డబ్బులున్నయ్యి కదా. నలుగుర్నేసుకొని ఈ గుడి మీన పడ్డాడు. గుడికి వెండి తాపడాలు చేయించి.. గ్రానైటు పరిపించి .. అట్టట్ట.. కమిటీలో దూరాడు. మెల్లగా జుట్టంతా చేతుల్లోకి తీసుకున్నాడు. ఇహ మా మీన పడ్డాడు. 'గుళ్లో బ్రాహ్మణులు పూజార్లుగా వుండాలి గానీ, ఈ కంసాలోల్లేంది? ఎళ్లి బంగారం కొట్లలో గొట్టం ఊదుకోవాలి గానీ, దేవుడు కాడ ధూపం ఏస్తారా? ఈళ్లు మంత్రాలు చదువుతుంటే మనం దణ్ణాలు పెట్టాలా? ఈళ్ల చేత మనం శఠగోపం పెట్టించుకోవాలా?' అంటా ముసలం పెట్టాడన్నా.. పైగా అంతకు ముందు గుడి జమాఖర్చులు నాన్నోళ్లే చూసి ఏ పైసాకి ఆ పైసా లెక్కదేల్చేవోళ్లు.. చందూ గాడి నాన వచ్చిన కాడ్నుంచి అయ్యేం చెప్పట్లా... అడుగుతున్నారని నానోళ్ల మీన కంటు.. సరే.. అదట్టా వుంది కదా.. ఆ గొడవేదో పెద్దోళ్లు పెద్దోళ్లు పడతారు గదన్నా.. మద్దెన ఈ చందూ గాడికి ఎందుకు.. ఇంటో గొడవలన్నీ గ్రవుండుదాక తేవడం.. పిల్లబిత్తిరి నాయాలు.. గ్రవుండులో నేను యాడుంటే ఆడకి నలుగురు కుర్రాళ్లనేసుకు రావడం.. మన ఆట ఎట్టోకొట్ట చెడదొబ్బడం.. ఆళ్లని ఏదోక వంకన నా మీన గొడవకి ఉసిగొల్పడం... ఇదే పని ఆడికి.. మద్దెలో నేనేం చేసాను? దీనికి తోడు ఈ మద్దెలో ఆ తిరపతి గాడొకడు తోడయ్యాడు ఈడికి. ఆడేమో గుజరాత్‌లో చదువొదిలేసి వచ్చాడంట. ఈడ చందూ గాడికేమో చదువబ్బక గాలికి తిరుగుతున్నాడు.ఆడికీడు.. ఈడికాడు. ఇద్దరు కలిసి ఒకటే రబసనుకోన్నా..."

"తిరపతి గాడెట్టా పరిచయం రా చందూ గాడికి?"

"చందూ గాడి నాన ఏవో హిందూ సభలంటా ఊర్లు తిరుగుతుంటాడన్నా. అట్టా సభలకు ఎళ్లినపుడు అహ్మదాబాద్‌లో

యాడో కలిసారంట ఇద్దరు. ఒకటే ఊరు కదా.. అప్పట్నుంచి లక్కలా అతుక్కున్నారు. ఆ తిరపతి గాడు ఆడ ఏదో కేసులో ఇరుక్కుని మన ఊరొచ్చేసాడు. అప్పట్నుంచి ఈడూ చందూ గాడు అతుక్కున్నారు."

"మరి చందూ గాడు యాడా అవుపడడేంట్రా?"

"అమ్మా.. అడట్టా అవుపడడన్నా. ముచ్చు నాయాలు. ఆడు ఎనకుంటాడు. అందర్నీ ముందుకు తోసి నాటకం ఆడిత్తా వుంటాడు.." సాయినాథు చెప్పి ఊపిరి పీల్చుకున్నాడు.

నేను అదంతా విని 'హుస్..' అంటా ఊపిరి వదిలాను.

■■■

చెట్ల కొమ్మల మద్దె నుంచి ఎండ కిందకి దిగలేకపోవడం వల్ల సిమెంటు బెంచీల కాడ నీడ హాయిగా వుంది. ఆస్పత్రిలో రోగుల బంధువులు దిగులు మొకాలతో ఏవేవో సంచులు మోసుకుంటా బయటకి లోనికి తిరుగుతున్నారు. మద్దేన్నం కాడంతో అంబులెన్సులు విశ్రాంతి కోసం లోపలికి వచ్చినియ్యి. రోగుల కోసం వచ్చినోళ్ల బండ్లు కొన్ని ఎండలో నిలువునా కాలపోతన్నియ్యి. ఆస్పత్రి బయట రోడ్డు మీన వాహనాలు బుయ్యో బుయ్యోమని రొద.

నా కడుపులో కూడా ఎందుకో ఒకలాంటి సొద.

అప్పుడు గుర్తొచ్చింది పొద్దుట్నుంచి ఎవరం ఏం తినలేదని.

"ఏరా సాయి.. ఆకలేయట్లేదంట్రా.. నాకైతే ఆకలి దంచి కొడతంది.."

"నేను పొద్దున వస్తావస్తా తినొచ్చానన్నా.. పా.. ఏదైనా తినొద్దువు.. పాపం లోన వాళ్లు కూడా ఏం తినలేదనుకుంటా" అంటా సాయినాథు బండి తీసాడు.

ఎల్లి హొటల్లో ఇద్దరం టిపిను తిని, రెండు పార్శిల్లు కట్టించి, తిరిగి ఆస్పత్రికి బయల్దేరాం.

సాయినాథు పోనిత్తంటే నేను బండి ఎనకాతల కూచున్నా. కొద్ది దూరం పోయాక నాకు ఎనక నించి కేకలు వినపడతన్నయ్యి. తిరిగి చూత్తే.. మాకు కొద్ది దూరంలో తిరపతి, ఆడి బ్యాచి కుర్రాళ్లు బండ్ల మీన అరుచుకుంటా మా ఎనకే వత్తన్నారు. ఆ అరుపులు మొదట అర్థం కాలేదు గానీ రెండోసారికి అర్థమయినియ్యి. తీవ్రమైన అవహేళనలు.. వెక్కిరింతలు.

గేలిగేలిగా అరుచుకుంటా, ఎక్కిరిస్తా మమ్మల్ని దాటుకుంటా ఎల్లిపోయారాళ్లు. రోడ్డు మీన జనాలు విచిత్రంగా మమ్మల్నే చూత్తన్నారు. తల కొట్టేసినట్టయింది నాకు.

'ఏందీ గోల.. అసలు ఎవరీళ్లు.. అసలేం చేస్తన్నారు.

ఎందుకంత తలపొగరు.. పెద్దా చిన్నా లేకోకుండా ఉచ్చం నీచం లేదా.. ఎట్టా బడితే అట్టా తిడతన్నారు. ఈళ్ల తలిదండ్రులు ఈళ్లని ఇట్టాగే పెంచుతున్నారా. అడ్డూఅదుపు లేకుండా అడ్డగాడిదల్లా ఎందుకిట్టా తయారయారు. రోడ్ల మీన కూడా ఇంత లేకిగా వున్నారంటే..' ఆలోచనల్లోనే ఆస్పత్రి వచ్చింది.

సాయినాథు పొట్లాలు ఇవ్వడానికి లోపలికి ఎళ్లాడు.

బెంచీ మీన కూచున్నానే గానీ మనసు మనసులో లేదు.

అవమానంగా వుంది. వయసులో సగం కూడా లేని కుర్రవెధవలు.. అసలు అట్టా మాట్టాడ్డానికి ఆళ్లకి నోరెట్టా వచ్చింది? ఛ.. నేనాళ్ల మాటలు అస్సలు అరాయించుకోలేకపోతన్నా.

■■■

ఎండ నడినెత్తికెక్కింది. టయ్యిం రెండు దాటతా వుంది.

శ్రీకరు గాడు షాపు కట్టేసి అన్నం తిని వచ్చేసాడు. మళ్లా షాపు తీసేది నాలుక్కో.. ఐదుకో..

"బావా మన కేసు ఎళ్లిందంటావా స్టేషనుకి?"

"ఏవో మరి.. నాకు తెలీదు.. ఆ పోలీసయితే రాసుకున్నాడు"

"కేసులు ఎందుకులే బావా.. సాయంత్రం దాకా చూసి రిపోర్టు ఎనక్కి తీస్కుందాంలే.."

ఇందాక కుర్రోళ్లు బండ్ల మీన పోతూ పోతూ వాగింది చెబుతామనుకున్నా గానీ.. చెప్పడానికి మనసొప్పలా.

ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకుంటా బెంచీ మీనే కూచున్నాం చానా సేపు. ఇంతలో ఆస్పత్రిలోకి వత్తా అవుపించేరు గోయింద రెడ్డి, ముత్యాల రెడ్డి. ఆళ్లిద్దరూ అన్నదమ్ములు. ఆళ్లు నాకు ఇదివరకే తెలుసు.

గోయింద రెడ్డి మా బంధువొకడికి కోడి పందాల కాడ పరిచయం. వాడు తీసుకొచ్చి కంపలాగ నాకు తగిలిచ్చాడు. గోయిందు డబ్బుల కాడ బలే జిడ్డు. నా కాడ బతిమాలి బతిమాలి డబ్బులు అప్పు తీస్కొని, అడగంగా అడగంగా కొద్ది కొద్దిగా ఇచ్చి, కొంచెమాది ఎగ్గొట్టేసాడు. ఎప్పుడడిగినా 'ఇత్తాలే' అంటాడు. ఇవ్వడు. అడిగి అడిగి నాకే విసుగొచ్చి ఇంక మానుకున్నా. అదే కాదు. ఆళ్లిద్దరికీ నలుగురు పిల్లలున్నారు. అంతకు మునుపు మేము నడిపిన స్కూల్లో చేర్చారు ఆ నలుగురు పిల్లల్ని. బాగా చదివే పిల్లలు. తొమ్మిదిదాక చదివారనుకుంటా. ఉన్నట్టుండి వేరే స్కూల్లో ఏసారు. పదివేలు ఫీజు ఎగేసారు. అడిగితే సమాధానం ఊఉ లేదు. ఆఉ లేదు.

ముత్యాల రెడ్డి కూడా అదే బాపతు గానీ సైలెంటు కిల్లరు.

ఆళ్లిద్దరు బండ్లు పక్కనబెట్టి నేరుగా నా కాడకి వచ్చారు.

గోయింద రెడ్డి బాగా లావెక్కాడు. పొట్ట కుండ లాగ ముందు కొచ్చింది. మొకం బాగా ముదిరి గవదలు తేలాయి. నడవలేక నడుత్తున్నాడు.

"ఏం గోయింద రెడ్డి.. బావున్నావా.. చాన్నాళ్లయింది చూసి.." నేనే ముందు పలకరించా.

"ఆఉ..ఆఉ.. బాగానే వుండాం గానీ. నువ్వేంది మా

అబ్బాయిని కొట్టేవంటా? నీ స్టూడెంట్లని ఎనకేసుకొని వచ్చి మా అబ్బాయిని కొడతావ? ఏం చేసాడని..? వాడూ నీ స్టూడెంటేగా.." అన్నాడు రావడంతోనే కాత్త దురుసుగా.

నేను ఇచిత్రపోయా.

తిరపతి మా స్కూల్లో స్టూడెంటా? అందుకే యాడో చూసినట్టే అనిపించింది గానీ గుర్తు రాలా. అయినా గడ్డాలు మీసాలొచ్చి, ఒడ్డూ పొడుగూ మారిపొయ్యిన తర్వాత యాడ గుర్తుపడతాం. వాళ్లే మనల్ని గుర్తుపడతారు గానీ..

"మీ అబ్బాయా.. అర్రే.. నాకు తెలీదు రెడ్డీ.. నేనసలు గుర్తు పట్టలేదు.."

"కాదులే.. నువ్వు నా కొడుకని తెలిసీ మా వాడ్ని కొట్టావు.."

"లేదు రెడ్డీ. వాడు నీ అబ్బాయని నాకు నిజంగా తెలీదు."

"కాదు. నీకు తెలిసే చేసావంటలే.."

"అరే.. కాదంటుంటే.. నాకు తెలీదు నిజంగా.. నీ అబ్బాయికి తెలీదా మరి నేను పలానా అని.. నేను సారని తెలిసీ ఎంత గోరంగా రెటమతంగా మాట్టాడాడని. సారనే కించిత్ గౌరవం వుందా మీ వాడికి. వుంటే అట్టా మాట్టాడతాడా.. చెప్పిన మాట వినకుండా అట్ట మా వాళ్ల మీన పడి కొడతాడా చెప్పు ఉత్తి పుణ్యానికి..?"

' కాదులే.. నా కొడుకని తెలిసీ కొట్టావు.. అదే బాధగా వుంది"

"ఇగో గోయిందు.. నీ కొడుకని తెలిస్తే కొట్టడం కాదు. తాట తీసేవోణ్ణి. స్కూల్లో నేనేంటో వాడికి తెలీదూ.. ఇప్పుడు కాత్త పెద్దయ్యేసరికి కళ్లూఒళ్లూ కానడం లేదు."

"నీ కొడుకు పత్తిత్తేం కాదులేవయ్యా.. గ్రవుండులో ఎంత గందరగోళం చేసాడో నీకు తెలుసా? ఇన్నాళ్లమించి మేం గ్రవుండులో ఆడతన్నాం. ఒక్క గొడవుందా? మీవోడే ఈ రోజు ఈ పెంట పెట్టాడు. బిట్టూకి, పఠానుకి ఎన్ని దెబ్బలు తగిలినియ్యో ఎల్లి చూడండి. ఎట్ట కొట్టారో చూడండి. మీ అబ్బాయి నోరు తెరిత్తే పచ్చి బూతులు. మరి చదివేది దేనికి.. సంక నాకనా..? మీవోడు ఎవుడెవుడి సావాసం చేత్తన్నాడో.. ఎవుడి చెప్పుడు మాటలు విని ఎన్ని కొట్లాటలు ఇంటి మీనకి తెత్తన్నాడో చూడండి ముందు.." చూసి చూసి శ్రీకరు తగులుకున్నాడు.

ఆ మాటలకి రంగులు మారిన మొకంతో గోయిందు ఏదో అనబోయేంతలో తిరపతి పదిమంది కుర్రాళ్లనేసుకొని బండ్లని బుర్రుబుర్రుమని సౌండ్లు చేసుకుంటా ఆస్పత్రిలోకి వచ్చాడు.

సరాసరి మా కాడకి వచ్చి గోయింద రెడ్డిని చిట్లించిన మొకం తో చూస్తా.. "ఏంది నానా ఈడ మాటలు.. ఈళ్లు మన మీన రిపోర్టు ఇచ్చారంట.. మనమేనా తక్కువ తిందీ? మనం కూడా ఇద్దాం పా.. ఇట్ట కాదు.. ఈ నాయాళ్లకి కొవ్వు దించాల" అని గోయింద రెడ్డి రెక్క పట్టుకొని లాక్కెళ్లాడు.

నేను తిరపతిని ఏంద్రా ఇదని అడుగుదామని నోటిదాకా వచ్చి మళ్లా అడగ బుద్ధవక గమ్మునయ్యా. ఆడ్ని చూస్తంటేనే నాకు ఒళ్లంతా కంపరంగా వుంది. ఆడి నోట్లో నోరు పెట్టి ఏదొకటి అనిపించుకోవడం.. ఆనక బాధ పడడం ఎందుకు..

సాయినాథు కిందకి వచ్చాడు.

"ఎట్టుంది సాయి ఇద్దరికీ.." అడిగా.

సాయినాథు అది పట్టించుకోకుండా "ఏందన్నా... తిరపతి గాడు గుంపునేసుకు వచ్చాడు.." అన్నాడు, తిరపతి పోయిన వైపే చూస్తా.

"వాళ్లు గూడా కేసు పెడతారంట్రా .." అన్నాడు శ్రీకరు.

"పెట్టుకోనీ.." అన్నాడు బింకంగా సాయినాథు.

" కేసులు ఎందుకులేవాయ్.. అందరూ చదువుకునే పిల్లలు.." అన్నాడు శ్రీకరు.

మొకమొకాలు చూసుకుంటా కాసేపు ఎవ్వరికీ ఏం మాట్టాడాలో తోచలా. వచ్చేపొయ్యేవోళ్లని చూస్తా.. తిరపతిగాడోళ్లు లోన్నుంచి బయటకి వస్తారేమోనన్నట్టు మీనమేషాలు లెక్కబడతా చూస్తన్నాం.

అరగంట తర్వాత బిలబిల అందరూ వచ్చారు బయటికి.

"అడిగో అన్నా.. ఆడే చందూ గాడు.." నా చెవుల దగ్గర కొచ్చి గుసగుసగా చెప్పి, కళ్లతో ఆ గుంపుతో కలవకుండా ఒక పక్కగా వస్తన్న ఒక పొడవాటి కుర్రాణ్ణి చూయించాడు.

ఆ కుర్రాణ్ణి గ్రవుండులో చానా సార్లు చూసాను. దూరంగా అవుపడతా వుంటాడు. నలుగురు కుర్రాళ్లుంటే మాత్రం మాక్కాస్త దూరంలో కూచొని మా వేపే చూత్తా ఏవో ఎకసెక్కాలు ఆడుకుంటా వుంటాడు. ఇంత చిన్న వయసు కుర్రాళ్లలో ఇంత కుచ్చితం.. ఇంత కుళ్లు ఎందుకు?

అంతలో బిట్టూగాడోళ్ల నాన పురుషోత్తం, ఆడి ఇద్దరన్నలూ, ఆళ్లతో పది మంది జనం ఆస్పత్రి లోనకొచ్చేసారు.

ఎవర్నో వెతుకుతున్నట్టు చూసుకుంటా సెల్ చేతిలోకి తీసుకొని ఎవరికో ఫోన్ చేస్తన్నాడు.

నా సెల్ రింగవుతా వుంది. నాకే....

"యాడున్నారు సార్?" ఆదుర్దా వినిపిస్తా వుంది ఆయన గొంతులో..

"ఈడ్నే వున్నా సార్ ఆస్పత్రిలో. మీకు ఎదురుంగా.. ఈడ సిమెంటు బెంచీల కాడ.." చెయ్యెత్తాను.

చూసి..దబదబ నా కాడకి వచ్చేసారు.

"సార్.. ఎట్టుందట సార్ మావాడికి? యాడున్నాడు సార్? ఏంది సార్ ఈ గొడవలు?" అంత మడిసి బెంబేలు పడిపోతన్నాడు బిట్టూ నాన పురుషోత్తం.

"చిన్న దెబ్బేలెండి. పైన రూమ్‌లో వున్నారు" అన్నాడు శ్రీకరు.

"ఇప్పుడే ఎళ్లస్తున్నానండి. బాగానే వున్నారు. కాసేపాగి ఎళ్లిపోవచ్చన్నారు.." అన్నాడు సాయినాథు.

"ఒరే మనకెందుకురా ఆ ఆటలు... కమ్మంగా ప్రభువు సేవ చేసుకోరా.. అంటంటే నా మాట వింటన్నాడా.. తోడబుట్టిన ఇద్దరూ చర్చీలో చేసుకోవడంలా. ఇప్పుడు చూడు. తిప్పలు.. పాస్టర్లం.. మాకెంత నామర్దా పేటలో..." చెమటలు కారిపోతు న్నాడు పురుషోత్తం.

పురుషోత్తం వాళ్లు కులానికి నాయుళ్లు. మతంలోకి కన్వెర్ట్ అయారు. దండుబాటలోనే తిరపతిగాడోళ్లకి కొంచెం దూరంలో చర్చిని నడుపుతా వుంటాడు. మంచి బిలీవర్. ఆ పేటలో జనానికి ఆ చర్చి అన్నా, పురుషోత్తం అన్నా గురి. ఎలక్షన్లప్పుడు ఏ పార్టీవోడయినా ఆయన గుమ్మం తొక్కాల్సిందే. మున్సిపాల్టీ ఎలక్షన్లైతే ఆయన సపోర్ట్ చేసినోడే గెలుత్తాడని అంటారు.

బిట్టూ పెద్దన్న నా దగ్గర దాకా వచ్చి "ఈ మధ్యన ఈళ్ల అరాచకం ఎక్కువయిపోయిందన్నా. చర్చిమైక్ పెట్టి డిస్టబెన్స్ చేత్తన్నామంట.. ఒకటే కంప్లైట్స్ చేస్తన్నారు మా మీన.. మరి వాళ్లు.. మొన్న వినాయక చవితికి వాళ్లు పెట్టిన డిజెకి చెవులు దిబ్బుళ్లు పడిపోయాయనుకో.. రోడ్డంతా బ్లాక్ చేసి.. ఎవుడ్నీ రానీకుండా పోనీకుండా రచ్చ రచ్చ చేసారు. ఎవురి దేవుడి పూజ వారు చేసుకోవచ్చు.. కానీ మరీ ఇట్టనా.. అంతకు ముందు ఇంత గోల లేదు." అన్నాడు డీలాగా.

"ఏరి ఆ తిరపతి వాళ్లు.. ఇటే వచ్చారంట.." చుట్టూ వెతుకుతూ అన్నాడు పురుషోత్తం. ఆయనకి ఎదురుంగా తిరపతి గాడోళ్ల గుంపు అవుపించింది. ఆయన, ఆయన మనుషులు అటు పోయారు.

నేను ఈడే నుంచొని చూత్తా వున్నా. నాకెందుకో పురుషోత్తం గారోళ్లు అటు పోవడం ఇష్టం లేదు. పురుషోత్తం గారు పర్వాలేదు గానీ, బిట్టూ అన్నలు అసలే ఆవేశపరులు.

నేను అనుకున్నట్టే కాసేపటికి ఇరువురి మధ్యన మాటలు పెరిగినియ్. మాటలు అరుపులకు దిగినియ్. ఆ గుంపు, ఈ గుంపు తోపులాటకు దిగినియ్.

"ఏయ్..ఏయ్.." అంటా ఆడకి దగ్గరగానే వుండే అవుట్ పోస్ట్ పోలీసు లగెత్తుకు వచ్చాడు. గుంపులోకి అడ్డం జొరబడి, గొడవ ఆపి, ఇరువుర్నీ కేకలేసాడు. ఎవురికో ఫోన్ చేసాడు. మాట్లాడాడు. "సిఐ గారు రమ్మంటన్నారు.. అందరూ స్టేషనుకు పదండి" అన్నాడు. దాంతో ఎక్కడోళ్లక్కడ చప్పంగా కదబడ్డారు. కాసేపటికి పోలీస్ జీపు వచ్చింది.

■■■

"చాలా చిన్న కుర్రాళ్లు. ఎందుకిట్టా తన్నుకుంటన్నారు..?" సిఐ అడిగాడు.

పోలీస్ స్టేషనులో సిఐ రూమ్‌లో తిరపతి, గోయిందు రెడ్డి, బిట్టూ, ఆడి నాన పురుషోత్తం, నేను, సాయినాథు, పఠాను, ఎస్ఐ, ఇద్దరు ముగ్గురు కానిస్టేబుల్స్.. ఎవురూ మాట్టాడలేదు.

"తిరపతి ఎవరిందులో...?"

తిరపతి చెయ్యెత్తి "నేనే" అన్నాడు వినీవినపడకుండా.

"నీ మీన ఈ మధ్య చానా కంప్లయింట్స్ వచ్చాయి. అన్నీ మీ ఏరియా నుంచే.. దేవుడి విషయం కదా అని లైట్ తీసుకున్నాం. ఇప్పుడు కొట్లాటలకి కూడా దిగావా?"

"......."

"ఏం గోయిందు.. నువ్వు సరేసరి.. పిల్లాణ్ణి కూడా ఇట్టనే పెంచుతావా? ఆ కుర్రోళ్లకి దెబ్బలు ఎట్ట తగినియ్యో చూసావా? కేసవుతే ఏవయిద్దో తెలుసా? ఉద్యోగం.. సద్యోగం సంక నాకి పోద్ది. జెయిలుకి పోవాలి.చెప్పేది అర్థమవుతుందా..?"

"......"

"ఏరా అట్ట చూత్తన్నావు. కొమ్ములు తిరిగిన క్రిమినల్స్ కూడా అట్ట చూడరు.." సి.ఐ. తిరపతి వంక కోపంగా చూత్తా పైకి లేచాడు కర్ర తీసుకొని.

అంతలో సిఐ సెల్ మోగింది. మాట్లాడుతుండగానే ఆయన మొకంలో రంగులు మారాయి.

"సరే సార్.. ఎస్ సార్ .. ఎస్ సార్' అని ఫోన్ పెట్టేసాడు.

రెండ్నిమిషాలు గమ్ముగ వుండిపోయాడు.

"ఏమండీ.. ఏం చేద్దాం..?" పురుషోత్తాన్ని ఉద్దేశించి అడిగాడు.

"సార్.. మా అబ్బాయి అట్టా గొడవలకు ఎళ్లే రకం కాద్సార్.. ఎట్ట తగువయిందో అయింది. వాడ్ని ఇంక గ్రవుండుకి పంపియ్యం సార్.. ఈ సారికి అందరికీ గట్టిగా వార్నింగ్ ఇచ్చి వదిలేయండి సార్.." పురుషోత్తం మాటలు నట్టులు పోయాయి..

"ఆఁ... అదే... మీ మంచికే చెబుతున్నాను. అందరూ మంచిగా రిపోర్టులు ఎనక్కి తీసుకొని, గొడవలు పడకుండా ఎళ్లిపోండి. లేదంటారా.. కేసు కడతాను. తర్వాత మీ ఇష్టం.." నా వంక ఏంటన్నట్టు చూత్తా అన్నాడు.

"సార్ .. నేను ఈళ్లకి కోచ్ని. చానాళ్ల మించి ఆడతన్నాం. ఏ రోజూ ఒక్క గొడవా లేదు. ఈ రోజు కావాలని గొడవ పెట్టుకుంది వాళ్లే సార్.. ఏదో కచ్చ పెట్టుకొని కొట్టినట్టు వుంది సార్.. ఇట్టయితే గ్రవుండులో ఏం ఆడుకుంటాం సార్..?"

"అందుకే నండి నేనూ చెబుతున్నా.. చిన్న గొడవని పెద్దది చేసుకోబాకండి. ఆటల దగ్గర కూడా కొట్టుకొని అల్లరి చేసుకుంటే ఏం చేత్తాం చెప్పండి..?"

"సార్.. మా అబ్బాయి ఇచ్చిన రిపోర్టు ఎనక్కి తీసుకుంటాం. మేం ఎళ్లిపోతాం. మాకు ఈ గొడవలొద్దు..ఈ ఆటలొద్దు.."

పురుషోత్తం ఆడ ఒక్క క్షణం కూడా నిలబడలేక పోతున్నాడు.

అంతలో ఎవరో నల్లంగా వున్న మడిసి లోపలికి వచ్చాడు. తెల్లటి ఇస్త్రీ చొక్కా ఏసుకొని, నుదిటిన నిలువు బొట్టు పెట్టుకున్నాడు. సిఐకి నమస్కారం పెట్టాడు. మాట్లాడాలని మా వంక చూసాడు.

సిఐ మమ్మల్ని కాసేపు బయటకు పొమ్మన్నాడు. తిరపతి, గోయిందు, ఆ వచ్చిన పెద్దమడిసి లోపలే వున్నారు.

"అన్నా.. ఆయనే చందూ గాడి నాన." అన్నాడు సాయినాథు.

"యాడో చూసినట్టే వుందిరా.." అన్నా

"అదేనన్నా.. అప్పుడు దివాళా తీసాడని ఐ.పి. పెట్టేడే.. రామనాథం.. ఈయనే.."

నాకు వెంటనే గుర్తొచ్చింది. అప్పులోళ్లు అందరికీ కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన రామనాథం. ఇప్పుడు ఈయనే గుళ్లకి ధర్మకర్త.. ఊళ్లో పెద్ద మడిసి.. హు..

కొంచెం సేపటి తర్వాత వాళ్లు బయటికి వచ్చారు.

'ఇప్పటి నుండి ఏ గొడవలు పడమనీ, కలిసిమెలిసి వుంటా మని' మా చేత కాయితం రాయించుకున్నారు. సంతకాలు అయిన వెంటనే రామనాథం, గోయిందు, తిరపతిగాడోళ్లు మా వంక ఒక విధంగా చూసుకుంటా.. పెదాల మీన క్రూరంగా అవుపడీ అవపడనట్టు నవ్వుకుంటా.. గెలిచినట్టు రొమ్ము విరిచి నడుచుకుంటా ఎల్లిపోయారు.

పది నిమిషాలకి సిఐ బయటకు వచ్చాడు. 'ఏందన్నట్టు' తల ఎగరేసాడు. అంతా ఓకె అన్నట్టు పోలీసులు తల ఊపారు. సెల్యూట్ చేసారు. ఇంక సిఐ మాతో మాటా మంతి ఏం లేకోకుండా జీపు ఏసుకొని ఎళ్లిపోయాడు.

అప్పటికే చీకటి కమ్మింది.

ఉసూరుమంటా పురుషోత్తం, బిట్టూ, ఆడి అన్నలూ ఆడే స్టేషన్లో కూచున్నారు. మెల్లంగా అడుగులో అడుగు వేసుకుంటా పఠాను నాన ఇంతియాజ్ వచ్చాడు. ఆయన ఎంబడి పఠాను తమ్ముడు రెహ్మాను, మసీదు కాడ వుండే ఖాలీషా, మస్తాను వుండారు.

పఠాను కాడకెల్లి కాసేపు ఏందో మాట్లాడారు.

నాకాడకొస్తే విషయమంతా పూస గుచ్చినట్టు చెప్పాను.

మడిసి నొప్పిగా చూసాడు.

"సాబ్.. మా వాడు ఎక్కడా గట్టిగా కూడా మాట్లడడు సాబ్.. వాడేందో.. వాడి పనీ ఏందో.. వాడి లోకమేందో.. ఒక్క మాట పడడు సాబ్.. అంతా ఖామోష్గా వుంటడు.. వాడికీ ఇంత కోపం వచ్చిందంటే ఆశ్చర్యంగా వుంది సాబ్.. పొద్దటి నుంచి బిడ్డ ఇంటికి రాకపోతే వాడి అమ్మ బేజార్ అవుతుంది సాబ్" అన్నాడు ఇంతియాజ్ ఏడుపు గరగరలాడే గొంతుతో.

ఇంతియాజ్ ఊర్లో ఆంధ్రా బ్యాంకులో గుమస్తాగా పని చేస్తా వుంటాడు. చాన్నాళ్ల మించి చాకిరి చేస్తన్నా పర్మినెంటు అవ్వని ఉద్యోగం. పెరగని జీతం. కేసు కోర్టులో ఏళ్లుగా భారంగా నడుస్తా వుంది. ఆ భారమంతా ఇంతియాజ్ మొకంలో అవుపిస్తా వుంటది.

అందరం ఒక దగ్గర కూచున్నాం. సమయం గడుస్తా వుంది. రాత్రి 8 అయింది. సిఐ సారు ఇంకా రాలేదు. పురుషోత్తం ఇంక కూచోలేక కొడుకుల్ని బిట్టూకి తోడుంచి ఇంటికి ఎళ్లాడు.

కూచొని కూచొని ఖాలీషా, మస్తాను ఎళ్లొస్తామని లేచి ఎళ్లారు. పోలీసులు డ్యూటీలు మారారు. తెలిసిన పోలీసులు ఇద్దరుంటే ఫోన్ చేయమన్నా సిఐకి. 'వస్తన్నారు.. కూచోండం'టన్నారు..

కూచొని..కూచొని నడుములు పోతన్నియ్యి.

మేం రిపోర్టు ఎనక్కి తీసుకున్నాం గానీ.. వాళ్లు తీసుకున్నారా?

ఆడ మా చేత సంతకాలు తీస్కున్న పోలీసుల్ని అడిగితే 'తెలీదు.. రిపోర్టు సారు కాడ వుందం'టన్నారు.

ఏదో తేడాగా, అసహనంగా వుంది. బాగా చీకటి పడిపోయింది. హెడ్ కానిస్టేబుల్ ఒక కన్ను మా మీనే వుంచినట్టున్నాడు. మేం లేచినప్పుడల్లా లేచి మా కాడకి వత్తన్నాడు.

"సార్ వత్తాడు.. కూచోండి" అంటన్నాడు.

తొమ్మిదయింది. సార్ అయిపులేదు.

పదయ్యింది. సార్ పత్తాలేదు. విసుగొస్తా వుంది.

సెల్లో ఫేస్ బుక్ ఓపెన్ చేసా. మెల్లగా చూసుకుంటా పోతన్నా. ఎందుకో చటక్కన సాయినాథు గాడు చెప్పింది గుర్తొచ్చింది. 'తిరుపతి రెడ్డి' అని టైప్ చేసా. వరసగా ఏవేవో వచ్చినియ్.. నేను అనుకుంది రాలా.. ఇంగ్లీషులో టైప్ చేసా. చాలా వచ్చినియ్.

మొకాలు జాగర్తగా చూసుకుంటా దగ్గరగా వున్నయ్యి ఓపెన్ చేసుకుంటా ఎళ్తన్నా. ఫ్రం చీరాల.. లివ్స్ ఇన్ అహ్మదాబాద్.. ఎస్.. దొరికింది. వాడే... వాడి ఫ్రెండ్స్ లిస్టులో వున్నవాళ్లని చూస్తంటే నా కళ్లు పెద్దవి అవుతున్నయ్. ఏవేవో హిందీలో నినాదాలు.. కింద వీడియోలు వున్నాయి. ఒకటి ఓపెన్ చేసా.

గుంపులు గుంపులుగా కుర్రాళ్లు. అంతా పద్దెనిమిది, ఇరవై లోపు వాళ్లు. కొందరి చేతుల్లో కత్తులూ.. తల్వార్లూ.. త్రిశూలాలు వున్నాయ్.. ఒక్కొకడు ఎర్రిగా.. పిచ్చి పట్టినట్టు ఎగురుతా.. ఉన్మాదుల్లా అరుస్తూ కత్తులు తిప్పుతున్నారు. కొందరి చేతుల్లో జెండాలున్నాయి. నుదుటన బొట్లు వున్నాయి. ఆ గుంపులో అవుపడ్డాడు తిరపతి. వినిపిస్తున్న గందరగోళ మ్యూజిక్ని మించి గొంతు చించుకు అరుత్తున్నాడు. ఒంట్లో సత్తువని మించి రెచ్చిపోయి ఎగురుతున్నాడు. అరుపుల్లో హేళన, ఎకిలితనం, ఉన్మాదం... నా మొకంలో నీళ్లు దిగిపోయాయి.

ఇంకో వీడియో... వరసగా వందల కత్తులు.. తల్వార్లు.. డాగర్లు.. ఒక బల్ల మీన పేర్చి వున్నాయి. దాని ముందు వరసగా పెద్ద పొజిషన్లో వున్న పోలీసు ఆఫీసర్లు వున్నారు.

'ఆటిని ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి తరలిస్తుండగా పట్టుకున్నామని.. దగ్గరలో ఎలక్షన్లు వున్నాయని.. అందుకే కట్టుదిట్టం చేసామని' చెబుతూ వుండగా.. వీడియో నిందితుల మీనగా పోయినపుడు అందులో తిరపతి గాడు వున్నాడు నేల చూపులు చూస్తా.. ఈ వీడియో కూడా ఫేస్ బుక్ లో పెట్టుకున్నాడు గొప్పగా.. మళ్లా దానికి వందల్లో లైకులు.. కామెంట్లు.. కళ్ల ముందు ఇంతకంటే క్రూరమైన వీడియోలు.. రక్తాలు పారుతున్న వీడియోలు గిర్రున తిరిగాయి. నా గొంతు తడారిపోయింది.

తిరుపతిగాడెందుకు బిట్టూ ఎనక, పఠాను ఎనక ఎర్రిగా పడతన్నాడో నాకు ఒక్కో ముడి విడిపోతా వుంది. చిందరవందరగా వున్న ముడులన్నీ ఒక దగ్గరకి చేర్చి చూస్తందేతలికి నా ఒళ్లు జల్లుజల్లుమంటా వెన్నులోంచి చిరుభయం జరజర పాకింది.

జేబులో సెల్ మోగుతా వుంది. శ్రీకర్. ఓపిక లేని చేతుల్తో ఎత్తా.

"బావా.. ఆ తిరుపతి గాడు, కుర్రాళ్లనేసుకొని కర్రల్తో కాపేసా దంట బావా.. ఆడి ఇళ్ల కాడ మనోళ్లు చూసి చెప్పారు..జాగర్త మీరు.."

ఆ మాటకి నా తల్లో రక్తం జివ్వున పైకి చిమ్మింది. వెళ్దాం అని లేచినోడ్నల్లా మళ్లా పఠాన్ గాడి పక్కనే కూర్చున్నా. పళ్లు బిగించి కుర్చీకోడు గట్టిగా పట్టుకున్నా. ఈళ్లని రెచ్చగొట్టే పెద్దపెద్ద నాయకుల పిల్లలంతా విదేశాల్లో హాయిగా చదవుకుంటా వుంటారు. తిరుపతి గాడి లాంటి కుర్రాళ్లంతా మతం మత్తంతా తలకెక్కి.. ఎర్రెక్కి కొట్లాటలకి ఇట్టా వీధిన పడి జీవితాలు నడీథి పాలు చేస్కుంటారు.

ఎందుకో పఠాను గాడి వంక చూసాను. పఠాను గాడు అలసిన కళ్లతో, ఆడి తమ్ముడు రెహ్మాను అమాయకపు కళ్లతో అట్టనే కూచోనున్నారు.

విషయం అనుకున్నంత చిన్నదేం కాదు. చుట్టూ అందుతున్న ఊతంతో ద్వేషం విత్తు ఎదిగి దేశ యువత మనసుల్లో మర్రిచెట్టులా ఊడలు దిగింది. ఈడ కూడా దీని విషపు పిలకలు మొలిచి చిన్నచిన్నగా పైకి అవుపిస్తున్నాయి. దీని వేర్లు దేశమంతా వేగంగా పాకుతున్నయ్యి.

మనసుల్లో ముగింపు పలకలేని సమస్య పెద్దెత్తున మొదలయ్యేటట్టే వుంది. కాదు.. మొదలయ్యింది. కొంతమంది మదుసుల కాళ్ల కింద నేల కదిలిపోతా వుంది.

అది.. ఇప్పుడు.. పఠాను కాళ్ల కిందకి..

బిట్టూ కాళ్ల కిందకి.. వచ్చేసింది.

....

నా కాళ్ల కింద నేల కూడా... కదిలిపోతా వుంది.

ఏం చెయ్యను?

■

## కొలువుదీరని కొలువు!

నీళ్ళు, నిధులేమోగని
నియామకాల కోసమే నిలువెల్లా కాలిపోయినం
నినాదాల మోత మోగించి లాఠీలతో కోలాటమాడినం!
స్వరాష్ట్రంలోనే పని చేస్తామంటూ
ఖాకీ టోపీలు పక్కన పెట్టినం
పూటకో మాటతో ఏమారుస్తూ
మాతోటే మనోళ్ళని కొట్టిస్తుంటే
సర్వీసు తుపాకీతో గురిపెట్టుకున్నాం

ఉమ్మడి పాలకులు మమ్ముల తొవ్వ తప్పించాలని
నోటిఫికేషన్ల జాతర జేస్తే ఉద్యమానికే జైకొట్టినం
ప్రత్యేక పాలనకే హఠం జేసినం!

మన చేన్ల స్వరాజ్య మొక్క మొలిస్తే
మా బత్కులు బాగైతయని సంబరవడ్డం
బంగారు పువ్వులు బాగా పూస్తయని
బంగారు పురుగులెక్క మురిసినం
ఉద్యోగ కాయలు విరగ్గాస్తయని
ఉమ్మెత్తకాయలెక్క ఉబ్బిపోయినం
గొంగలి పురుగు బత్కు పోయి
సీతాకోక చిలుకలమైతమనుకున్నాం
ఉద్యోగ ప్రకటనలు లేక కరువు పనిల కూలీలమైనం
హమాలీలమై ఆకలి బస్తాలెత్తినం
గొర్లు, బర్లతో పోర్లాడుతున్నాం
అప్పుల రక్కసితో పోరాడుతున్నాం
ఖాళీల లెక్క తేల్చలేక ఏండ్లకేండ్లు నాన్చుడు
అదేమన్న కాకుల లెక్కనా, కారడివిలో చీమల లెక్కనా?
తలాతోక లేని తతంగమా! కాలాయాపన కుతంత్రమా?

కొత్త పొద్దు పొడ్సినంక నౌకరీ గంట కొడ్తరని ఆశవడ్డం
పరీక్ష రాయడానికి కొన్న కొత్త కలానికి
సడేసాత్ శని తగిలినట్టుంది
ఏడున్నరేండ్లసంది ఎదురు జూస్తుంది!
కష్టపడి కట్టుకున్న కలల సౌధం
ప్రారంభోత్సవానికి నోచుకోకనే నేలమట్టమైనట్టు...
చేతికందిన పంట కోయకముందే వరద పాలైనట్టు...
తనలో సిరా గడ్డ కట్టుకుంటుందో,
వయసు మరిగి ఆవిరౌతుందోనని
కలం కన్నీరు కార్చుతుంది!

**- గంగాపురం శ్రీనివాస్**




# ఇప్పుడు మౌనంగా ఉంటే ఇక ఎప్పటికీ గొంతెత్తలేం ..!

- ఆర్.విజయ శంకర్
ఫ్రంట్‌లైన్ ఎడిటర్

**స్వా**తంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ముస్లిములను బుజ్జగించడమే విధానంగా కొనసాగిందన్న విమర్శను ఇంతకాలమూ సంఘపరివార్ చేస్తూ వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఇక ఆ విమర్శ లేదు. ఇప్పుడు మెజారిటీ మతస్థుల పెత్తనమే చెల్లుబాటు కావాలన్న విద్వేషపూరిత భావజాలాన్ని ప్రచారం చేసేవారిని బుజ్జగించడం మొదలైంది. ముస్లింలను వెంటాడి వేధించడానికి అనుమతించడం, వారి ప్రార్థనా స్థలాలపై దాడులు చేయడాన్ని సమర్థించడం, వారి ఇళ్ళను బుల్డోజర్లతో నేలమట్టం కావించడం, వారి జీవనోపాధిని దెబ్బ తీయడం, వారి సాంస్కృతిక చిహ్నాలను నాశనం కావించడం, వారి ఆహారపుటలవాట్లపై, వేషభాషలపై దాడి చేయడం ప్రస్తుత విధానంగా కొనసాగుతోంది. ఈ విధమైన విపరీత ధోరణే సంఘపరివారం దృష్టిలో లౌకికతత్వం అంటే ..!

సాంస్కృతిక జాతీయవాదం పేరిట వందేళ్ళ క్రితం మొదలైన ఒక పథకం ఇప్పుడు పరాకాష్టకు చేరింది. 'భిన్నత్వంలో ఏకత్వం' ప్రాతిపదికన భారత భూభాగంలో అందరినీ కలుపుకు పోయే జాతీయవాదాన్ని ఆనాడు స్వాతంత్ర్యోద్యమ నేతలు ఆవిష్కరించారు. దానికి భిన్నమైన భావనతో సంఘ పరివారం ముందుకు సాగుతోంది. ద్విజాతి సిద్ధాంతానికి (హిందువులు ఒక జాతి, ముస్లిములు ఒక జాతి అన్నది ద్విజాతి సిద్ధాంతం) మొదట సైద్ధాంతిక పునాది వేసినవాడు వినాయక దామోదర్ సావర్కార్. మహమ్మద్ ఆలీ జిన్నా ఇదే వాదనను ప్రతిపాదించడానికి రెండు సంవత్సరాలు ముందే సావర్కార్ ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చాడు. 1923లో దేశం అంటే అర్థం ఏమిటో, ఎవరు ఈ దేశానికి చెందుతారో తన అభిప్రాయంగా ఈ విధంగా వివరించాడు:

"ప్రతి హిందువుకూ ఈ భరతభూమి పితృభూమిగా, అదే సమయంలో పుణ్యభూమిగా ఉంది. అందుచేతనే .... ఈ దేశంలోని మహమ్మదీయులు, క్రైస్తవులు.. (వీరు బలవంతంగా హిందూ మతం నుండి వేరే మతాలకు మార్చబడ్డవారే) హిందువులుగా గుర్తింపు పొందలేరు. వారికి ఆ గుర్తింపు ఇవ్వడం కుదరదు. హిందువుల మాదిరిగానే హిందూస్థాన్ వారికి కూడా పితృభూమి అయినప్పటికీ, ఇది వారి పుణ్యభూమిగా లేదు. వారి పుణ్యభూమి ఎక్కడో సుదూరంగా అరేబియాలోనో, పాలస్తీనాలోనో ఉంది."

ఆ తర్వాత అంతకన్నా మొరటు నిర్వచనంతో వచ్చాడు ఎం.ఎస్.గోల్వాల్కర్ : "తన తల్లి కడుపులో ఉండగానే హిందువుకి మొదటి సంస్కారం అబ్బుతుంది. అందుకే మనమంతా హిందువులుగానే పుడతాం. ఇక తక్కినవారి వరకూ చూస్తే, వారంతా ఊరూ, పేరూ లేని మానవులుగానే జన్మిస్తారు. ఆ తర్వాత సున్తీ చేయించుకునో, బాప్టిజం తీసుకునో ముస్లింలుగా గాని క్రైస్తవులుగా గాని అవుతారు. ఆ విధంగా చూసినప్పుడు ఎటువంటి రాజీకీ ఆస్కారమే లేదు."

ఆ తర్వాత వచ్చాడు మోహన్ భగవత్. అతడు ఇలా అంటాడు : "జర్మనీ ఎవరికి చెందుతుంది? జర్మన్లకే చెందుతుంది. బ్రిటన్ బ్రిటిష్ వారికే చెందుతుంది. అమెరికా అమెరికన్లకే చెందుతుంది. అదే విధంగా హిందూస్థాన్ హిందువులకే చెందుతుంది. భారతమాత సంతానం అందరూ హిందువులే. భారతీయ పూర్వీకుల వారసులే. హిందువులంటే భారతీయ సంస్కృతికి అనుగుణంగా (నిజానికి హిందూ సంస్కృతి అన్న అర్థంలో వాడాడు) జీవించేవారు మాత్రమే."

ఈ విధంగా 2014 వరకూ భారతదేశం అంటే తమ దృష్టిలో ఏమిటో వివరిస్తూ వచ్చారు ఆరెస్సెస్ సైద్ధాంతికులు. నిజానికి భారతదేశాన్ని తాము ఏవిధంగా ఊహించుకున్నారో, ఆ రూపంలోకి దేశాన్ని మార్చివేయడమే వారి లక్ష్యం.

ఆ తర్వాత వచ్చాడు నరేంద్రమోడీ. అతనికి సర్వవేళలా

విశ్వసనీయులుగా ఉండే భారతీయ బడా పెట్టుబడిదారులంతా 'అభివృద్ధికి ముద్దుబిడ్డ' అని అతడిని పిలుచుకుంటూ వుంటారు. సంఘపరివారపు వందేళ్ళ కాలంనాటి కలను ఆచరణలో ముందుకు తీసుకుపోడానికి తన కన్నా మొనగాడు వేరే ఎవరూ లేరన్న భావనను ప్రచారం చేసుకున్నాడు మోడీ.

"వేరే ఎవరో కారు నడుపుతున్నారనుకోండి. మనం వెనక సీట్లో కూర్చున్నాం అనుకోండి. కారు చక్రాల కింద ఒక చిన్న కుక్కపిల్ల పడి చచ్చిపోయినా మనకి అది బాధాకరంగా ఉంటుందా? ఉండదా? తప్పకుండా బాధగానే అనిపిస్తుంది. నేను ముఖ్యమంత్రినైనా, కాకపోయినా, నేనూ ఒక మనిషినే. ఎక్కడైనా చెడు జరిగితే దానికి బాధ పడడం సహజం."

ఈ మాటలు అన్నది ఎవరో పెద్దగా సంబంధం లేని వ్యక్తి కాదు. ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ అన్న మాటలివి. కేంద్రంలో అధికారానికి రావాలనుకుంటున్న వ్యక్తి అన్న మాటలివి. తాను అధికారంలో ఉన్న గుజరాత్‌లో ముస్లిముల మీద జరిగిన మారణహోమం గురించి అడిగినప్పుడు మోడీ స్పందించిన తీరు ఇది.

తాను వ్యక్తం చేసిన బాధను ఆ వెంటనే మరపించే విధంగా దాడుల్లో బాధితులై, సహాయ శిబిరాల్లో తల దాచుకుంటున్న ముస్లిముల గురించి వేళాకోళంగా "మేం అయిదుగురైతే, మా పిల్లలు ఏభైమంది" అన్న అపఖ్యాతిగాంచిన వ్యాఖ్యను చేశాడు మోడీ. సహాయ శిబిరాలు సంతానాన్ని ఉత్పత్తి చేసే కేంద్రాలు అన్నట్టు అపహాస్యంగా మాట్లాడాడు.

ఆ తర్వాత వచ్చిన మార్పు ఏమిటి? ముఖ్యమంత్రి కాస్తా ప్రధానమంత్రి అయ్యాడు. కార్లకి బదులు బుల్డోజర్లు వచ్చాయి. తమ ఆగ్రహాన్ని అణచిపెట్టుకున్న "కుక్క పిల్లలు" నిరంతరం భయంతో బతుకుతున్నాయి. అప్రధానమైనది కాస్తా కేంద్ర స్థానంలోకి వచ్చింది. కేంద్ర స్థానంలో ఉండవలసినది కాస్తా పక్కకి పోయింది. న్యాయం కాస్తా దుర్మార్గం అయిపోయింది. దుర్మార్గమే న్యాయం అయింది.

బుల్డోజర్లు తిరుగుతూ వుంటే గౌరవనీయ ప్రధాని మాత్రం మౌనంగా ఉండడానికే నిర్ణయించుకున్నారు. కాషాయ మూకల దాడులు కొనసాగుతూంటే మీడియాలోని కొన్ని సంస్థలు మాత్రం ఆటలో సిక్సర్లకు, బౌండరీలకు చప్పట్లు, కేరింతలు కొట్టడానికి డబ్బు పుచ్చుకునే చీర్‌గర్ల్స్ మాదిరిగా అదే విధంగా హర్షామోదాలు వ్యక్తం చేస్తున్నాయి.

కాని భారతదేశం అంటే ఏమిటో సరిగ్గా అర్థం చేసుకోగలిగినవాళ్ళకు మాత్రం 'మౌనం' ఏ మాత్రమూ పనికిరాదు. ఇప్పుడు గనుక వారు నిలబడి నోరిప్పి మాట్లాడకపోతే,

## మత సీసాలో గత చరిత్ర

సమాచార వాహనాలపై సవారీ చేస్తూ
వాట్సాప్లో ఉపదేశాలిచ్చే మేధావులు
అర్థసత్యాలకు అర్థం కాని ముసుగులు తొడిగి
అక్షరాలకు విద్వేషపు రంగులద్ది గతించిన
చరిత్రను కొత్త సీసాలోకి ఎత్తి పోస్తున్నారు
మతాన్ని అసూయాద్వేషాలు అంగడిగా మార్చి
మనోభావాలతో భావోద్వేగాలతో మల్టీ లెవెల్
మార్కెటింగ్ వ్యాపారం చేస్తూ పదే పదే
ఘజినీ, ఘోరీల కథలను వల్లెవేస్తూ
అజ్ఞానపు మెదళ్ళలో అసత్యాల విత్తులు నాటుతున్నారు
విశ్వాసాలను మతోన్మాదంగా మార్చి
శిథిలాల కింద శివలింగాలున్నా శవాలున్నా
శోభాయాత్రల పేరుతో ఊరేగింపులు జరుపుతూ
ఆధిపత్యం కోసం అశ్వమేధయాగాలను చేస్తూ
మాతృభూమిని మృతభూమిగా మారుస్తున్నారు
కాళ్ళ కింద భూమి పరాయిదయై పోతుందని
వాస్తవం ఏదో తెలియని కలవరింతలతో
మెలుకువలోనూ మనుషులు ఉలిక్కిపడుతున్నారు
మొలకెత్తే ప్రతి ఆలోచనకు అంట్లు కదుతుంటే
ఎదురుపడే ప్రతి వ్యక్తి శత్రువుగా కనిపిస్తున్నాడు!

**- ఈదర శ్రీనివాస రెడ్డి**


భవిష్యత్తులో వారెప్పటికీ మాట్లాడలేరు. నిరసన ఇప్పుడు నిజమైన దేశభక్తియుత చర్య అయింది. (హోవార్డ్ జిన్ అన్న మాటలు ఇవి).


బుల్డోజర్ బాబాల రాజ్యంలో దేశభక్తియుతంగా వ్యవహరించ గలగడం అంత తేలికేమీ కాదు. "శతాబ్దాలుగా పలు రాజ్య వ్యవస్థలు ఈ విధమైన కుయుక్తులు పన్నుతూనే వున్నాయి. ఏ విధమైన నిరసనలనైనా వ్యతిరేకించడమే సరైన ఆలోచనా విధానంగా భావించేలా ప్రజల్ని ప్రభావితం చేసి వత్తిడి చేస్తాయి ఆ శక్తులు" అని పీటర్ సీగర్ అన్నాడు.

అయితే పదార్థ ధర్మాలు అంత తేలికగా పాలకుల వత్తిళ్లను సాగనివ్వవు.

నీటిని గుప్పెట్లో పట్టుకోగలమా?
నిరసనలూ అంతే ...!

■



# పురుష జాతిపై ప్రేమ్‌చంద్ వ్యంగ్య, విషాదాస్త్రం నిర్మల

- కె.ఆంజనేయ కుమార్
94940 53019

ప్రేమ్‌చంద్ (1880–1936) మన దేశంలో ఏర్పడిన అభ్యుదయ రచయితల సంఘం (అరసం)కు ప్రథమ అధ్యక్షుడు. హిందీ ప్రజాసాహిత్యానికి మకుటం లేని మహారాజు ప్రేమ్‌చంద్ యావత్తు సాహిత్యం ప్రజాహిత భావనలో జీవించింది. ప్రాణం పోసుకొని ఊపిరి పీల్చింది. అందుచేత ప్రేమ్‌చంద్ – ప్రజాస్పృహ కల్గిన కళాకారుడు అయ్యాడు. 'ప్రజలే కళకు జీవనాడి' అని లెనిన్ చెప్పింది. మన దేశంలో ప్రేమ్‌చంద్ సాహిత్యంలో నూటికి నూరుపాళ్ళూ నిజం. ఈ మహాసాహితీవేత్త సామాజిక స్పృహ ప్రజా మనస్సుతో కలిసి ఏకీకారమైంది. ప్రజాజీవితం ప్రజా ఉద్యమాన్ని యధాతథంగా వర్ణించిన ప్రజా పక్షపాతి ప్రేమ్‌చంద్.

తన సాహిత్యంలో స్త్రీ సమస్యలను సమగ్రంగా చిత్రీకరించినందుకు ప్రేమ్‌చంద్ శాశ్వతకీర్తిని గడించారు. వ్యధతో మానవాక్రందన విన్పించినప్పుడల్లా ఆయన ప్రజావాద కళా హృదయం స్పందించింది. ఆయన కాలంలోని పతనోన్ముఖ, రాచరికపు సాంప్రదాయాల్లో మగ్గిపోతూ సాంఘిక న్యాయానికి దూరమైన స్త్రీ శాపగ్రస్త జీవితాన్ని ఆయన కరుణ రసాత్మకంగా చిత్రీకరించారు. పురుషాధిక్య సమాజంలో స్త్రీ కనీస మానవాధికారాలకు కూడా నోచుకోకపోవటం, పురుషులు – స్త్రీల న్యాయోచిత ప్రగతిని ఆటంకపర్చడం, ఆర్థిక దాసత్వం ఆమె జీవితానికి ఎలా శాపమయ్యిందో ఆయన కలంలో విశదమయింది. నిర్మల నవల ఇందుకు పరాకాష్ట. ప్రేమ్‌చంద్ యుగంలోనే ఆర్యసమాజం లాంటి సంస్థలు స్త్రీల స్థితిగతులను బాగుపర్చడానికి అనేక సంస్కరణలతో కూడిన ఉద్యమాల్ని ప్రారంభించాయి. కానీ ఈ ఉద్యమాల కంటే ప్రేమ్‌చంద్ దృక్పథం చాలా ముందుకు వెళ్ళింది. పురుషాధిక్యత మొదలు స్త్రీ జాతి అభ్యున్నతికి అడ్డొచ్చే ప్రతి ఒక్క దురాచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

'నిర్మల' నవలలో వరకట్నం, అందువల్ల ఉత్పన్నమైన వివిధ చెడు పరిణామాలని చిత్రీకరణకు ఆయన అధిక ప్రాధాన్యతనిచ్చారు. వివాహం ఒక వ్యాపారం ఎలా అయ్యిందో ఆయన భాల్ చంద్రసిన్హా పాత్ర ద్వారా పలికించాడు. నిర్మల తండ్రి  ఉన్నప్పుడు 'కట్నమే' అక్కర్లేదని చెప్పి నిర్మల తండ్రి వకీలు ఉదయభాను లాల్ చనిపోగానే 'ఈ సంబంధం చేసుకోము. మరోచోట పదివేలు రొక్కం ఇస్తున్నప్పుడు ఈ సంబంధమే ఎందుకు చేసుకుంటాను? వకీలు గారు బతికివుంటే సిగ్గుపడుతూనే కట్నం వద్దన్నా పదిహేను వేలు, ఇరవై  వేలు ఇచ్చేవాడు. ఇప్పుడక్కడ ఏం వుంది?' అని నిర్మల సంబంధాన్ని తిరస్కరిస్తారు. నిర్మలకు పదిహేనో సంవత్సరం. ఆమె తల్లి  కళ్యాణి. తండ్రి ఉదయభాను లాల్ ఆమెకు భాల్‌చంద్ర సిన్హా పెద్ద కుమారుడు, భువన్ మోహన్ సిన్హాతో పెళ్ళి నిశ్చయం చేసి పెళ్ళి పనుల్లో ఉండగా చనిపోతాడు. తల్లి కళ్యాణికి కూతుళ్ళ కన్నా కొడుకులు ఎక్కువ. ప్రియమైన వాళ్ళు. కొడుకులు దుక్కిటెద్దులు. పొట్టు, తెలకపిండి మొదలైన వాటి మీద మొదటి హక్కు వాటిదే. అవి తిన్న తర్వాత మిగిలిన అడుగూ బొడుగూ ఆవులది. ఇల్లు వుంది. కొంత రొక్కం వుంది. కొన్ని వేల రూపాయల విలువ చేసే నగలున్నాయి. కొడుకులను చదివించాలి. ఇప్పుడు నిర్మల పెళ్ళి చేస్తే నాలుగైదు సంవత్సరాల్లో మరో

అమ్మాయి కృష్ణ పెళ్ళికి తయారవుతుంది. అందుచేత ఆమె పెద్ద మొత్తం కట్నం ఇవ్వలేకుండా ఉంది. చివరకు మగ పిల్లలకు కూడా కొంచెం మిగల్చాలి అని ఆలోచిస్తుంది. 'ఒక వెయ్యి రూపాయల దగ్గర వెనకాడవద్దు. ప్రెస్సులో పనిచేసే కుర్రాడు రత్నం లాంటివాడు. అతడికిచ్చి చేస్తే నిర్మల జీవితం సఫలం అవుతుంది. అందంలోనూ, గుణంలోనూ అమ్మాయికి తగినవాడు' అని పురోహితుడు మోటేరామ్ అంటారు.

'ఆ భగవంతుడిని స్మరిస్తూ అసలు కట్నం ఇవ్వక్కరలేని వకీలు మున్షీతోతారావ్ గారికి తిలకం దిద్దిరండి. వయసు కొంచెం ఎక్కువనిపిస్తుంది. కానీ చావటం, బతకటం భగవంతుని చేతిలో వుంది. ముప్పయి అయిదు సంవత్సరాల వయస్సు గల వ్యక్తిని ముసలివాడని ఎవరూ అనరు. అమ్మాయి జీవితంలో సుఖం రాసి పెట్టి ఉంటే ఆమె ఏ ఇంటికి వెళ్ళినా సుఖపడుతుంది. దు:ఖం రాసిపెట్టి ఉంటే ఏ ఇంటి కోడలిగా వెళ్ళినా దు:ఖం అనుభవిస్తుంది. మన నిర్మలకు పిల్లలంటే మహా ప్రేమ. అతనికున్న ముగ్గురు బిడ్డలను తన బిడ్డలుగా భావిస్తుంది. మీరు శుభ ముహూర్తం చూసి తిలకం దిద్దిరండి' అని కళ్యాణి అంటుంది. నిర్మలకు పెళ్ళయ్యింది. అత్తగారింటికి వచ్చింది. భర్త మున్షీతోతారామ్ నల్లగా, లావుగా వుంటాడు. వయస్సు నలభై కన్న మించి వుండదు. న్యాయవాద వృత్తిలో కఠినమైన శ్రమ చేస్తున్న కారణంగా తలవెంట్రుకలు అక్కడక్కడా నెరిసిపోయాయి. వ్యాయామం చెయ్యడానికి తీరిక లేకపోవడం చేత చేసేవాడు కాదు. పొట్ట పెరిగింది. అజీర్ణ వ్యాధి, మొలల వ్యాధి ఆయన్ని అంటిపెట్టుకునే ఉంటున్నాయి. ఆయన ముగ్గురు కొడుకుల్లో పెద్దవాడు మన్సారామ్ పదహారేళ్ళ వాడు. రెండవవాడు జియారావ్ పదకొండేళ్ళ వాడు. మూడవ వాడు సియారామ్ ఏడేళ్ళ వాడు. ఇంట్లో వకీలు గారి అక్క వితంతువు రుక్మిణిదే ఇంటిపెత్తనం. ఆమే తమ్ముడి దగ్గరే పడి వుంటుంది.

నిర్మలకు తారసపడే ప్రతి పురుష పాత్ర ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆమెకు కీడుచేస్తూనే వుంటుంది. 1.భర్త, 2.భర్త పిల్లలు ముగ్గురు మగవాళ్ళు 3. స్నేహితులు సుధ భర్త డాక్టర్ భువన్‌సిన్హ (తండ్రి చనిపోవటం వల్ల తప్పిపోయిన సంబంధంలోని వరుడు)

ప్రేమ్‌చంద్ తన అద్భుతమైన, అనితర సాధ్యమైన వ్యంగ్యంతో ఈ నవలలోని ప్రతి పురుష పాత్రనీ తూర్పారాపడతారు. నిర్మల తన భర్త తోతారామ్ సరసన కూర్చోవడానికి, ఆయనతో నవ్వుతూ మనసు విప్పి మాట్లాడటానికి సంకోచిస్తూ వుంది. బహుశా అందుకు కారణం మొన్నటి వరకూ అదే వయస్సులో వున్న వ్యక్తి ఆమెకు తండ్రిగా ఉండేవాడు అని రచయిత వర్ణిస్తారు. 'ప్రభాత సమీరం స్పృశిస్తేనే మొగ్గ వికసిస్తుంది. ఆ రెండింటిలో సమానమైన ప్రేరణ వుంది. అయితే నిర్మలకు ఆ ప్రభాత సమీరమేదీ?' ఈ వర్ణనలోని వ్యంగ్యం, విషాదం ఈ నవలంతా అనేక సార్లు రచయిత కసికొద్దీ కొనసాగిస్తారు.

నిర్మల వస్త్రాభరణాలను అలంకరించుకొని నిలువుటద్దం ముందు నిలబడి, అందులో తన అందాన్ని చూసుకొనేది. అప్పుడు ఆమె హృదయంలో తృష్ణతో కూడిన కోర్కె చెలరేగేది. ఆమె విలవిలలాడిపోయేది. ఆమె హృదయంలో ఒక జ్వాల విజృంభించేది. ఈ ఇంటికి నిప్పు పెడదామా? అనిపించేది. తన తల్లి మీద కోపం వచ్చేది. పాపం నిర్దోషి అయిన తోతారామ్ మీద మరింత కోపం వచ్చేది. వీరుడైన రౌతు నడచి వెళ్ళవలసి వచ్చినా సరే బరువులాగే బండి గుర్రం మీద మాత్రం స్వారీ చేయడానికి ఇష్టపడడు. నిర్మల పరిస్థితి అలాగే వుంది. ఆమె ఆయన మీద స్వారీ చేస్తూ ఎగిరిపోవాలనుకొంటూ వుంది. ఆ విద్యుత్ వేగంలో ఉన్న ఉల్లాసాన్ని, ఆనందాన్ని అనుభవించాలనుకొంటున్నది. కానీ మాటిమాటికీ సకిలిస్తూ చెవులు నిక్కించే మట్టసపు గుర్రం మీద ఆమెకేమి ఆశ వుంటుంది?' ప్రేమ్‌చంద్ వర్ణనలు నిర్మల యధార్థ జీవితాన్ని మన కన్నులకు బొమ్మ కడతాయి.

తోతారామ్ మిత్రుడు నయన్ సుఖరామ్ ఒక సలహా ఇస్తాడు. 'కొంచెం నీ రూపాన్ని మెరుగుపరుచుకో. ప్రస్తుతం ఇక్కడికి కరెంటు డాక్టర్ గారు వచ్చారు. ఆయన ముసలితనపు లక్షణాలన్నిటినీ మాపు చేస్తారు. ముఖం మీద ఒక్క ముడత కన్పించదు. తలలో తెల్లబడిన వెంట్రుక ఒక్కటి కూడా కనబడదు. ఆయన ఏం మంత్రం పెడతాడో కానీ మనిషి శరీరమే మారిపోతుంది. 'కానీ తోతారామ్ ఫీజు ఐదొందల రూపాయలు. చాలా పెద్ద మొత్తం' అని తిరస్కరిస్తాడు. నిర్మల, తోతారామ్... ఇద్దరి ఆకారాల్లో ఎంత అంతరం ఉంది? ఒకటి రత్నాలు పొదిగిన విశాలమైన భవనం. రెండవది గత వైభవానికి గుర్తుగా ఉన్న శిథిలావశేషం. ప్రేమ్‌చంద్‌లో మహాకవి కూడా ఉన్నాడు కదూ!

తోతారామ్ పెద్ద కొడుకు మన్సారామ్ మొదట్లో నిర్మల దగ్గరకు రావడానికి సంకోచిస్తూ ఉండేవాడు. తరువాత అతడు కూడా అప్పుడప్పుడూ వచ్చి కూర్చొంటూ వుండేవాడు. అతడు నిర్మల వయస్సులో వున్నాడు. తన బిడ్డల్ని ఎంతో ప్రేమిస్తున్నానని భర్తకు చూపించదలచుకున్నది. అది కృత్రిమమైన ప్రేమ కాదు. ఆమె ఆ బిడ్డలను వాస్తవంగానే

ప్రేమిస్తున్నది. తోతారామ్‌కు ఒక అనుమానం వుంది. 'పడుచువాళ్ళు... పడుచువాళ్ళనే ఇష్టపడతారు' అని. నిర్మల మన్సారామ్ దగ్గర ఇంగ్లీషు నేర్చుకుంటూ వుంది. ఈ విషయం తెలియగానే వకీలు గారికి ద్వేషం పెరిగిపోయింది. పూర్వం నిర్మల ఇంతగా అలంకరించుకొనేది కాదు. ఇంతగా ముస్తాబయ్యేది కాదు. ఇప్పుడు ఈ స్వరూపం పూర్తిగా మారిపోయినట్లుగా భావిస్తూ ఆ క్షణంలోనే మన్సారామ్‌ను ఇంటినుంచి వెళ్ళగొట్టాలన్నంత కోపం వచ్చి తోతారామ్ అందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తాడు.

నిర్మల ఎంత వేడుకున్నా, వినకుండా తోతారామ్, మన్సారామ్‌ను బోర్డింగ్ హౌస్‌లో వుంచాలని నిశ్చయించుకున్న దగ్గర నుంచీ ఆమె మన్సారామ్ దగ్గర చదువుకోవడం మానివేసింది. ఆమెకు భర్త అనుమానపడుతున్నట్లుగా కొంచెం కొంచెం సూచనలు లభిస్తున్నాయి. అతడి అనుమాన స్వభావాన్ని తలచుకొని ఆమె అనేక రోజులు రోదిస్తూనే వుంది. అతడితో నవ్వుతూ మాట్లాడడం ఈ అనుమానికి కారణమా? ప్రతి ప్రాణికి తన సమ వయస్కులతో నవ్వుతూ మాట్లాడాలనే ప్రకృతి సిద్ధమైన తృష్ణ వుంటుంది. హాస్టల్‌లో చేరిన మన్సారామ్ నిద్రాహారాలు మాని ఏడుస్తున్నాడని తెలిసి కన్నబిడ్డ బావిలో పడిన కబురు విన్న తల్లిలాగా నిర్మల మధనపడుతుంది.

నిర్మల స్థితి రెక్కలు విరిగిన పక్షి మాదిరి అయ్యింది. పాము తన వైపుకు రావడం చూసి పక్షి ఎగురుదామనుకొంటుంది. కాని ఎగరలేదు. ఎగరబోయి కిందపడిపోతుంది. రెక్కలు తటతటలాడిస్తూ వుండిపోతుంది. ఆమె తన కళ్ళతో మన్సారామ్ మానసిక వేదన చూడలేకపోతుంది. మన్సారామ్ వంటి మంచి మనసు గల, సాహసం గల యువకుని మీద ఈ అపనింద ప్రభావం ఎలా వుండగలదో ఊహించుకుంటేనే ఆమె గజగజా వణికిపోతుంది. మన్సారామ్‌ను రక్షించడం కోసం ఆమె ఆత్రపడుతూ వుంది. ఆమె సంకోచాన్ని, సిగ్గునూ విడిచేయాలనే నిశ్చయించుకుంది. ఆస్పత్రిలో చావు బతుకుల్లో వున్న సియారామ్‌కు తన రక్తాన్ని ఇవ్వడానికి సిద్ధమైంది. ఆమె రక్తంతో మన్సారామ్ ప్రాణాలు దక్కడానికి తన రక్తం చివరిబొట్టుదాకా ఇవ్వడానికి సిద్ధంగా వుంది.

నిర్మల ఆస్పత్రికి చేరింది. భర్త అడిగాడు : 'నీవు ఇక్కడికి ఏం చేయడానికి వచ్చావు?'

నిర్మల స్పష్టంగా అడిగింది : 'మీరు ఇక్కడ ఏం చేయడానికి వచ్చారు?'

మంచం మీది నుంచి కదలలేని మన్సారామ్ లేచి నిలబడ్డాడు. 'మీ వయస్సు నా కన్నా ఎక్కువ లేకపోయిన్నటికీ మీరు నా తల్లిస్థానంలో వున్నారు. ఇక మాట్లాడలేను అమ్మగారూ. క్షమించండి! ఇది అంతిమ దర్శనం' అని నిర్మల పాదాల మీద పడి ఏడుస్తూ అన్నాడు. నిర్మల నిర్దోషి అని తోతారామ్ విశ్వసించాడు. కానీ ఎప్పుడు? చేతుల్లోనుంచి బాణం దూసుకుపోయిన తర్వాత? అని ప్రేమ్‌చంద్ పురుషజాతిని నిర్దాక్షిణ్యంగా వ్యంగ్యంగా విమర్శిస్తారు.

తర్వాత రెండో కొడుకు జియారామ్ మొండిగా తయారై, ఇంట్లోనే దొంగతనం చేస్తే తెలిసి కూడా నిర్మల విషయం బైటపెట్టదు. కానీ తోతారామ్ పోలీసులకు ఫిర్యాదు చేసి తన కొడుకే దోషి అని తెలిసి మళ్ళీ కేసు మాఫీ చేయడానికి ఇన్‌స్పెక్టర్‌కి వకీలైన తనే లంచం ఇస్తాడు. ఇక్కడ న్యాయవ్యవస్థ, రక్షణ వ్యవస్థలోని లోపాలను, దోషాలను, అవినీతిని రచయిత చీల్చి చెండాడతాడు. తను దొరికిపోతానని తెలిసి జియారామ్ ఆత్మహత్య చేసుకోవడంతో నిర్మల మనసు కకావికలమవుతుంది.

నిర్మలకు ఆడపిల్ల ఆశ పుట్టేటప్పటికి వృద్ధుడైన తోతారామ్ ఇద్దరు మగబిడ్డలను కోల్పోయి విరక్తితో నిస్తేజుడైపోయి లాయర్ ప్రాక్టీసు లేక ఆర్థికంగా కుదేలైపోతాడు. నిర్మల మనసు బండబారిపోయి తన కూతురు కోసం ఎంతో కొంత పొదుపు చేయాలనుకుంటుంది. అప్పుడే మూడవ కొడుకు సియారామ్ ఇల్లు వదిలి సాధువుల మాయలో పడి దూరతీరాలకు వెళ్ళిపోతాడు. తోతారామ్ కొడుకును వెతుక్కుంటూ బయల్దేరతాడు. నిర్మల ఒంటరిదైపోతుంది. ఇలా ప్రతి పురుషపాత్ర ఆమెను వేధిస్తూనే వుంటుంది. చివరలో తన ప్రాణ స్నేహితురాలు సుధ భర్త డాక్టర్ భానుసిన్హా తన ఎడల అసభ్యంగా ప్రవర్తించాడని తాను చెప్పకపోయినా తన స్నేహితురాలు తెలుసుకొని భర్తను మందలించేటప్పటికీ అవమానంతో డాక్టర్ ప్రాణత్యాగం చేస్తాడు. తన వల్లే తన స్నేహితురాలు భర్తను కోల్పోయి అనాథ అయిపోయిందని నిర్మల నిలువునా కూలిపోతుంది. తన ప్రమేయం లేకపోయినా, తను మంచి చేద్దామనుకున్నా ఇలా ప్రతి పురుష పాత్ర ఆమెను ప్రత్యక్షంగా, పరోక్షంగా వేధించి ఆమె మరణానికి కారణం కావడాన్ని ప్రేమ్‌చంద్ ఎంతో వ్యంగ్యంలో విషాద అస్త్రంతో పురుషజాతిని ఈ నవలలో చీల్చి చెండాడాడు.

■

కవిత

# వెండి పువ్వు

**రా**త్రంతా యథేచ్ఛగా
కురులు విప్పార్చుకున్న చీకటి
తెల్లవారుతోందన్న తొందరలో
తిరిగి ముడుచుకుంటుంటే
కొమ్మ చాటునున్న పక్షులు
కొసరి కొసరి సంగీతాన్ని వడ్డిస్తున్నాయి

వేకువ రేఖల వేడుకను పసిగట్టిన
పల్లెతల్లి గొంతుక
అప్పటికప్పుడు సుప్రభాతాల సుధలు
ఏకధాటిగా వర్షిస్తోంది


వాకిటి వసంతానికి
ఊపిరులూదాలనే పట్టుదలతో
ధూళి రేణువులను
తలవాకిలి వరకు తరుముతోంది చీపురు

కంకణ కింకిణీ కథలు విందామని కాబోలు
కల్లాపిజల్లి ముగ్గుల మొగ్గలై
తన ముందు నిలబడమంటుంది తులసమ్మ

ఇవన్నీ చూస్తూ
విస్తుపోయిన రైతన్న
నల్లరేగడి మీద చల్లని గాలిలో
నాగలి కవిత్వం రాసుకుంటున్నాడు

అతని వెంట
పసుపుకొమ్ములు ఏరుతున్న ధర్మపత్ని లాగా
నాగటి చాలులో తన ఆహారాన్ని
ముద్దు ముద్దుగా
ముక్కుతో వెతుక్కుంటుంది కొంగమ్మ

దూపరొట్టె తీసుకొచ్చిన వేళ
నాగలి నిలబెడితే....
నెమరువేసుకుంటున్న దుక్కిటెద్దు కొమ్ము మీద
నిలబడినప్పుడు ఆ కొక్కెరమ్మే
రంగులొలికే ఒక ఆకర్షక పత్రం



ఇక తమను వేధించే జీవులను
తోకతో తొలగించుకోలేక
ఆపసోపాలు పడుతున్న పశుజాతి వీపు మీద
అటూ ఇటూ విహరిస్తూ
నేనున్నానంటూ భరోసానిచ్చే ఆపన్నహస్తం


పొలం గట్టు మీద ఆకుపచ్చని జెండాలా
ఎగురుతున్న చెట్టు మీద ముత్యపుటుంగరంలా
వాలిపోయినప్పుడు
అది నీటి జాడను తెలిపే జియోలాజికల్ సర్వేయర్

పొట్ట చేతపట్టుకుని
ఆకాశమార్గాన వలస పేరిట అడుగులు వేస్తున్నప్పుడు
తదేకంగా చూసే పసిపిల్లల గోరుమీద
వెండి పువ్వై వెలుగులీనే తీపి జ్ఞాపకం

రైతన్న చేయి చలవతో
నేలతల్లి దాహం తీర్చుకునే వేళ
వేరు పురుగులను వెతికి పట్టుకోవడంలో
సిద్ధహస్తురాలినని
స్వామి కార్యానికి దిగి సహకరిస్తుంది

అందరి దృష్టిలో... అది కొలను ఒడ్డున నిలబడి
చేపలను మింగజూసే మోసగత్తె అయితే కావొచ్చు
కానీ, పొలం పనులు చేసే
అన్నదాతకు సహకరించడంలో మాత్రం
ధర్మపత్నిత్వమే తనది!

**- కమలేశ్**
**91603 96596**





# అద్దేపల్లి సాహిత్యంపై శాస్త్రీయ పరిశోధన

- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
91826 85231

**సా**హితీ మిత్రులు డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య ఇప్పటికే ప్రఖ్యాతి పొందిన సాహితీవేత్త. పద్యాన్నీ, మంచి సాహిత్యాన్నీ తాను ఇష్టపడ్డమే కాకుండా, మరికొంతమందికి దాన్ని చేర్చాలనుకునే స్వభావం గల సహృదయుడు. 'డా.అద్దేపల్లి రామమోహనరావు కవితా ప్రస్థానం – అధ్యయనం' అనే పేరుతో చేసిన పరిశోధనకు మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. అద్దేపల్లి రామమోహనరావు గారు నాకు బాగా తెలుసు. ఆయన గజల్ పాడుతుంటే పారవశ్యంలో మునిగిపోయేవాళ్ళం. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 17, 18 సెప్టెంబరు 2009లో 'తెలుగు సాహిత్య విమర్శ: నేటి ధోరణులు' పేరుతో రెండురోజుల పాటు ఒక జాతీయ సదస్సుని నిర్వహించాను. ఈ సదస్సులో డా.అద్దేపల్లి పాల్గొని మార్క్సిస్టు సాహిత్య విమర్శపై ఒక పత్రాన్ని సమర్పించారు. తర్వాత రోజున ఆయన తన బాల్యం గురించి పాడిన గజల్ శ్రోతలందరినీ ఉర్రూతలూగించింది. ఆయన ఎంతోమంది యువసాహితీకారులను ప్రోత్సహించారు. అడిగినవారికి లేదనకుండా ఆధునిక సాహిత్యంలో వస్తున్న అనేక రూపాల్ని ప్రోత్సహిస్తూ ముందుమాటలు రాశారు. అలాంటి గొప్ప సాహితీవేత్తపై వెంకటప్పయ్య గారు ఈ సిద్ధాంత గ్రంథాన్ని ప్రెసిడెన్సీ కళాశాల, చెన్నై, తెలుగు శాఖలో అధ్యాపకులుగా పనిచేస్తున్న డా.ఎన్. ఎలిజబెత్ జయకుమారి గారి పర్యవేక్షణలో పూర్తిచేశారు. ఈ సిద్ధాంత గ్రంథాన్ని ఆసాంతం చదివి ఎంతగానో సంతోషించాను.

పరిశోధకుడు డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య గారు తన సిద్ధాంత గ్రంథానికి శీర్షికను అర్థవంతంగా, వివరణాత్మకంగా, స్పష్టంగా పెట్టుకున్నారు. సమకాలీన తెలుగు సాహిత్యంలో డా.అద్దేపల్లి రామమోహనరావుగారికున్న విశిష్టమైన స్థానాన్ని వివరిస్తూనే ... ఆయన పద్య, వచన కవిత్వాన్ని విస్తృతంగానే రాసిన విషయాన్ని సంక్షిప్తంగా, సమగ్రంగా, సాధికారికంగా పరిశోధకుడు వివరించారు. సాహిత్య విమర్శకుడుగా కూడా రామమోహనరావు ఎంతో ప్రఖ్యాతులు. ఆయన గురించి పరిశోధన చేయడానికి అనేక పార్శ్వాలున్నాయి. అందువల్ల పరిశోధకుడు టేకుమళ్ళ వెంకటప్పయ్య గారు తెలుగు సాహితీవేత్తల్లో ఒక ముఖ్యుడైన డా.అద్దేపల్లి రామమోహనరావు గారి కవిత్వం గురించి అధ్యయనం చేయడం సరైన సమయం లో సరైన అంశాన్ని స్వీకరించినట్లుగా భావించవచ్చు. పరిశోధకుడు ముందుగానే స్పష్టంగా తన పరిశోధన సమస్యను, పరిశోధనాంశాన్ని వివరించి, లక్ష్యాలను, ఆశయాలను, పరిశోధనలో తాను అనుసరిస్తున్న పద్ధతిని స్పష్టంగా వివరించారు. దానికి తగిన విధంగా సమాచారాన్ని సేకరించి, ఆ సమాచారాన్ని వివిధ విమర్శనాంశాలతో విశ్లేషించారు. సాహిత్యంలో ఉపయోగించే వాఙ్మయ పరిశోధన పద్ధతిని తన సిద్ధాంతగ్రంథంలో ఉపయోగించారు.

గతంలో ఈ అంశంలో ఎవరైనా పరిశోధనలు చేశారో లేదో కూడా తన సిద్ధాంత గ్రంథంలో స్పష్టంగానే చెప్పి, తాను చేస్తున్న పరిశోధనాంశాన్ని ఎవరూ చేయలేదని నిర్ధారించుకొని, తన పరిశోధనాంశాన్ని వివరించి, దాని పరిధి, పరిమితులను ముందుగానే ప్రకటించడం పరిశోధకుని సత్యనిష్ఠను తెలియజేస్తుంది. ఆ విధంగా పూర్వ పరిశోధనల సమీక్షను కూడా చేసినట్లయింది.

డా.అద్దేపల్లి రామమోహనరావు గారి 13 వచన కవిత్వ గ్రంథాల్లో నాలుగు రచనలను మాత్రమే తన పరిశోధనకు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. తన సిద్ధాంత గ్రంథాన్ని ఒక క్రమపద్ధతిలో అధ్యయనం చేయడానికి వీలుగా ఆరు అధ్యా

యాలుగా విభజించుకున్నారు. మొదటి అధ్యాయంలో డా.అద్దేపల్లి రామమోహనరావు గారి జీవితం, రచనలు, సాధించిన పురస్కారాలు, తెలుగు సాహిత్యంలో ఆయనకు గల స్థానాన్ని పరిచయం చేశారు. రెండవ అధ్యాయంలో కవిత్వ స్థితిగతులు, సిద్ధాంతాలు, సాహిత్యంలో కనిపిస్తున్న సమకాలీన ధోరణులు, వాదాలు పేర్కొని, డా.అద్దేపల్లి రామమోహనరావు గారి కవిత్వాన్ని సమన్వయించడానికి ఒక సైద్ధాంతిక పునాదిని ఏర్పాటు చేసుకున్నారు. మూడవ అధ్యాయంలో డా.అద్దేపల్లి రామమోహనరావు గారు రాసిన 'అంతర్జ్వాల' కవితాసంపుటిలో గల సుమారు 51 కవితా ఖండికలను విశ్లేషించారు. నాల్గవ అధ్యాయంలో 'మెరుపు పువ్వు' దీర్ఘకవితను, ఐదో అధ్యాయంలో 'సంఘం శరణం, గచ్ఛామి' వచన కవితా నాటకాన్ని, ఆరో అధ్యాయంలో 'అల్లూరి సీతారామరాజు' వచన కథాకావ్యాన్ని విశ్లేషించారు. సిద్ధాంత గ్రంథానికి చివరిలో రెండు అనుబంధాలను పెట్టి, మొదటి అనుబంధంలో డా.అద్దేపల్లి రామమోహనరావు గారి కుమారుడు, సాహితీవేత్త అద్దేపల్లి ప్రభు, భార్య శ్రీమతి అన్నపూర్ణ గార్ల ముఖాముఖీలను పెట్టారు. రెండవ అనుబంధంలో డా.అద్దేపల్లి రామమోహనరావు గారి వివిధ ఛాయా చిత్రాలు పెట్టారు. సిద్ధాంత గ్రంథాన్ని మళ్ళీ నా మాటల్లో చెప్పవలసిన పనిలేదు. కానీ దీనిలోని కొన్ని ముఖ్యాంశాలను ప్రస్తావించడం ద్వారా, పరిశోధకుని ప్రత్యేకత తెలుస్తుందని భావిస్తున్నాను.

సిద్ధాంత గ్రంథానికి కావలసిన సమాచారాన్ని ఉపయోగిస్తూ లోతైన విశ్లేషణతో కొనసాగించారు. జీవిత విషయాలను, కవిత్వ సిద్ధాంతాలను వివరించడంలో కూడా పూర్వ విషయాలే అయినా, తన ముద్ర స్పష్టంగా కనిపించేటట్లు పరిశోధకుడు అవసరమైన విషయాలనే రాయడం ఒక చెప్పుకోదగిన విశేషం. ఉదా : డా. అద్దేపల్లి రామమోహనరావు గారు 1936 సెప్టెంబరు 6 వ తేదీన జన్మించి, 2016 జనవరి 14వ తేదీన మరణించారు. సుమారు 80 సంవత్సరాలు జీవించారు. ఈ కాలాన్ని పరిశోధకుడు డా. అద్దేపల్లి రామమోహనరావు గారి జీవితాన్ని కవిగా 55 సంవత్సరాలు, ఉపన్యాసకునిగా 52 సంవత్సరాలు, సుమారు 64 సంవత్సరాల పాటు సాహిత్య జీవితం గడిపినట్లు, 60 సంవత్సరాల పాటు నియమబద్ధమైన వైవాహిక జీవితాన్ని జీవించారని వింగడించడం పరిశోధకుని ముద్ర స్పష్టంగా కనిపించేటట్లు చేస్తోంది.

సమాజాన్ని లోతుగా పరిశీలించడంలో Micro Level Poet గాను, సమాజం పురోగమించాలనే ఆలోచన స్థాయిలో ఒక పురోగమన తాత్త్వికుడిగా Macro Level Poet గాను డా.అద్దేపల్లి రామమోహనరావుగార్ని పరిశోధకుడు అభివర్ణించడం ఒక కొత్త సమన్వయం. డా.అద్దేపల్లి రామమోహనరావు అన్ని ఉద్యమాలతోనూ మమేకమైనా, దేనిలోనూ ఒక ప్రత్యేక ముద్ర పడకుండా సమకాలీన సమాజాన్ని తన కవిత్వంలో ప్రతిఫలించేలా చేశారనే విశ్లేషణ పరిశోధకుని లోతైన, శాస్త్రీయ విశ్లేషణకు నిదర్శనం. విశ్వనాథ సత్యనారాయణ గారి విమర్శశైలినీ, తిలక్ అభివ్యక్తినీ, కుందుర్తి సామాజికతనీ అభిమానించినా, తనదైన ప్రత్యేకతను మాత్రం డా. అద్దేపల్లి నిలుపుకుంటూ సమాజ అభ్యుదయాన్ని ఆకాంక్షిస్తూ పద్యం కంటే వచన కవిత్వం వైపే తన పయనాన్ని కొనసాగించారని పరిశోధకుడు తార్కికంగా నిరూపించడం అభినందనీయం. డా.అద్దేపల్లి గారి కవిత్వంలో కనిపించే వస్తు తత్త్వాన్ని మాత్రమే కాకుండా రూప తత్వాన్ని కూడా వివిధ సాహిత్య విమర్శన పద్ధతులతో సమన్వయించి, కవిత్వాన్ని శిల్పపరంగా కూడా మూల్యాంకనం చేయడం ద్వారా విలువల నిర్ధారణ చేయవచ్చునని సోదాహరణంగా పరిశోధకుడు నిరూపించే ప్రయత్నం కనిపిస్తుంది. పరిశోధన చేస్తున్న పరిశోధకులు ఇటువంటి విషయాల్ని నిశితంగా పరిశీలిస్తూ పాటించాలి.

తెలుగు సాహిత్యంలో డా.అద్దేపల్లి రామమోహనరావు గారు ఎంతో ప్రసిద్ధులు. అటువంటి సాహితీవేత్తపై పరిశోధన చేసేటప్పుడు పరిశోధకుడు సమర్థుడు కాకపోతే, ప్రశంసలతోనే సిద్ధాంత గ్రంథమంతా నిండిపోతుంది. కానీ, పరిశోధకుడు కవి జీవిత సమన్వయ పరిశోధన పద్ధతిలో చక్కని సమన్వయాన్ని చేశారు. డా. అద్దేపల్లి రామమోహనరావు వ్యక్తిగా ఎంత సహృదయుడో, ఆయన రాసిన సాహిత్యం సమాజానికి అంతే సహృదయతను ఆకాంక్షిస్తున్న తీరుని, ఆచరణను తనదైన లోతైన విశ్లేషణతో శాస్త్రీయ పద్ధతుల్లో సిద్ధాంత గ్రంథాన్ని రాయడం చాలా బాగుంది. ఈ సిద్ధాంత గ్రంథం డా. అద్దేపల్లి రామమోహనరావు జీవితాన్ని, సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతగానో సహకరిస్తుంది. అలాగే, తెలుగు సాహిత్య చరిత్ర నిర్మాణంలో డా.అద్దేపల్లి రామమోహనరావు గారి జీవితాన్ని గుర్తించడంలో గొప్ప ఆకర గ్రంథంగా నిలుస్తుందని భావిస్తున్నాను.

మిత్రులు డా.టేకుమళ్ళ వెంకటప్పయ్యగారు ఇప్పటికే కవిగా లబ్ధప్రతిష్ఠులు. అయినా కవిగా మాత్రమే కాకుండా, పరిశోధకునిగా తనదైన ప్రత్యేకతను తెలియజేసే విధంగా రూపొందిన ఈ గ్రంథం సాహితీ ప్రపంచంలో ఈయనకు సముచిత స్థానాన్ని సాధించిపెడుతుందని విశ్వసిస్తున్నాను. ■



## అక్షర నేత్రుడు

**ఆ**కు పచ్చని చీర ఆరేసినట్లుండే
నా కోనసీమ ఇప్పుడు కులసీమ అయింది
ఆత్మీయంగా ఆదరించే చేతులిప్పుడు
అవమానపు రాళ్ళను రువ్వుతున్నాయి
అపురూపంగా పలకరించే హృదయాలు ఇప్పుడు
జుగుప్సకరంగా అక్కసును వెళ్లగక్కుతున్నాయి

మేము కూడా ఈ దేశంలో పుట్టినోళ్ళం కదా!
మరి, ఊరికి దూరంగా ఉంచడం
అక్షరానికి అర్హులు కాదనడం
పంచములని ముఖాలపై ముద్ర వేయడం
ఏకవచనంతో మమ్మల్ని పిలవడం
చరిత్ర గొంతెత్తి పలికిన నిజం కాదా?
మనుషులై పుట్టి, మనుషులుగా బతకలేని మాకు
చదువనే రక్త మాంసాలద్ది, ఆత్మగౌరమనే ముఖాన్నిచ్చి
హక్కులనే చేతుల్ని మొలిపించి,జాతిని జాగృతం చేసి
అంటరానితనపు వేర్లు పెకలించి
నీలి జెండాయై రెపరెపలాడుతూ ....
వర్ణాల వాముల్ని తగలబెట్టి, అక్షరనేత్రుడైన వెలుగుతున్న
అంబేద్కర్ పేరు
జిల్లాకు పెట్టుకోవాలనుకోవడం
ఈ దేశంలో క్షమించరాని నేరమా?
కులం కొమ్మకు వ్రేలాడుతున్న కబోదుల్లారా
రాజ్యాంగం రాసింది
మాకోసమే కాదు; మీకోసం కూడా ...

- రేకందార్ గాంధీ
88972 21982



## మనిషి సంతకం

**రా**జ్యం నిండా రావణ కాష్టపు సెగలు
చుట్టుముడుతూనే ఉన్నాయి
కేవలం ఒకే ఒక్క అధికారం కోసం
కులాలు, మతాలు రగులుతూ
అధికార ఉనికి కోసం
కొత్తగా అగ్రులు చాస్తున్నాయి

పదవి కోసం కులం కుంపట్లతో
ఎన్ని కుట్రల్ని అయినా రచిస్తూ
ఉనికి కోసం ఎన్ని ప్రాణాల్ని అయినా
తృణప్రాయంగా తుంచేస్తారు

ఎన్నాళ్ళు ఇలా ఉనికి కోసం
అధికార దాహం కోసం
కులం కొమ్మలపై మతాల జాడ్యాలపై
కక్షల్ని రాజేస్తూ ఎన్నేళ్ళు ఊరేగడం?

మనిషి పుట్టుక నిజాయితీ అయినప్పుడు
కులం ఏదైనా, మతం ఏదైనా
మానవత్వం పరిమళించాలి
కట్టుబాట్లు ఎన్నున్నా
మనిషితత్వం మసిబారడం సమసాలి
సోదరత్వం రెండు భుజాలై కలవాలి
అంతరాలు సమసి
మనిషి, మరో మనసుపై
మాయని ఆత్మీయతా సంతకం
చెరిగిపోనిదై ఉండిపోవాలి...!

- మహబూబ్ బాషా చిల్లెం
95020 00415



# అన్నదాతకు దన్నుగా రైతు కవనం

- ప్రగతి

**వ్య**వసాయ సంక్షోభంతో చితికిపోతున్న రైతుకు మద్దతుగా అనంతపురంలో కవులు కవనసేద్యంతో గళాలిప్పారు. మే 28, 29, 30 తేదీల్లో అనంతపురంలో తలపెట్టిన ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర మహాసభల నేపథ్యంలో– సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో మే 21వ తేదీన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రైతు కవనం జరిగింది. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షురాలు ప్రగతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు తమ కవితలు వినిపించారు. ప్రారంభ సభలో ముఖ్య అతిథి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కు.వీరభద్రప్ప కవిత్వ సృజనతో సరిపెట్టుకోక, పాలకుల ప్రజాకంటక విధానాలకు వ్యతిరేకంగా ప్రత్యక్ష ఉద్యమాల్లో పాల్గనాలని కవులు, రచయితలకు పిలుపునిచ్చారు. సాధారణ జనానికి అర్థంకాని కవిత్వం రాయడం వ్యర్థమని అన్నారు. కీలకోపన్యాసం చేసిన ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ... ప్రాచీన, ఆధునిక సాహిత్యంలో రైతు జీవితాన్ని చిత్రీకరించిన కవులను, వారి కావ్యాలను సవివరంగా ప్రస్తావించారు. రైతు కవనాన్ని మహిళా రైతు అలివేలమ్మ ప్రారంభించారు. సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ మాట్లాడుతూ.. వ్యవసాయరంగంలో వచ్చిన, వస్తున్న మార్పులను కవులూ రచయితలూ నిశితంగా అధ్యయనం చేయాలని అన్నారు.

అనంతరం సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ సమన్వయంతో సాగిన రైతుకవనంలో అనంతపురం, సత్యసాయి జిల్లాలతో పాటు, కర్నూలు, కడప, నంద్యాల, అన్నమయ్య, నెల్లూరు, నాగర్ కర్నూలు, తూర్పు గోదావరి జిల్లాల నుంచి హాజరైన కవులు తమ కవితలు వినిపించారు. రైతు ప్రాముఖ్యతను వివరిస్తూ రాసిన కవితలు, దుర్భరమైన రైతు జీవితాన్ని ప్రతిబింబించిన కవితలతో ఆగిపోకుండా, పాలకులను తూర్పారబడుతూ రాసిన కవితలు; ఉద్యమాల ద్వారానే రైతును నిలబెట్టగలమని చైతన్యం నింపిన కవితలు కూడా వినిపించారు. రాయలసీమ రైతు ప్రకృతి చేతిలోనూ, పాలకుల చేతిలోనూ, దళారుల చేతిలోనూ మోసపోతున్న వైనాన్ని కవితల్లో హృద్యంగా పలికించారు.

*'నీవు హిమగిరియై ద్రవిస్తుంటే / పంట భాగీరథియై ప్రవహిస్తుంది;*

*నీవు హలాన్ని శ్రుతి చేస్తుంటే / బీడు నేల సామగానం వినిపిస్తుందం'*టూ రైతు శ్రమను కీర్తించారు డా. సక్కిరి భాస్కర్. జిరసం అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ తన్మయత్వంతో ఊరిని, తన వాళ్ళను గుర్తుచేసుకున్నారిలా :

*"కాడెద్దులు హలం పట్టి / చేను కావ్యం రాశాయి /*

*చేనుతలనిండా శనగపూల జాజర!/ పూడలకలలు నేలంతా దిగి / నాలోనంతా విస్తరించాయి/ బుడ్డలు బిడ్డలుగా ఎదుగుతుంటే / నాలోనూ చేను పున్నమిపంట!"*

*"రైతు మీద కవిత ఏమని రాయాలి... ఎంతని రాయాలి? రైతు ఒక మహాభారతం"* అంటూ అనంతపురానికి చెందిన కె.వెంకట రంగయ్య మట్టిమనిషిని గట్టి మనిషిగా చేయాలన్నారు. *"నీ ఉదుకు రక్తాన్ని ధారగా చేసి సేద్యకాలువలకు స్వేదపు నీటిచుక్కలుగా మార్చిన సేద్యగాడ'*ని రైతును కీర్తించారు నెల్లూరు జిల్లాకు చెందిన సయ్యద్ హయ్యూల్ హయ్యూం. *"తొంగున్న సూరీడు కళ్ళు తెరవకనే / కళ్ళు నులుముకొని పొలానికి / పయనం సాగించే రైతు / పస్తులున్నా పనివీడని కష్టజీవి"* అంటూ కీర్తించారు పోకూరి చంద్రశేఖర్. *"పట్టిన కాగితము పొలమై / అందున్న గీతాలు దున్నిన సాలలవ్వ / కలము నుండి జారిన నీలిసిరా నీరవ్వగ / కలము మొన నుండి జారిన అక్షరములు / గింజలైనవి కాగిత భువిన నిలిచి"* కవిని రైతుతో పోల్చుతూ కవిత చదివారు లక్ష్మణస్వామి.

"చుక్క దాహం కోసం / వేల మైళ్ళ పిడచగట్టిన నడక మాది/ మట్టిని నమ్ముకుని/ బతుకుసేద్యం చేస్తున్న/ కాలం నుంచి అదే వెత మాది" అంటూ రాయలసీమలో సేద్యపు వెతలను ప్రస్తావించారు ఆది ఆంధ్ర తిప్పేస్వామి. "పంట కోసం భూమిలో బోరు వేస్తే అప్పులు పడుతున్నాయ్!" అంటూ శీర్పి చంద్రశేఖర్ రాయలసీమలో రైతు దుస్థితిని వర్ణించారు. "ఊరి ఊరిలో వాడ వాడలో మా గళం వినిపిస్తాము రైతే రాజని నిరుపిస్తాము" అంటూ మద్దతు పలికారు పురుషోత్తముడు. "అదనులో వానబడెనని ఆశతోడ/ ఎరువులను విత్తనంబులనరువు దెచ్చి/ భూమిలోజల్ల వర్షాలు మోసపుచ్చు/ మెట్టరైతుకు కన్నీరు తెట్టువగును" అంటూ అచ్చమైన తేటగీతిలో ప్రకృతి, పాలకులు రైతును దగా చేస్తున్న తీరును ఒంటెద్దు రామలింగారెడ్డి ఆవేదనగా ఆలపించారు. "మంచికాలమ్ము మిమ్ము వరించగలదు/ బ్రతుకవలెనంత వరకెన్ని బాధలైన" అంటూ ధైర్యం చెప్పారు.

"రైతును ఆకాశానికెత్తే ఉపన్యాసాలు /కవుల వర్ణనలు / విశ్లేషకుల లెక్కలు /రైతుకు సేదతీరుస్తాయా?" అంటూ ప్రశ్నించారు కోటిగారి వన్నప్ప. "ఆరుగాలం శ్రమించి పండించిన /పంటంతా దళారుల చెంత చేరింది/ ముడివిప్పిన పెళ్ళాం పుస్తెలు మాత్రమే మళ్ళీ ఇంట చేరాయి" అంటూ యం.కొండప్ప దళారుల మోసాలకు బలవుతున్న రైతు వ్యథను విన్పించారు.

"ప్రతి విత్తనాన్ని/ పొలంలో విత్తుతుంటే/

పొలాన్ని శ్మశానం చేసి/ రైతుని పాతిపెట్టడమవుతుంది"

"ప్యూపా సీతకోకచిలుకై/ ఎగరలేకపోవడం చూస్తే/

వేరుశనగ పువ్వే నవ్వాల్సినవాడు/

పురుగులమందు తాగిన గొంగళిపురుగైపోతాడు" అని సేద్యమెంత వికృతంగా మారిపోయిందో చెప్పారు అంకె శ్రీనివాస్.

"సేద్యగానికి పెద్ద నేస్తగాడు రైతు కూలీ / మర యంత్రాల నూర్పిడి కింద రైతుకూలీలు నలిగిపోతున్నారు" అంటూ రైతులు, వ్యవసాయ కార్మికుల మధ్య సత్సంబంధాల గురించి చదివారు రామకొండ రామకృష్ణ. "పురాతన వస్తు ప్రదర్శనశాలలో / ముమ్ముందు చూస్తామేమో /మమ్మల్ని మేము మట్టిబమ్మల రూపంలో" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు ఆదోనికి చెందిన స్వయంప్రభ. "ఉద్యోగులకు వేతన సంఘులున్నట్లే/ మాకూ ఆదాయ కమిషన్ ఏర్పరచండి" అని ఆకుల రఘురామయ్య రైతుల తరఫున ఓ వైపు డిమాండ్ చేస్తూనే, "తిండిలేని మానవ వంగడాన్ని/ సృష్టించేదాకైనా మమ్మల్ని కాపాడుకోండి" అంటూ ప్రాధేయపడ్డారు.

"పరోపకార పరాయణుడికి/ పంటనష్టమే పురుగుమందుల/ పెరుగన్నం అవుతోంది; వ్యయప్రయాసలతో కూర్చిన సంపదను/ వరుణదేవుడి ప్రకోపానికి వాయనమిచ్చి/ ఉరితాడునే వరమాలగా వేలాడతాడు" అన్న లక్ష్మీ సుధీర్ "మన ఆయువుకు/ ఆధారమైన వాడికి/ చేయూత అవుదాం/ తన ఉనికికి మనమే ఊపిరవుదాం" అంటూ పిలుపునిచ్చారు. "పేరుకే రాజైన రైతన్న కనుమరుగైతే/ రాజ్యాలు రాజ్యాలే పస్తుండాల్సి వస్తుందంటూ" హెచ్చరించారు పూజారి ఈరన్న. "అక్షరాల విత్తనాలను/ దేశమంతా నాటుతా/ రైతుకు రచయిత తోడంటూ /మాటల యుద్ధమే సాగిస్తా"నని ప్రకటించారు జి.అశోక్ కుమార్. "రైతు మానవ సమూహ అస్తిత్వానికి భూమిక కావాలంటూ" ప్రజ్ఞా సురేష్ ఆకాంక్ష వ్యక్తం చేశారు.

"రైతు నేడు విలువలేని పాతనోట్ల రోత/ రైతు నేడు అణువణువునా/

నెత్తురు కారుతున్న గాయాల పూత" అంటూ దుర్భరమైన రైతు జీవితాన్ని అద్భుతంగా వర్ణించారు ఎం.రమేష్. "నాకు విద్యుత్ శక్తిని ఇవ్వండి/ దేశపు జీవనాడినై వెలుగులు విరబూస్తాను/ నాకు సాంకేతికతను ఇవ్వండి/ స్రష్టనై కొత్త సంస్కృతిని సృజిస్తాను/ నాకు కనీస మద్దతు ఇవ్వండి" అంటూ రైతు తరఫున అడిగారు అమళ్ళదిన్నె భరద్వాజ. అనంతలో వాన పడిన దృశ్యం ఆహ్లాదంగా కనబడుతుంది చిలుకూరి దీవెన చిత్రించిన వాన కవితలో.

"ఏ చెవిటి మేఘమో చంకనెత్తుకొచ్చిన/ చిన్నకుండ చిల్లుపడినట్లు/ పడుతోంది వాన/ రైతు చెమట, కన్నీరు మాత్రమే తాగితాగి/ పిడచకట్టుకుపోయి/ ఈసారన్నా మొలకెత్తమని బతిమాలి/ రైతు చల్లిన విత్తనాలు/ గొంతులో ఇరక్కపోయి/

నోరుతెరచుకున్న కరువు నేల/ దప్పితీరుస్తున్నట్లు/ పడుతోంది వాన; రైతుల ఆశల శిశువుకు/ ఊపిరిపోస్తున్నట్లు పడుతోంది వాన" అంటూ వాన కోసం ఎంత పరితపించిపోతోందో ఈ సీమ అన్నంత హృద్యంగా వర్ణించారు. "ఇది కల కాకుంటే బాగుణ్ణు /కనీసం మెలకువ రాకుంటే బాగుణ్ణు" అంటూ ముక్తాయించడం వాన ఎంత కరువై పోయిందో, కలయిపోయిందో అర్థమవుతుంది.

వాన కోసం పరితపించిపోతున్న వైనాన్ని డాక్టర్ ఎ.ఎ.నాగేంద్ర కూడా నానీలుగా వినిపించారు. "మా పొలం/ ముక్కుమూసుకొని /జపం చేస్తోంది/ వానబట్టు కోసం" "వానంటే/నాలుగు చినుకులే కాదు/ మా సీమ పొలాల/ గుండె తడి" అంటూ నానీల చినుకులు కురిపించారు. సోలార్ పరిశ్రమ అనంత రైతుల గుండెల మీద గుచ్చిన గునపాల్ని ఈ.రాఘవేంద్ర హృద్యంగా కవిత్వం చేశారు.

"సౌరఫలకాల పాదాలకింద నేల/ ఊపిరాడని పసికందై/ చితికిపోతుందన్న దిగులు దు:ఖం/ గునపమై గుండెలంతా/ గుదిగుచ్చి తవ్వుతున్నట్లుంది/ ఆ మట్టి అణువణువుతో/ ఇన్నేండ్ల సావాసాన్ని/ తరతరాలు నడిసొచ్చిన అడుగుల్ని/ ఎన్ని పరిహారాలైతే ఆ మమకారాన్ని/ మా బతుకుల్ని సవరించగలవు?" అని నిలదీశారు. సోలార్ పరిశ్రమతో పాటు అనంతపురం జిల్లా పొలాల్లో వయ్యారిభామలా విస్తరించిన గాలిమరల గురించి ప్రగతి ఇలా అన్నారు :

"పంట చేల నడిబొడ్డున/ నిట్టనిలువున దిగబడ్డ గునపాలు/ రైతన్న గుండెల్లో దిగబడి/ ఉసురు తీయనీకేనని/ ఎరికయ్యే నాటికి/ అంతా ముగిసిపోయింది/ నేలలో అట్టడుగున/ దాగిన నీటి చుక్కను/ గొట్టమేసి లోడుకుంటాయని/ గాలిలో తేమను పీల్చి పిప్పి చేసి/ ఎండగడతాయని తెలిసే నాటికి/ పంటచేలన్నీ మున్నూరడుగుల / కలుపు మొక్కలతో నిండిపోయినాయి" తన పొలాన్ని గాలిమరలకు ధారపోసి తన నేలపై తాను కూలీగా మారిన వైనాన్ని వ్యథను పలికించారు.

"న్యాలకు కలలుంటాయి/ యిత్తనాలు మొలుస్తాయి జన సెయితన్య కెరటాలై" అంటూ రాయలసీమ మాండలికంలో 'నాగలి కైత' వినిపించారు మడకశిరకు చెందిన డా.సి.శివన్న. సడ్లపల్లి చిదంబరరెడ్డి భరోసా లేని రైతు బతుకుల గురించి చెబుతూ రైతు బతుకును చిన్నాభిన్నం చేస్తున్న అందరినీ దుయ్యబట్టారు. వ్యవసాయంపై కార్పొరేట్ పెత్తనాన్ని విషాదంగా, వ్యంగ్యంగా పలికించిన కెంగార మోహన్ ...

"విత్తు కొత్తగా/ మొలకెత్తుతుంది/
ఇప్పుడిప్పుడే/ అందమైన అస్థిపంజరమై విరబూస్తుంది/
కలలన్నీ కళేబరాలై/ పచ్చటి పంటలౌతున్నాయి/
అదాని అంబానీలకు/ మించిన ఆదర్శరైతులున్నారా/
మోదీషాలాంటి పాలక కూలీలున్నంతకాలం/
దేశం నిండా ఎన్ని కన్నీళ్లైనా కాలువలై ప్రవహిస్తాయి" అని ఎద్దేవా చేశారు.

తరిమెల అమరనాథరెడ్డి తన కవితలో.. "క్రాప్ లోన్‌తో పంటవేసి/ సైక్లోన్‌తో పంటకోసే/ నీ సేద్యమే జూదమాయె" అని చెబుతూనే, "పిరికిగా చావకోయ్/ చేవతో పోరాడవోయ్/ పల్లెను బతికించవోయ్/ ఢిల్లీని బతికించవోయ్" అని రైతుకు ధైర్యం చెప్పారు. "చట్టాలు ఉరితాళ్ళవుతున్నప్పుడు/ అతడు తిరుగుబాటు చేస్తాడు... అతడి పిడికిలే దేశానికి ఆశాకిరణం..." అని కుమారస్వామి రైతు స్ఫూర్తిని చాటారు.

"అతడిని మాట్లాడనివ్వండి/ ఇప్పుడిప్పుడే కాస్త ప్రశ్నించడం/ నేర్చుకున్న ఆ లేత గళానికి/ అలా ఉరితాడును బిగించకుండా

అతడిని మాట్లాడనివ్వండి" అంటూ రైతు పక్షాన మాట్లాడారు యువ కవయిత్రి కొండా శిరీష. "కంప్యూటర్ల కాలమే అయినా/ రోబోలు రాజ్యమేలినా/

గుట్టలుగుట్టలుగా/ కట్టలు పేర్చినా/ అన్నదాత హలం కదలని నాడు/ జగతికి హాలాహలమే గతి" అంటూ జి.నరేంద్ర హెచ్చరించారు. "పాలకుల క్యాసినోలో/ వ్యవసాయం జూదంగా మారిందని" చింతిస్తూ ఉదయించే పిడికిళ్ల కోసం జీవించాలని పిలుపునిచ్చారు టి.వి.రెడ్డి. "రైతు పిల్లకు పెళ్లి చెయ్యలేదు/ కొడుక్కు సంబంధం లేదు" అంటూ రైతు జీవితం ఎంత దుర్భరమైందో లీలామనోహర్ బాధపడ్డారు. "ఇన్కంటాక్స్ కోసం మాటలు లేని భూమమ్మను కొంటున్న" దగాను పట్టుకున్నారు గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి. "ఇప్పుడు కావాల్సింది/ క్రాప్ లోన్లు కాదు, కాన్ఫిడెన్స్ కోటా" అంటూ మార్పుకోసం పోరాడాలన్నారు. "రైతు కూలీగా/ అసంఘటితరంగ కార్మికుడుగా/ మారిపోయి రైతు చిరునామా చిరిగిపోతోందం"టూ జూటూరు షరీఫ్ సహారా, ఆసరా, భరోసాతో అతడి కంటిలో కోటి కాంతులు నింపాలని కోరారు. "ప్రపంచ రైతుల ప్రజోత్సవానికి/ నవశక వ్యవసాయ నిర్మాణానికి/ నాందీ ప్రస్థావనలకు కదలండి!" అంటూ పిలుపునిచ్చారు డా.అంకె రామలింగమయ్య.

"కార్పొరేట్ కాకాసురుల దాహానికి/ హరిత క్షేత్రాలు యుద్ధక్షేత్రాలైనవేళ/
ధర్మాగ్రహం సత్యాగ్రహమై/ ఎర్రకోటను చుట్టేసింది/
సాయుధ దళాలకు/ సవాల్ విసురుతోంది;
చేతి కందిన పంట/ నోటి కందాలని/
సాగు చట్టాలపై సమరం/ సాగించే ఈ బల రాముళ్లకి/
మనం బాసటగా నిలుద్దాం రండి!" అంటూ కవులకు పిలుపునిచ్చారు సీనియర్ డా. రాధేయ.

ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ కవులే కాదు; ఇప్పుడిప్పుడే రాస్తున్న యువ కవులూ, విద్యార్థి కవులూ పాల్గన్నారు. వారంతా రైతుల తరఫున ఆర్తిగా కవిత్వం వినిపించారు. రైతును కీర్తించడంతోనో, రైతు వ్యథలను వల్లెవేయడంతోనో ఆగకుండా.. ఈ అరిష్టానికి కారణాలను బలంగా ఎత్తి చూపించారు. కార్పొరేట్ మోసాలను, పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. రైతుకు ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తామని ప్రతిన పూనారు.

■

## నివాళి

# రమణాచలం కన్నుమూత



**ఆ**లిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఇఎ) సౌత్ సెంట్రల్ జోన్ ఉపాధ్యక్షులు, ఐసిఇయు విశాఖపట్నం డివిజన్ నాయకులు, సాహితీ స్రవంతి విశాఖ జిల్లా పూర్వ అధ్యక్షుడు ఎన్.రమణాచలం (55) మే 8వ తేదీ ఆదివారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్నారు. విశాఖపట్నంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎల్‌ఐసి ఉద్యోగుల సంఘం నాయకునిగా, సాహితీ స్రవంతి విశాఖ జిల్లా అధ్యక్షునిగా రమణాచలం విశేష సేవలందించారు. విశాఖలోని కేర్ ఆసుపత్రిలో ఆయన భౌతికకాయాన్ని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఎం కార్పొరేటర్ బి.గంగారావు, ఎల్‌ఐసి విశాఖపట్నం డివిజన్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. రమణాచలం కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

కోనసీమ జిల్లా అమలాపురంలో 1967లో రమణాచలం జన్మించారు. 1991లో ఎల్‌ఐసిలో అసిస్టెంట్‌గా చోడవరంలో తొలి పోస్టింగ్ పొందారు. 1992లో విశాఖ డివిజన్ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. ఎఐఇఎ విధానం పట్ల తొలి సంవత్సరంలోనే ఆకర్షితుడయ్యారు. యూనియన్‌లో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించారు. ఇన్సూరెన్స్ ఉద్యోగుల సమస్యలపైనా, కేంద్ర ప్రభుత్వం ఎల్‌ఐసిని ప్రైవేటీకరించే క్రమంలో అనుసరిస్తోన్న విధానాలపైనా అలుపెరగని పోరాటం చేశారు. సాహితీ స్రవంతి రమణాచలం స్మృతికి నివాళ్లు అర్పిస్తోంది.

# శ్రీకాకుళంలో శ్రీశ్రీ జయంతి



శ్రీశ్రీ జయంతి సభలో మాట్లాడుతున్న గార రంగనాథం, పక్కన విజికె మూర్తి, ప్రభాకరరావు

**మ**హాకవి శ్రీశ్రీ జయంతి సందర్భంగా గరిమెళ్ళ విజ్ఞానకేంద్రం ఆధ్వర్యాన శ్రీకాకుళం ఎన్‌జిఓ హోమ్‌లో ఏప్రిల్ 30న సాహితీసభ నిర్వహించారు. 'భావప్రకటనా స్వేచ్ఛ'కు ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో, సాహితీకారులు యువకవులు నడుం బిగించాలనే అంతస్సూత్రంతో కవితలను ఆహ్వానించి స్వీయ కవితాపఠనం నిర్వహించారు. రాజాం రచయితలవేదిక అధ్యక్షులు, ప్రముఖ రచయిత గార రంగనాథం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పురాణాలను, ఇతిహాసాలను ప్రబంధాలను శ్రీశ్రీ బాగా చదివారు. నేటి తరం రచయితలు అనుభవజ్ఞులైన వారి రచనలను, రచనారీతులను బాగా చదివి, స్వయంకృషితో తమవైన రీతులను రూపొందించుకోవాలని సూచించారు. శ్రీశ్రీ లాగే నేనూ రాస్తానంటే సరికాదని, సాధ్యమూ కాదనీ, మంచి ఇన్పుట్ (అధ్యయనం) ఉంటేనే మంచి ఔట్పుట్ (రచనలు) వస్తాయని అన్నారు. కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు శ్రీశ్రీ కవితా ధోరణుల విశిష్టతలను వివరించారు. కె.వి.రాజారావు, పి.వి.ఎన్. మాస్టారు, సదాశివుని శంకరరావు, కె.శ్రీనివాసు, దాసుబాబు, డా.ఉదయ్ కిరణ్, డా.పద్మ, పత్తి సుమతి, సాయి కిరణ్ తదితరులు తమ కవితలు వినిపించారు. విజ్ఞానకేంద్రం అధ్యక్షులు వి.జి.కె.మూర్తి అధ్యక్షత వహించారు. రంగనాథం గారికి శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యదర్శి ఎం.ప్రభాకరరావు సభికులను ఆహ్వానించగా, పి.సుధాకరరావు ధన్యవాదాలతో సభ ముగిసింది. ■

## పురస్కారం




# సంక్షుభిత సమయాలకు ఆమె ఒక అక్షర స్వరం

- జ్యోతిర్మయి

**ఆ**మె రాసినవి ఐదు నవలలే. ప్రపంచ భాషల్లో అనువాదమై అంతర్జాతీయ అభిమానులను సంపాదించుకున్నాయి. 2018లో రాసిన హిందీ రచన 'రేత్ సమాధి' నవల లండన్ రచయిత్రి, అనువాదకురాలు డైసీ రాక్‌వెల్ 'టాంబ్ ఆఫ్ సాండ్' పేరుతో ఆంగ్లంలో అనువదించి ప్రచురించారు. ఇప్పుడా నవలే ఆమెకు ప్రపంచ ప్రఖ్యాత అవార్డు 'బుకర్‌ప్రైజ్' అందుకొని, అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టింది. ఉత్తరప్రదేశ్ మైన్‌పూర్‌లో జన్మించిన గీతాంజలి శ్రీ (64) సాహిత్యానికి అందిన పురస్కారం ఇది. వివిధ చారిత్రిక, సంక్షుభిత సమయాలకు ఆమె రచనలు అద్దం పడతాయి.

ఉత్తరప్రదేశ్ మైన్‌పూర్‌లో 1957లో గీతాంజలి జన్మించారు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగి. రచయిత. 'బహుశా నాన్నను చూస్తూ పెరిగాను కాబట్టి నాకు కూడా చిన్నప్పటి నుంచి రచనలపై ఆసక్తి కలిగిందేమో' అంటారు గీతాంజలి. 80 ఏళ్ల వృద్ధురాలు భర్త మరణం తర్వాత చేసిన ప్రయాణమే 'టోంబ్ ఆఫ్ సాండ్' ఇతివృత్తం. భర్త మరణించిన తరువాత నిరాశ నిస్పృహకు లోనైన ఆ వృద్ధురాలు విపరీతమైన ఘర్షణ మధ్య పాకిస్తాన్‌కు పయనమవుతుంది. నవలలో వివరించినట్లు దేశ విభజన సమయంలో ఆ వృద్ధురాలు ఎదుర్కొన్న సంఘర్షణ.. ఒక అమ్మగా, కూతురుగా, మహిళగా ప్రతి ఒక్కరినీ ప్రతిబింబిస్తుంది. ఈ విశ్లేషణే బుకర్ న్యాయనిర్ణేతలను ఆకర్షించింది.

'సరిహద్దు విధ్వంస ప్రభావాలకు వ్యతిరేకంగా జాతులు, మతాలు, దేశాల ముందు తక్షణ కర్తవ్యంగా నిలిచే నిరసనలకు' ఈ నవల గొప్ప ప్రేరణ అని న్యాయనిర్ణేతలు ప్రశంసించారు. 'విపరీతంగా ఆకట్టుకొన్న' పుస్తకాల్లో ఇదొకటని, 'చాలా ఉద్వేగభరిత' చర్చల తరువాత దీనిని ఎంచుకున్నామని, 'అసాధారణమైన ఎన్నో విషయాలపై ఉత్సుకత కలిగించేలా పుస్తక రచన సాగింద'ని న్యాయనిర్ణేత, అనువాదకుడు ఫ్రాంక్ వయాన్నె ఈ నవలను ప్రశంసించారు. ఇంకా 'చాలా గంభీరమైన సమస్యలను, నష్టం, మరణం, సరదా సంభాషణలతో వివిధ పాత్రలతో రకరకాల ఇతివృత్తాలతో ఈ నవల చాలా సరదాగా సాగుతుందం'టూ వివరించారు.

ఇదొక్కటే కాదు, గీతాంజలి రాసిన ప్రతి నవలా ఆద్యంతం ఆసక్తి రేకెత్తిస్తాయి. తొలి నవల 'మాయి', రెండో నవల 'హమారా షహర్ ఉస్ బరస్' 1990వ దశకంలో ప్రచురితమయ్యాయి. 'మాయి' నవల ఇంగ్లీషు అనువాదం 'క్రాస్‌వర్డ్' అవార్డుకు ఎన్నికైంది. ఆ తరువాత 'తిరోహిత్', 'ఖాలీ జగహ్' నవలలు రాశారు. కథా సంపుటాలను కూడా వెలువరించారు. ఆమె మొట్టమొదటి రచన 'బెల్ పత్ర' 1987లో ప్రచురితమైంది. బాబ్రీ మసీదు కూల్చివేత సందర్భంగా రాసిన 'హమారా...' నవల్లో అల్లర్లు జరిగిన రోజులు మారణహోమంతో అల్లాడుతున్న నగరం, ఊచకోతలు రోజువారీ జీవితంలో మారాయని, ఈ జీవనశైలి అక్కడ నివాసితుల మనస్తత్వం, వ్యక్తిత్వం, ఉనికిని దెబ్బతీస్తుందని వివరించారు. ఈ పరిస్థితులు మళ్లీ మళ్లీ రాకూడదని కోరుకుంటూనే ఆ పరిస్థితిని చాలా హృద్యంగా వర్ణిస్తూ రచన సాగుతుంది.

బుకర్ ప్రైజ్‌కు ఎన్నికైన రేత్ సమాధి నవలకు 50 వేల పౌండ్ల (దాదాపు రూ. 50 లక్షలు) సొమ్ము అందజేయనున్నారు. అనువాదకురాలితో కలసి గీతాంజలి ఆ సొమ్మును పంచుకుంటారు.

గీతాంజలి రచయితగానే కాక థియేటర్ కళాకారిణిగా కూడా విశేష ప్రతిభ చూపుతున్నారు. ప్రముఖ థియేటర్ 'వివధి'తో కలసి పనిచేస్తున్నారు. ప్రఖ్యాత నాటక రచయితలు, కళాకారులు, నృత్యకారులతో మైత్రీబంధం కొనసాగిస్తున్నారు. పలు అవార్డులు, ప్రశంసలు అందుకున్న గీతాంజలి తన రచనల్లో కష్టతరమైన కథా వస్తువులు ఎంచుకుంటారని ప్రసిద్ధి చెందారు. ప్రస్తుతం సాంస్కృతిక మంత్రిత్వశాఖ, భారత్ – జపాన్ ఫౌండేషన్ సహచరిగా పనిచేస్తున్నారు. ■

# ఆరుద్ర

జననం : 31.08.1925 మరణం : 04.06.1998



సుప్రసిద్ధ అభ్యుదయ కవి, రచయిత, పరిశోధకుడు, విమర్శకుడు త్వమేవాహంతో తెలుగు కవిత్వంలో కొత్త ప్రయోగశైలి ప్రారంభించారు. అనేక కావ్యాలు, పరిశోధనా గ్రంథాలు రాశారు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం 13 సంపుటాలు ఒక చేతి మీదుగా రచించి తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేశారు.

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 3 ▪ SANCHIKA - 9 ▪ KRISHNA ▪ June 2022
RNI NO.APTEL/2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication : 27.05.2022


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు

## సామాజిక విప్లవకారుడు పోతులూరి వీరబ్రహ్మం

సమగ్ర సాహిత్యం రచనలు



- [illegible]
- [illegible]
- [illegible] – ఎన్.గోపి
- [illegible]
- [illegible]



కాలజ్ఞాన సప్తశతి
రూ. 100/-



పోతులూరి వీరబ్రహ్మం
[illegible]
రూ. 200/-



వీరబ్రహ్మం పద్యాలు
రూ. 110/-



తత్వయోగి వీరబ్రహ్మం
రూ. 90/-



వీరబ్రహ్మం రచనలు
రూ. 70/-



విప్లవకవి యోగి వీరబ్రహ్మం
రూ. 120/-



ఆధ్యాత్మిక - సామాజిక
పోతులూరి వీరబ్రహ్మం
రూ. 40/-



[illegible]
రూ. 40/-



వేమన – వీరబ్రహ్మం –
ఒక పరిశీలన
రూ. 25/-



వీరబ్రహ్మం
కవిత్వం : కవిత్వాంశాలు
రూ. 45/-

ప్రజాశక్తి బుక్‌హౌస్
9490099057

20% ప్రత్యేక తగ్గింపుతో...

విజయవాడ : 9490099055
విశాఖపట్నం : 9490099058
గుంటూరు : 9490094430
ఏలూరు : 9440013188
ఒంగోలు : 9492292038
నెల్లూరు : 9490099279
కర్నూలు : 8500042738
అనంతపురం : 9554223317

Prajasakti Printers & Publishers.P(Ltd)
SBI A/c : 35712952033
IFSC Code : SBIN0001008
Governorpet Branch, Vijayawada

గూగుల్ పే, ఫోన్‌పే నెం : 9490099258
రిజిస్టర్ పోస్టులో పంపుతాం

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533
బ్రాంచీలు : విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ, ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం